# అభిసారిక

FEB '56

8 అణాలు



## ఈ సంచికలో

ధనికొండ, హేవలాక్ ఎల్లిస్, వనశ్రీ, శార్వరి, ఎ. సూర్యారావు మొదలైనవారి రచనలూ, ఆకర్షణ-ఆభరణాలు, శిలాశిశువులు, వార్తా ప్రపంచం, మొదలైన వైజ్ఞానిక వ్యాసాలూ, అవీ, ఇవీ, ఇంకా ఎన్నో....


ఫిబ్రవరి సంచిక విడుదలైంది

# జ్యోతి

ఎడిటర్: ధనికొండ

ఈ సంచికలో—భరద్వాజ, రామకృష్ణ, సులోచన, దక్షిణామూర్తి, కె. పి. బాబు, వి. యస్. చెన్నూరి, కమలలత, హేమంత కుమార్, గోపాలకృష్ణమూర్తి మొదలైనవారి కథలు, రావికొండలరావు నాటిక, వజ్రపాణి, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వరరావు, ముని కన్నయ్య, రామబ్రహ్మం, రమాదేవి, శేషగిరిరావు గారల గేయాలు; లోకసంచారం, గ్రంథ సమీక్షలు, నవ్వుపువ్వులు, తలపుల తావులు, బుల్లి కథ, ఉత్తమకథానిర్ణయానికై పఠితల ఆహ్వానం... ఇంకెన్నో ఆకర్షణలు.

త్రివర్ణ ముఖచిత్రం

విడి ప్రతి: 0-8-0 సం. చందా. 6-0-0

వివరాలకు:

జ్యోతి కార్యాలయం,

మద్రాసు-17.

పెద్ద ప్రోగ్రాం!　　పెద్ద ప్రోగ్రాం!

80 క్షేత్రములు.　7 వేల రైల్వే మైళ్లు.　90 రోజులు.

తేది 27-4-56 రాత్రి 9 గం, విజయవాడ నించి

# బదరీ—పంచద్వారకల
# సంపూర్ణ ఉత్తర దేశయాత్ర

3వ తరగతి రెండుపూటలు భోజనముతో రు 450

1వ తరగతి పై విధముగా రు 850

ప్రదేశాలు, సింహాచలం, పూరి, కలకత్తా, గయ, కాశీ, అయోధ్య, ప్రయాగ, హరిద్వార్, బదరీనారాయణం, బ్రహ్మకపాలం, అమృతసర్, ఢిల్లీ, మథుర, బృందావనం, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, జయపూర్, ఉదయపూర్, అజ్మీర్, పంచద్వారకలు, మాతృగయ, పోర్‌బందర్, ఆబూ, అహమ్మదాబాదు, ఉజ్జయిని, నాసిక్, బొంబాయి, పూనా, అజంతా—ఎల్లోరా, షిర్డీ, మద్రాసు, కంచి, మహాబలిపురం, వగైరా ఇంకెన్నో స్థలాలు.

ఇంత పెద్ద ప్రోగ్రాం ఏ యాత్రా సర్వీసువారూ వేసియుండలేదు. సీటుకు రు 50/ చొప్పున కావలసిన సీట్లకు వెంటనే అడ్వాన్సు పంపి రిజర్వు చేసుకోండి- 1 వ తరగతి టిక్కెట్లు బహుకొద్దిగానే యున్నవి—

వివరములకు :

## శ్రీ పార్థసారథి ట్రావెల్ సర్వీసు

హెడ్డాఫీసు,<br>పులిపాటివారి వీధి<br>విజయవాడ-1.

బ్రాంచి:<br>అరుముగ చెట్టి వీధి<br>ట్రిప్లికేన్, మద్రాస్-5.

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాస పత్రిక

సంపాదకుడు: ధనికొండ హనుమంతరావు

సంపుటి: 4 | ఫిబ్రవరి, 1956 | సంచిక: 2

భారత ప్రభుత్వం అక్రమ సంతానాని కూడా ఆస్థిలో భాగా స్నివ్వటాన్ని గూర్చిన బిల్లును ప్రవేశపెట్టటం, కొంతమందికి కంటక ప్రాయంగా వుంది. కొన్ని పత్రికలవారు 'ఇది వ్యభిచారాన్ని ప్రోత్స హించటం' అన్నారు.

ఐతే సమాజంచేత ఆమోదించబడి, యీ పెద్దల ఎదుట జరిగిన వివాహంవల్ల కలిగే సంతానానికే ఆస్థి హక్కులు అనే సిద్ధాంతం కలకాలంగా వుంది. వివాహంలో దంపతులు చేసుకునే వాగ్దానాలూ, శపథాల్ని మరిచి, యీ పెద్దల కన్నులు కప్పి, చాటుగా ఏ ఉంపుడు కత్తె వల్లనో కన్న సంతానం ఆ పురుషునిది కాదా? భేదమల్లా యీ పెద్దల సమక్షంలో ఆ వివాహం జరగ లేదు. అంత మాత్రాన ఆ సంతానం చేసిన నేర మేమిటి?

క్రమ సంతానానికీ అక్రమ సంతానానికీ ఎవరైనా భేదాన్ని చూపగలరా? అసలు కనుక్కో గలరా? సమాజం కొంత మందిని

క్రమ సంతానం గానూ, మరి కొంత మందిని అక్రమ సంతానం గానూ ముద్ర వేయటంవల్ల, ఎన్ని అనర్థాలు వొస్తూన్నవి!

సంతానానికి ఎవరు కారకులో, వారే ఆ సంతాన పోషణ భారాన్ని వహించటం సబబు. ఐనప్పుడు ఆ తండ్రి విధిగా తన ఆస్థిలో భాగాన్ని పంచి ఇవ్వవలసిందే. అది వ్యభిచారాన్ని ప్రోత్సహించటమనే పెద్దలు, శిక్షలు వల్లించటం కన్న, అసలు వ్యభిచారమే జరగకుండా చూడగలుగుతే తమ విధిని నిర్వర్తించినవా రవుతారు.

★



# వార్తాప్రపంచం

రష్యానుంచి వొచ్చిన యుజ్ బెకిస్థాన్ కళాకారులు తమ శిరోజాలను మృదువుగానూ, ఠీవిగానూ, అందంగానూ, మెరుపుతోనూ ఎలా వుంచుకో గలిగారోననే సందేహం చాలామందికి కలిగింది. వారు చెప్పిన జవాబిది: ఇండియాలో తయారైన పెరుగును శిరోజాలకు ట్టించి, షాంపూవలె ఉపయోగించటం వల్లనే వారి కేశసౌందర్య స్యంగా వెల్లడించారు!

★

కృత్రిమమైన యోగనిద్రను (హిప్నాటిజమ్) కలిగించటంవల్ల, పురిటి నెప్పులు స్త్రీకి తెలియకుండా ఉండటాన్ని కల కాలంగా ప్రపంచంలో అనుసరించ బడుతూనే వుంది. యీమధ్య టెక్సాస్‌లో యోగనిద్రను కలిగించటంలో సాధన చేస్తున్న ఒకాయన, తన భార్యకు యోగనిద్ర కలిగించి పురుడు పోయించాడు. 'అదొక దివ్యానుభవం. నాకసలు నెప్పులే తెలియ లేదు' అందామె, 7¼ పౌనుల ఆడపిల్లను కన్నతర్వాత. మందు మాకుల ఉపయోగం లేనందువల్లా, కేవలం మనస్తత్వ శాస్త్రంతో సాధించటం వల్లా, యీ పద్ధతి చాలా ఉత్తమ మైనది!

★

ఇంగ్లండ్‌లో భర్తలచే వదిలివేయబడిన భార్యలు ప్రభుత్వానికి పెద్ద భారంగా వున్నారు. యీ అనాథ స్త్రీలకోసం పన్నుల మూలకంగా సుమారు ఏటా 4 కోట్ల 60 లక్షల రూపాయలు వసూలు చేయబడుతున్నవి. ఇలాటి అనాథలు 40,000 మందిదాకా వున్నారు.

ఇకముందు భర్తలే, తమచే వదిలివేయబడిన భార్యల్ని పోషించేందుకు వీలుగావుండే చట్టాన్ని అమలు జరపాలని చూస్తున్నారు.

★

యీ మధ్య ఒహియోలో ఒక విచిత్రం జరిగింది. నెలలునిండిన ఒకానొక స్త్రీని ధనాశతో, దొంగలు కత్తితో విశేషంగా గాయ పరిచారు. ఆమెను ఆసుపత్రికి జేర్చేప్పటికే కొన ఊపిరితో వుంది. డాక్టర్లు త్వరపడి శస్త్రచికిత్స ద్వారా లోని బిడ్డను బైటికి తీశారు. శస్త్రచికిత్స జరుగుతూండగానే తల్లి మరణించింది. కాని శిశువు ప్రాణంతో బైట పడ్డాడు. యీ శిశువు బతికే అవకాశాలు బాగా ఉన్నవని డాక్టర్లు అంటున్నారు.

★

ప్రపంచంలోకల్లా పొట్టిమనిషి 1955 జనవరిలో మృత్యువాత పడ్డాడు. అతను జర్మన్ దేశస్థుడైన వాల్టర్ బొహెనింగ్. అతని వయస్సు 48 సంవత్సరాలు. ఎత్తు 1 అడుగు-10½ అంగుళాలు!

★

డి. డి. టి. క్రిమి సంహారిని మానవులు తినటంవల్ల ఏమైనా ప్రమాద మున్నదా అనే పరిశోధనలు యీ మధ్య అమెరికాలో జరుప బడినవి. యీ పరిశోధనల అవసరం ఎందుకు కలిగిందంటే, పంటలమీద క్రిములనూ, పురుగుల్నీ రూపుమాపేందుకు గాను డి. డి. టి. చల్లడం జరుగుతుంది. ఆహార పదార్థాల్లో కొద్దిగానన్నా, దాని వాసన రాక మానదు.

దీనికి గాను 200 మంది తమమీద పరిశోధనలు జరిపేందుకు ఒప్పుకున్నారు. వీరు ప్రతిరోజూ, ఎంత తక్కువ మోతాదులో ఆహారంలో డి. డి. టి. కలిసేందుకు అవకాశం వుంటుందో, దానికి 200 రెట్లు అధిక పరిమాణాల్లో డి. డి. టి. ని ఆహారంలో తీసుకొన్నారు. ఇందువల్ల వారి ఆరోగ్యంలో ఏ విధమైన మార్పూ రాలేదు.

★

మానసిక శాస్త్ర రీత్యా కాన్పును తేలిగ్గానూ, బాధా రహితం గానూ చేయటాన్నికూడా కాథలిక మతగురువులు ఇదివరకు ఒప్పుకునే వారు కారు. ఇప్పుడు యీ పద్ధతికి కాథలిక్ మతం నిరసనలు చెప్ప దని పోప్ అన్నారు.

మానసిక శాస్త్రీయ పద్ధతులు వేల కేసుల్లో రష్యాలోనూ, చైనాలోనూ ఉపయోగ పడుతూన్నవి. పశ్చిమ దేశాల్లో యీ పద్ధ తుల్ని చాలా తక్కువగా ఉపయోగిస్తున్నారు. యీ కేసుల్లో నూటికి 85,90 వరకూ, బాధారహితమైన కాన్పులకు సహాయపడుతూన్నవి.

యీ పద్ధతిలో ముఖ్యంగా తల్లి, కండరాల వొత్తిడికి అను గుణంగా రిఫ్లెక్సు యాక్షన్‌ను సృష్టించుకోవటానికి అలవడుతుంది.

★

700 మంది ప్రముఖ వైద్యుల్ని సంప్రదించాక పోప్ చర్చి నిర్ణయాలను తెలియ పరిచాడు. యీ పద్ధతి నైతిక విలువల్ని పాడు చేయదని తన అభిప్రాయంగా పోప్ వెల్లడించాడు.

★

పరిష్యాలో ఏటా 700నుంచీ 1,200 టన్నులవరకూ నల్లమందు తయారవుతూ వుంటుంది. వివిధ దేశాల్లోకి ఇది దొంగతనంగా కొని రాబడుతూండటం, ఇతర దేశాలవారికి కంటకప్రాయంగా పరిణ మిస్తోందని యునైటెడ్ నేషన్స్, ఆర్థిక శాఖవారు అన్నారు.

న్యాయ సమ్మతమైన వాడకానికి, ప్రపంచం మొత్తానికి రెండేళ్ళపాటు సరిపడే నల్లమందు నిలవలు, యీ నాడు పరిష్యాలో ఉన్నవని అంచనా వేయబడింది.

1953 లో 1,295 టన్నుల నల్లమందును తయారుచేసిన పరిష్యా, 1954 లో 773 టన్నులే తయారుచేసింది; నూటికి 40 పాళ్ళ తయారీ తగ్గింది.

ఇండియా, పాకిస్థాన్, పరిష్యా దేశాల్లో క్రమంగా నల్లమందు తయారీని తగ్గించే ప్రయత్నాలు ఆరంభమైనవి.

★

పుట్టబోయ్యే శిశువు ఆడా మొగా అనే విషయాన్ని మానవుడు శతాబ్దాల తరబడిగా, కనుక్కొనేందుకు శతవిధాల ప్రయత్నిస్తూనే వున్నాడు. అనేక పరిశోధనలూ, పద్ధతులూ ప్రవేశపెట్టాడు కాని, ఏ వొక్కటీ తృప్తికరమైన ఫలితాన్ని ఇవ్వలేదు.

ఇలాటి పద్ధతుల్లో అతి నవీనమైన దాన్ని ఇజ్రయిల్ శాస్త్రజ్ఞులు ప్రవేశపెట్టారు. యీ పద్ధతిలో పిండంచుట్టూ వున్న ద్రవపదార్థంలోని సెక్స్ సెల్స్ పరీక్షించబడి, బిడ్డ ఏ జాతికి చెందిందో నిర్ణయించ బడుతుంది. వీరు పరిశోధించిన 20 కేసులూ నూటికి నూరుపాళ్ళు విజయవంతమైన ఫలితాల్నిచ్చినవి.

ఐతే యీ ద్రవాన్ని తీయటం తొమ్మిదో మాసంలో జరుగుతోంది. అంతకన్న ముందుగానే ద్రవాన్నితీసి చెప్పగలిగే ప్రయత్నాలు జరుగుతూన్నవి.

★


యుద్ధానంతరం మొట్ట మొదటి సారిగా, లండన్ నగరంలోని జననాల సంఖ్య తగ్గుదల సూచించిందని, 1955 జననాల అంచనాలు చెపుతూన్నవి.

1946 లో ప్రతి 1,000 జనాభాకూ ఏటా 20 జననాలు జరిగినవి; యుద్ధానికి ముందు యీ రేటు 13.8 మాత్రమే! 1955-వ సం. లో 49,700 జననాలలో, 37,500 మరణాలూ సంభవించినవి. 1955 జననాల రేటు ప్రతి 1,000 జనాభాకూ 15 మాత్రమే ఉన్నవి.

★



# వివాహ చరిత్ర



హావలాక్ ఎల్లిస్ ఆధారంగా
రచన క్రాంతినాథ్

యీ ఇతర విధానాలవల్ల సమాజంలో అవినీతి పెరుగుతోందనే వాదనకూడా వుంది కాని, అందుకు మారుగా వివాహమే సమస్యా పరిష్కారమనుకుంటే, అది మరింత ప్రమాదానికి దారి తీస్తుంది.

అర్హతల్ని చూడకుండా అందర్నీ ఏదోవిధంగా దంపతులుగా చేయ తల పెట్టటం జాతిని నాశనం చేసుకోవటమే అవగలదు. ఏ సమాజానికైనా సత్సంతానము అవసర మనుకున్నప్పుడు స్త్రీ పురుషుల కలయికల్ని, ముఖ్యంగా దంపతులయ్యే వ్యక్తుల్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఐతే నాగరికత పెంపొంద సాగాక వ్యక్తిగతమైన స్వేచ్ఛ కూడా అధికమైంది. ప్రణయం నిత్యజీవితంలో తీవ్రంగా ప్రవేశించి, ప్రణయం ముందు మిగతా విషయాలన్నీ అల్పమై పోయినవి. ఆ యవ్వనోద్రేకంలో మిగతా ప్రపంచంలో గమనించదగిందీ, జాగర్త పడవలసిందీ 'ప్రణయం' తప్ప వేరేమీ కాదు. ప్రణయమే ఆధారంగా జరిగే వివాహంలో కలిగే సంతానం ఎలాటిదో, ముందు ముందు దాంపత్యంలో ఎదురయ్యే సమస్యలరూపం ఎటువంటిదో తెలుసుకునేటంత తీరిక కూడా ఉండదు. శాస్త్రీయ దృక్పథాన్ని కూడా ప్రణయం అధిగమిస్తోంది. ఒక దాని కొకటి అవినాభావ సంబంధాన్ని కలిగి ఉండటం వల్ల యీ సమస్యలు పోను పోను చిక్కుదార్లకు లాగుతుంది.

## దాంపత్యం : వ్యభిచారం

పైన చెప్పిన కేసర్ లింగ్ అభిప్రాయాన్ని కాస్త చర్చించవలసిన అవసరం వుంది. 'ప్రపంచం పుట్టినప్పటినుంచీ వ్యభిచారం ఏదో వొక రూపంతో ఉండనే

వుంది.' అన్నా డాయన. నిజమే అవుగాక! కాని అంత మాత్రాన అది ఎప్పుడూ ఉండవలసిందేనా? దాన్ని సమాజం ఆమోదించ వలసిందేనా?

వ్యభిచారం - విశేషించి, దాంపత్య జీవితంలో జరగటం వల్ల, వివాహపు తంతు తాలూకు పవిత్రత భగ్న మౌతుంది; ఆ దాంపత్యంలో కలతలు ఆరంభ మౌతవి. ఇక పురుషుడు తనను తాను మరిచిపోయి, తన భార్యనూ, ఆమె ప్రియుణ్నీ కూడా వధించిన అనేక సంఘటనలు, దేశదేశాల్లోనూ జరిగినవి; జరుగుతున్నవి. వివాహ సంస్థ తాలూకు పునాదిని కదిపేందుకు వ్యభిచారం ఒకభూకంపం లాంటిదే ననటం అతిశయోక్తి కాదు.

వ్యభిచారాన్ని రుజూజేయటం ఒక బాధ్యత. తీరా రుజూ చేసినట్లయితే విధించబడే శిక్షల్లా ఆ దాంపత్యం విచ్ఛిన్నమవటమే! అనాగరిక జాతుల్లోవలె వ్యభిచరించిన ఇల్లాలిని ఉరి తియ్యడంలాటి శిక్షలు నాగరిక ప్రపంచంలో లేవు. ఇలా విడిపోయిన దంపతులు తిరిగి వేరొక వివాహ సంబంధాన్ని ఏర్పచుకొనే అవకాశాన్ని విడాకులు కలిగిస్తూనే వుంది.

'వ్యభిచారం' అనే కారణం స్త్రీకి వర్తించినంత తీవ్రంగా పురుషునికి వర్తించకుండటంతో, సమాజంలోని స్త్రీస్థానం మరోసారి రుజూ అవుతూనే వుంది. వివాహ కాలంనాటి వాగ్దానాలూ, మంత్ర తంత్రాలూ క్షణికంగా వుండి, అప్పటి కప్పుడే గాలిలో కలిసి కరిగిపోయినవి. తీరా నిత్య జీవితం, తాము కన్న కలలకు విరుద్ధంగా వుండి పోతోంది.

విడాకుల పద్ధతి వల్ల వ్యభిచార నేరానికి విధించబడే శిక్ష చాలా సులువుగానూ, ప్రమాదకరం లేనిదిగానూ రూపొందింది. విడాకుల చట్టంతో, వ్యభిచార నేరమే విడాకులు పొందేందుకు తగినంత కారణంగా పేర్కొన బడటం వల్ల యీ చట్టమే విడి పోదల్చుకున్న దంపతుల్లో ఒకర్ని వ్యభిచారం వైపు తరుము తోందనేందుకు ఆధారాలు లేకపోలేదు. స్త్రీని పురుషుడు స్వంత ఆస్థిగా కాపాడు కుంటూ ఆమెను ఒక విలువైన వస్తువుగానే భావించడమనేది యీనాటి దాంపత్య జీవనంలో కూడా చూడ నవుతోంది.

కాని దాంపత్యంలో జరిగే వ్యభిచారానికి బాధ్యులు ఎవరనే ప్రశ్నవొస్తే, నిజంగా ఆ నేరం చేసినవారే కాదనేది అర్థమవక పోదు. దంపతుల్లో ఒకరు-దాంపత్యానికి బైట అనుభూతిని పొందేందుకు ప్రయత్నించటం జరిగిందంటే, దానికి వెనువెంటనే మనం చెప్పగల కారణం, ఆ దాంపత్యంలో ఆ వ్యక్తికి కావలసిన ఆనందం లభించ కుండటమూ, అది ఇతరత్రా లభించటమూను. ఐనప్పుడు, ఆ లోప మేదో అమాయకులుగా కనిపించే వారిలోనే ఉండీ ఉండాలి కదా!

## ప్రణయం : అసూయ

ప్రణయ మున్నచోటనే అసూయ కూడా వుంటుంది. తాను గాఢంగా ప్రేమించే వ్యక్తి ఇతరుల్ని ప్రేమిస్తున్నప్పుడే కదా అసూయ కలిగేది! ఐతే యీ అసూయ ప్రణయాన్ని పెంపొందిస్తుందా, లేక దానికి ప్రమాదకరంగా పరిణమిస్తుందా అనే ప్రశ్న వొస్తే, రెండో పరిణామానికే దారి తీస్తుందని చెప్పవలసి వుంటుంది.

నాగరికత పెంపొంద సాగాక, యీ అసూయకు విలువ తగ్గ నారంభించింది. అసూయ పడటం వ్యక్తి సంస్కార స్థాయిని తగ్గిస్తోంది. కాని అసూయ ఎంత నీచమైనదైనా, స్వభావ సిద్ధమయినదే నని అనేందుకు సందేహం లేదు. వ్యక్తి ఆత్మగౌరవాన్ని కాపాడుకో నేందుకు, అసూయ ఒక ఆశ లాంటిది. తగినంత ఆహారం ఉన్నప్పుడు గూడా జంతువులు, ఒక దానిపట్ల మరొకటి అసహనంగా ప్రవర్తించటం నిత్యమూ మనం చూస్తూనే ఉన్నాం. మానవ జీవితంలో, అసూయ ద్వేషించ దగ్గదైనా, స్వభావ సిద్ధమయినదే గనుక, అది ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతూనే ఉంటుంది.

## అసూయ : ఆదిమ మానవుడు – ఆధునిక మానవుడు

మానవుడు సంస్కర్త కాసాగాక, అసూయకు కేవలం బానిసవటాన్ని తగ్గించుకో సాగాడు. సంస్కారి అసూయ ద్వారా, ప్రణయాన్ని క్రమ శిక్షణలో ఉంచుకోన గలగాలి. మొదట మొదట, అసూయ ప్రణయ తీవ్రతను సూచించేదిగా ఉన్నప్పటికీ, క్రమంగా ప్రణయానికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అసూయవల్ల మానవుడు, మానవత్వాన్ని మరిచిపోవడం త్రాగుబోతులా ప్రవర్తించడం, ఏదో అదృశ్య శక్తికి బానిస గావడం జరుగుతుంది. జీవితం అతని నుండి దూరమయినట్లే, ప్రణయం కూడా దూరమవుతుంది. అయితే, అసూయను జయించటమనేది, మాటలు చెబుతున్నంత తేలిక కాని మాట నిజమేగానీ, దాన్ని సాధించందే దాంపత్య సౌఖ్యం పూర్ణంగా అనుభవంలోకి రాదు. దాంపత్య సౌఖ్యాన్ని అను అనుభవించగోరేవారు, విధిగా అసూయను జయించి తీరవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అసూయ విషక్రిమి లాంటిదైనా, అది పెరిగే వాతావరణం కృత్రిమమైనది. ఈ వాతావరణం, వ్యక్తిగతాభిరుచుల మీద, తత్వాలమీద, సామాజిక కట్టడుల మీద, అర్థంలేని ఆచారాలమీద, ఆదర్శాల మీద ఆధారపడి ఉంటుంది.

దాంపత్య జీవన సౌఖ్యం, కేవలం ఒకరి కొకరు చేసుకొనే బాసల మీదనే ఆధారపడి వున్నట్లయితే, దంపతుల్లో ఏ ఒకరి అపేక్ష అయినా, మరో వ్యక్తిపట్ల ప్రసరించడం జరిగితే—అదే చాలు వివాహ సంస్థపునాదులను కూల్చివేస్తుంది. ప్రతి యుగంలోను ఒకరి నొకరు గాఢంగా విశ్వసించి, అది లేనిదే, ఆ వివాహానికి అర్థమే

లేదని నమ్మి అనుసరించిన వారున్నారు. అయితే వారు అనేక కష్టాలను ఎదుర్కొని, అసూయ తాలూకు విషాన్ని కూడా భరించి, జయించడం ద్వారా, ఆదర్శ ప్రణయమూర్తులైనారు.

వివాహానికి ముందు చేసుకొనే బాసల వల్ల, కాబోయే దంపతులు ఒకరిపట్ల మరొకరు జాగ్రత వహించటం సహజమే! అంతకన్న ఎదుటి వ్యక్తి నీతి తప్పటం జరుగుతుం దేమోననే కాపలా వుంటుంది. యీ విధంగా ఒకరి నొకరు పరిపూర్ణంగా విశ్వసించటానికి మారుగా, ఒకరి కొకరు వలపన్నటం జరుగుతోంది.

అంతకన్న ఉభయులూ ఒకరి నొకరు అర్థం చేసుకొని, వారి వారి భావాల్ని వెల్లడించగలుగుతే, ఆ సంబంధం శాశ్వత మవగలదు. వివాహం ఎంత పవిత్రమైన దైనప్పటికీ, లైంగిక వాంఛల్ని తీర్చుకోవటం నీచమైనది కాదనే అభిప్రాయం లేనిదే దానికి అర్థమే ఉండదు. దంపతులు ఒకరి పట్ల వేరొకరు చూపే సానుభూతి ద్వారానే ప్రణయాన్ని ఉపాసించ గలుగుతారు. అప్పుడే అసూయ అంటూ వున్నప్పటికీ, అది ప్రణయానికి చేదోడు వాదోడుగా ఉండి, ఉత్సాహపరుస్తుందే కాని, ప్రమాదకరంగా పరిణమించదు.

## కాలగమనం : మార్పులు

కాలగమనాన్నిబట్టే మానవుడు ఎంతగానో మారుతూ వొచ్చాడు; ఈ మార్పులు ఇక ముందు కూడా తప్పవు. మాధ్యమిక యుగంలో, కొన్ని కుటుంబాల్లో తప్ప, వలపును పెంపొందించుకునే యీ నాటి ఆధునిక పద్ధతుల తాలూకు పునాదులు కూడా కనిపించవు. యీ కుటుంబాలైనా, ఆ నాటి సామాన్య ప్రజా జీవితానికి చాలా దూరంగా, రహస్యంగానే నాగరికతను సూచించే విధానాలను అనుసరించేవారు. పోతే పల్లెల్లో జీవితాల్ని గడిపేవారు, యీ వలపును గూర్చి ఎరుగనే ఎరుగరు. వలపు ఎంత గొప్పగా పెరిగినప్పటికీ పర్యవసానం స్త్రీ పురుషుల కలయికే ఐనప్పటికీ, వారు చివరకు ముద్దునుగూర్చి కూడా తలిచేవాళ్ళు కాదనటం అతిశయోక్తి కాదు.

నాగరికతను ఉపాసిస్తున్నామనుకునే కుటుంబాల్లో కూడా ప్రణయోపాసనకు అవకాశం ఉండేది కాదు. యీ కారణంగా వారికి 'ప్రణయకళ' అనేది బొత్తిగా తెలియక, నేటి ప్రాపంచిక దృష్టిలో, నీచాభిరుచుల్ని, వెల్లడి చేసేవిగా తోస్తవి. వైవాహిక జీవితంలో ప్రణయానికి తావు లేనట్లయితే, అది కేవలం శారీరక అవసరంగానే ఉండిపోయి, హృదయంకూడా తృప్తిపడేందుకుగాను, దాంపత్య జీవితానికి బైట స్నేహాలూ, వలపులూ పెంపొందించే అవకాశాల్ని కలిగిస్తుంది.

విశేషించి స్త్రీ తన శరీరాన్ని హృదయపూర్వకంగా, పరిపూర్ణంగా పురుషునికి సమర్పించేందుకు, దాంపత్య బంధన మొక్కటే ఉపకరిస్తుందనుకుంటే

మంత్రాలకు చింతకాయలు రాలినట్లే అవుతుంది. యీ పరిపూర్ణ వశీకరణానికి మధ్య ఎన్నో అంతస్థు లున్నవి; అవిక్రమంగా సాధించబడవలసిందే కాని, బలాత్కారంతో సామాజిక కట్టడుల వల్ల సాధించబడేవి మాత్రం కావు. ఒకరి నొకరు అర్థం చేసుకోవటం, యావత్ ప్రపంచంలోనూ తాను నమ్మదగ్గ, ఆధారపడదగిన వ్యక్తిని గుర్తించటంలోనే దాంపత్య జీవితం తాలూకు విజయం ఆధారపడి వుంటుంది. ఇది సాధించ బడినప్పుడు స్త్రీ కూడా తన బలహీనతల వల్ల, తా నీ బానిసత్వానికి ఆహుతయ్యాననే భావనలో ఉండక తను తగినవ్యక్తి రక్షణలో ఉన్నట్లు ఆనంద పడగలదు.

వివాహానికి సాంఘికమైన గౌరవమర్యాదలూ, విలువలూ ఎన్ని అంటగట్టబడి ఉన్నప్పటికీ, దంపతుల్ని దరిజేర్చి అనురాగాన్ని పెంపొందింపజేసి ఉభయులూ ఏకత్వంలో సంచరించ గలిగినవాడే, వివాహ వ్యవస్థ నిత్యజీవితంలో నిజమైన విజయాన్ని సాధించినదిగా మనం గుర్తించ వలసి వుంటుంది.

## వివాహం : నాడు – నేడు

మానవుడు సృష్ట్యాదినుంచీ దీర్ఘంగా ఆలోచిస్తూనే ఉన్నాడు; అతని ఆలోచనకు అంతులేదు. ఆలోచనలు విశిష్టరూపాన్ని దాల్చక ముందే నిత్యజీవితంలో మార్పుల్ని ప్రవేశపెడుతున్నాడు. యీ విధంగా కాలచక్రంతోబాటే అతను కదిలిపోలేనట్లయితే, ఏనాడో నశించేవాడేమో కూడాను.

ఇలాటి మార్పులు క్షణక్షణమూ అతి సహజంగా జరుగుతూనే ఉన్నవి. యీ మార్పులు వివాహ వ్యవస్థనే తారుమారు చేస్తూ, పదాల అర్థాలను, వివాహం తాలూకు ఆశయాలనూ, తరతరాలుగా అనుసరించబడే ఆచారాలను ఏ విధంగా మార్చుకుంటూ వొచ్చినవో చరిత్ర తిరగేస్తే అర్థం గాకపోదు.

మూడు దశాబ్దాల క్రితం విధవా వివాహాన్ని సమాజం అంగీకరించ లేదు; కాని యీనాడు విధవా వివాహాన్ని గూర్చి, చర్చించే వారుకూడా లేరు. అదే విధంగా అర్థ శతాబ్దం క్రితం వధూవరులు పెళ్ళికి ముందు కనీసం ఒకర్నొకరు చూసుకోటమన్నా లేదు. కాని క్రమంగా వధూవరులు పెళ్ళిచూపులకు అనుమతించబడటం ఆచారమైంది. యీ విధంగా ఆచార వ్యవహారాల్లో ఎన్నో మార్పులు వొస్తూనే ఉన్నవి.

ఇలాగే వివాహ విధానంకూడా మారింది. ఇప్పుడు ఐదు రోజుల పెళ్ళిళ్ళు చేసేవాళ్లు బహుకొద్దిమంది. ఏ తిరుపతి కొండ మీదనో ఐందంటే ఐందనిపించటం కూడా మనకు తెలియంది కాదు. ఇంకా ఆధునికులు పూలమాలల్తో సరిపెట్టటంకూడా జరుగుతూనే వుంది. మరి కొంతమంది రిజిష్టర్ పద్ధతి వివాహాల్నికూడా జరుపుకుంటూనే ఉన్నారు. మానవుడి కాలం విలువ పెరిగేకొద్దీ, ప్రతి ఆచారానికీ సంక్షిప్త స్వరూపం అవతరిస్తూనే వుంది.

వివాహంకూడా ఒక రకం 'సమాజంచే అనుమతించబడిన వ్యభిచారం' అనే అభిప్రాయంగల వారు కూడా ఉన్నారు. ఐతేసమాజం వ్యభిచారానికీ, దాంపత్య జీవితానికీ భేదాన్ని ఎత్తి చూపి, విచ్చలవిడి జీవితం కన్న సర్వోత్తమమైన దాన్ని సృష్టించేందుకే వివాహ సంస్థను నెలకొల్పిందనేది నిర్వివాదం. ఐతే సమాజపు టాశయాన్ని రుజూ చేయవలసిన బాధ్యత నేటి యువతీ యువకులమీద వుంది.

సరిగ్గా అర్ధ శతాబ్దం క్రితం సెక్సునుగూర్చి మాట్లాడటం, నిత్యజీవిత సత్యాలను తెలుసుకోవటం గొప్ప నేరంగానూ, నీచాభిరుచుల్ని వెల్లడించేదిగానూ భావించబడేది. చివరకు వైద్యవిద్యలోకూడా 'సెక్సు'ను గూర్చి తెలుసుకోవటానికి చెప్పేందుకు భయపడ్డారు. ఇక యీనాడు మనం శాస్త్రీయ దృక్పథంలో తెలుసుకోవాల్సిన లైంగిక విషయాల్ని బాహాటంగా తెలుసుకోగలుగుతున్నాం. ఒకనాడు నేరంగా భావించబడేది, యీనాడు అవసరంగాకూడా మారింది.

ఇలాటి మార్పులతో కూడుకొన్న వివాహచరిత్ర తాలూకు వర్తమాన స్థితి ఏమిటి? అసలు వర్తమానానికి విలువ ఏమిటి? ఈనాటి సంగతి తెలుసుకుంటూండగానే, యీ రోజు గడిచిపోయి, అది భూత కాలానికి సంబంధించిందిగా మారిపోతోంది. ఇక ముందు రాబోయ్యే చరిత్ర రూపాన్ని యీనాడు సృష్టించటం హాస్యాస్పదం. పోగా, మిగిలిందల్లా చరిత్ర స్వరూపాన్నీ, అది శతాబ్దాల తరబడిగా పొందిన పరిణామాలనూ తెలుసుకోవటమే!

## వివాహమంటే ఏమిటి?

స్త్రీ పురుషులు స్వభావ సిద్ధంగా ఒకరి వైపు మరొకరు ఆకర్షించబడి, తమ కామోద్రేకాలను తీర్చుకోవటమనేది సృష్టికి పునాదిరాయి. ఐతే విచ్చల విడిగా ఇది సాగుతుండటం వల్ల సామాజిక జీవనంలో అనేక ఇబ్బందులు ఏర్పడుతూన్నవి. అందుకని సమాజం కొన్ని పనుల్ని మాత్రమే ఆమోదించి, మరి కొన్నిటిని వెలి వేసింది. ఆ విధంగా సమాజంచేత ఆమోదించబడినవి 'నీతి'గానూ, వెలివేయబడినవి, 'అవినీతి'గానూ పరిణామం చెందినవి. ఏది నీతి? ఎందుచేత? -అనే ప్రశ్నల్ని చర్చించేందుకు మానవ జీవితాలే చాలవు. ఆలా నిర్ణయించబడిన వాటి వెనుక, ఆయా ఉద్దేశ్యాలలో కొన్నిటిని మాత్రమే తెలుసుకోగలం. యీ 'నీతి—అవినీతి' విషయాలకు వెనుక సామాజిక, మతైక, న్యాయ శాస్త్రీయ కారణాలు అనేకం ఉన్నవి. 'నీతి' 'అవినీతి' అనేవి దృఢమైనవికానందువల్ల, ఒకో సందర్భంలో, లేదా ఒకో సమాజంలో, లేదా ఒకో కాలంలో 'నీతి'గా చలామణీ ఐనదే, మరోచోట అవినీతిగా పరిగణించ బడుతోంది. కనుక 'నీతి' అవినీతుల విషయం ప్రస్తుతం, చర్చనీయాంశంగా మేము భావించటం లేదు.

లైంగికమైన సంబంధాలు కలిగి, ఒకరు కానీ, అనేకమంది కానీ, తాత్కాలికంగా కానీ, శాశ్వతంగా కానీ, సంసారంచేస్తూ తమ ప్రధానాశయాల్లో సంతా

నాన్ని కని, వారిని రక్షిస్తూ, పెంచటం ఒకటై ఉండటాన్ని, మనం, సామాన్యంగా 'వివాహం' అని పిలుస్తాము. యీ విధానంలో పెంపొందిందే కుటుంబం అవుతోంది. మానవుడిలో కానీ, జంతు జాలంలో కానీ కుటుంబ వ్యవస్థను ఉద్ధరించే ఆశయం ప్రతిఫలించి నప్పుడే 'వివాహం' అనే దానికి స్థానం ఏర్పడుతోంది.

వివాహ వ్యవస్థలో మనం ముఖ్యంగా గమనించవలసింది-ఆ కలయిక సాగే కాలం; ఆ కాలాన్ని ఎవ్వరూ నిర్ణయించ లేరు; అదే విధంగా వివాహమాడటం కేవ లమూ ఒకే స్త్రీ, ఒకే పురుషుడు అనే భావనలోకూడా, అనేక విభేదాలు వొస్తవి. ఉదాహరణకు—బహుభార్యాత్వం, బహు భర్తృకతలు. యీ రెండు విషయాలూ నిర్ణీతం గాక పోయినా, వివాహానికి ప్రధానాశయాల్లో సంతానపు పెంపు అనేది అన్ని సమాజాల వారూ అంగీకరించిందే.

ఐతే నిత్యజీవితంలో స్త్రీ పురుషుల కలయిక సంతానోత్పత్తితోనే ఆగిపోవ టం లేదు; యీ సత్యం మానవునిపట్లా, పై జాతి జంతుజాలం పట్లా చూడనవుతోంది. వివిధ జాతుల్లోని స్త్రీ పురుషుల సంఖ్య దాదాపు సరిసమానంగా ఉండటంవల్ల మానవునిలోనూ, కొన్ని జాతుల జంతువుల్లోనూ, ఒకే స్త్రీ పురుషులూ ఒక కుటుం బాన్ని పెంపొందించటం తప్పటం లేదు. ఈ విధంగా ఏకపత్నీత్వం, ఏక భర్తృకత మానవుడు ఏర్పరుచు కొన్న నియమాలనటం కన్న, ప్రకృతి సహజమైనవనే అనటం సమంజస మనిపిస్తుంది. దీనికి అనేక సందర్భాల్లో భిన్నంగా జరిగినప్పటికీ, ఆయా కారణాలు వేరు.

## వివాహాశయం

పైన చెప్పుకున్న దాన్నిబట్టి, వివాహం స్త్రీ పురుషుల కామవాంఛ తీర్చు కునేందుకే ఏర్పడిందిగా పైకి కనిపించినప్పటికీ, యీ కలయిక కామతృప్తితోనే ఆగక, సంతానాన్ని ప్రసాదిస్తూ వుంది. ఆ తరువాత యీ కలయిక ఫలితంగా దంప తులు యీ సంతానాన్ని రక్షిస్తూ పెంచవలసిన బాధ్యతను వహిస్తున్నారు. వివా హంలో పైకి కనిపించని ముఖ్యమైన భాగం 'సంతానం' అనేది నిర్వివాదం. అది జరుగని వివాహానికి అసలు అర్థమే లేనట్లు తోచక తప్పదు.

## జంతు జాలం: వివాహం

జంతు జాలంలోని పద్ధతులకూ, మానవ సమాజంలోని నియమాలకూ ఏమన్నా పోలిక ఉన్నదేమో చూద్దాం: తక్కువ రకం జంతు జాతంలో, సంతానం ఉద్భవ మైనప్పటి నుంచీ, వాటి బతుకు అవి బతికి, ఆహారాన్ని స్వశక్తితో సంపాయించుకో గల జంతువుల్లో, అసలు కుటుంబ వ్యవస్థ అవసరమే కనిపించదు.

ఇక మానవుల్లో దాంపత్యంవల్ల సంతానం కలగక పోయినప్పటికీ, దాంప త్యం సాగుతూనే వున్నదంటే, ఇతర కారణాలవల్ల. యీ కారణాల్లో ప్రకృతికి కానీ, సమాజానికి కానీ ఎలాటి సంబంధమూ లేదు,

జంతు జాలంలో జరిగే వివాహాలు స్వాభావికమైన ఎన్నికల మీదా, వంశపారంపర్యత మీదా ఆధారపడి ఉన్నవి. ఇదే విధానం అనాగరిక మానవ జాతుల్లో ఆచార వ్యవహారాల పరంగా తర తరాలుగా వొస్తూనే వుంది. ఇక నాగరిక జాతుల్లో సామాజపరమైన వొత్తిడికన్నా, న్యాయ చట్టరీత్యా జరిగే వొత్తిడి ప్రాధాన్యత వల్లనే, సంతాన రక్షణ పాటించబడుతోందనిపిస్తుంది. పిల్లలు లేని దాంపత్యాల్లో కూడా, ఎలాగైనా సంతానాన్ని కని, తమ బంధుత్వాల్ని శాశ్వతమూ, దృఢతమమూ చేసుకోవాలనే కోర్కె ప్రబలంగా వుంది.

## పశు పక్ష్యాదుల్లో వివాహం

వివాహ సంస్థను మానవుడే కనుగొన్నాడని చెప్పలేము. అసలు ప్రకృతిలోనే యీ వివాహానికి తగిన స్వభావసిద్ధత కొన్ని ప్రాణుల్లో వున్నదనిపిస్తుంది. విజ్ఞానమనేది ఎరుగని కొన్ని జాతుల పశు పక్ష్యాదుల్లో కూడా దాంపత్య జీవితాన్ని గడపటమంటూ వున్నదనే విషయంమీద రూఢిగా స్వభావసిద్ధతే కారణమని చెప్పగలం.

దాదాపు పక్షులన్నిటిలోనూ దాంపత్య జీవితం, కుటుంబజీవనం కననవుతుంది. వాటి కలయికకు ఒక శాశ్వత రూపాన్నిచ్చేందుకు, అవి పడే తహ తహ చూస్తే, యీ విషయం అర్థం గాక పోదు. ఇదే విధంగా సస్తన జాతుల్లో పై తరగతుల జంతు జాలంలో కూడా కుటుంబ జీవనంపట్ల కుతూహలాన్ని చూపటం వుంది. ఉదాహరణకు కొన్ని కోతి జాతుల్లో, ముఖ్యంగా 'పప్స్' 'గొరిల్లాస్' 'ఒరన్ ఉటాన్స్' అనబడే జాతుల్లో, ఏక పత్నీత్వం, ఏక భర్తృకత విధిగా అనుసరించబడుతూ, కుటుంబ రక్షణ, పెంపులకు కృషి చేయుటం కనిపిస్తుంది. ఇక సంతానం, ఏ ఐదారు ఏళ్ళ వరకో తల్లి దండ్రుల రక్షణలో వుంటూ, ఆ తరువాత, ఎవరి సంసారాలను వారు చక్క దిద్దుకోవలసిందే. భర్తే గృహాధికారిగా వుంటూ సంతానం కానీ, తన భార్య కానీ చేసే తప్పులకు శిక్షలు విధిస్తూండటం జరుగుతుంది. ఇదే తరహా కుటుంబ జీవనాన్ని నేటి మానవుడూ అనుసరిస్తూనే వున్నాడు కదా!

ఐతే పైన చెప్పుకున్న విధానంలో మార్పంటూ ఉండదా అనే సందేహం రావొచ్చు. తప్పకుండా మార్పులు జరుతూంటవి-కాని, యీ మార్పులు కేవలం ఆయా పరిస్థితులకు అనుగుణంగానే జరుగుతవి కాని, వేరొక కారణంవల్ల కాదు. కోతి జాతులు సర్వసామాన్యంగా దాంపత్య జీవితాన్ని, ఏకపత్నీత్వ, ఏక భర్తృకత విధానాల్లో అనుసరించి నప్పటికీ—వాటిల్లో కూడా బహుభార్యాత్వ పద్ధతిలేదని అనలేము. ఆడజాతి అధికమైనప్పుడు బహు భర్తృకత అనుసరించ బడుతోంది. అలాటి పరిస్థితుల్లో కూడా ఒకే ఆడ కోతికి, భర్తలుగా వ్యవహరించే రెండు మొగ కోతుల్లోనూ, యీర్ష్యకు తావు లేకుండా, అందరూ సుఖపడేందుకు పరిస్థితికి అనుకూలంగా సరిపెట్టుకోవటమనే భావం స్పష్టంగా కనిపిస్తుంది.

## పురాతన వివాహ వ్యవస్థ

పురాతన వివాహ వ్యవస్థ ఎక్కడ, ఎప్పుడు ఎలా ఆరంభమైనదనే విషయంలో చరిత్ర కారులకు భేదాభిప్రాయాలున్నవి. కొంత మంది-మొదట్లో స్త్రీ పురుషులు విచ్చల విడిగా కలుస్తూ, సంచరిస్తూ, క్రమంగా ఆ జీవితానికి రోసి, బాధ్యతాయుతమైన ఏక పత్నీత్వం ఏక భర్తృకతలకు అలవడ్డారనే అభిప్రాయాన్ని కలిగివున్నారు. మరి కొంతమంది చరిత్రకారులు, మానవుడు మొదటి నుంచీ పక్షిజాతుల్నీ, కోతి జాతుల్నీ చూసి, కుటుంబ వ్యవస్థను అనుసరిస్తూనే వొచ్చాడని అంటున్నారు; కోతుల సంసార విధానం ఎక్కడ అంతమైందో, మానవుని కుటుంబ జీవన విధానం అక్కడే ఆరంభమైనదనే వాదాన్ని బలపరుస్తున్నారు. యీ రెండు అభిప్రాయాలూ కూడా అతిశయోక్తులుగానే తోచి, యీ రెంటికీ మధ్యవున్న అవస్థ ఏదో మానవుని వివాహ వ్యవస్థకు పునాది రాయి ఐవుంటుం దనిపిస్తుంది.

వెస్టర్ మార్క్ వాదం మాతు: ఆదిమ మానవుడు ఏకపత్నీత్వాన్ని ఆరాధించలేదు; అతను విచ్చల విడిగా తిరిగాడు. తరాలు గడిచినా మారని వారి ఆచార వ్యవహారాలు చూసినట్లయితే, యీనాటికీ, వారెంత స్వతంత్రంగా కామతృప్తిని పొందుతున్నారో అర్థమౌతుంది. నాగరికత ప్రబలిన సమాజాల్లోవలె, వారిలో కట్టడులు లేవు.

(ఇంకావుంది)


అభిసారిక

వెనుకటి సంచికలు బైండ్ల రూపాన యీక్రింది విధంగా దొరుకుతవి:

మొదటి బైండు: 1954 జూలై నుంచీ, 1954 డిసెంబర్ వరకూ, రూ. 3-8-0

రెండో బైండు: 1955 జనవరి నుంచీ, 1955 జూన్ వరకూ, రూ. 3-8-0.


పై రెండూ ఒకేసారి కొంటే రూ. 6-0-0.

మూడో బైండు: 1955 జూలై నుంచీ, 1955 డిసెంబర్ వరకూ (సప్లిమెంట్‌తో సహా) రూ. 3-8-0.

పైకం ముందుగా పంపేవారికి ఖర్చులు భరించి పంపబడుతవి.

అభిసారిక కార్యాలయం, మద్రాసు-17.

# త్వమేవ శరణం మమ



రచన
శార్వరి

వెన్నెలకాస్తుంది. ఉన్నతస్థలాలు, విశాలమైన ప్రదేశాలు మాత్రమే వెన్నెలల్ని అనుభవిస్తాయి. గాలివీస్తుంది. అదీ అంతే ఇరుకుప్రదేశాల్ని, గుహల్ని వెన్నెలలుగానీ, మలయవీచికలుగానీ స్పృశించవు. స్పృశించలేవు. ఆనందం, సంతోషం అనేవి పరిణతి చెందిన హృదయాల్ని మాత్రమే స్పృశించి రంజింప చేస్తాయి. చీకటిగా, ఇరుకుగావుండే మనసులు ఆనందాలకు, అనురాగాలకు దూరం అవుతాయి.

జానకి అలాంటి అభిప్రాయాలు వెలిబుచ్చినప్పుడు నామనస్సు ఎందుకోగాని చివుక్కుమనేది. మనస్సు చాలా ఇరుకుగా, బాధగా ఆలోచించేది. నాభావాలు నాలోనే మంటలురేపేవి. ఉద్రిక్త పడేదాన్నికూడా నేమో. అయితే జానకికన్న కొంచెం వయస్సులో పెద్దదాన్ని కావడంవల్ల తమాయించుకుని, బరువైన ఆలోచనలను క్రిందికిదింపి హృదయం తలిక వరచుకునేదాన్ని. జానకికి ఆలోచన తక్కువ ఆవేశం, ఎక్కువ. నాకు తెలిసినంతలో, ఆమె ఏ విషయాన్నిగురించి అంత తీక్షణంగా ఆలోచించదు. బహుశా ఆలోచించలేదేమో కూడా, ఎదగనిమనస్సు, ఎదుగుతున్న సౌందర్యం, అబ్బినచదువు, జానకిని కొంచెం గర్విష్ఠిగానే తయారుచేశాయి. తనమనస్సు చాలా ఉన్నతమైందనీ; తన నిర్ణయాలు, ఆలోచనలువింటే క్రమబద్ధమైనవని అందరు అనుకోవాలని ఆమెవాంఛ. అలాగా అనుకుంటారని తను అనుకునేది. తన సౌందర్యం సాటిలేనిదని, తన సౌందర్యాన్ని ఆరాధనీయంగా చేసుకోగల యువకులు వేనకువేలు వుంటారని ఊహించుకుని, ఉప్పొంగిపోయేది. యవ్వనపు పొలిమేరల్లో అడుగిడుతున్న ప్రతిస్త్రీ అనుకున్నట్లుగానే జానకీ అనుకుంది.

వొచ్చిన చిక్కల్లా ఆమె ఆశించినంతగా- కొంచెం తక్కువగానైనా, కనీసం ఆశించినట్లుగా జరగక పోవడంతో, జానకి సౌందర్యాన్ని వేనకువేల యువకులు కాదుగదా కనీసం ఒక్కరైనా ఆశించలేదు. ఆమె సౌందర్యాన్ని ఏఒక్కరూ, యువకశిఖామణి అనుకోబడేవాడు అంగీకరించి, తన హృదయాన్ని విప్పి, ప్రేమలో ఆమెను లీనం చేసుకోటానికి ప్రయత్నించ లేదు. జానకి ఆశించినట్లుగా జరక్కపోవడంతో ఆమె అభిమానం దెబ్బతిన్నది. చదువుమీద విరక్తికలిగి అదీ మానేశింది. తన సౌందర్యమే తనను నాశనం చేసిందని అభిప్రాయం.

అయినా జానకి నాస్నేహితురాలు. చాల చిన్నతనంనుండీ యిద్దరం కలిసి కట్టుగావుండే వాళ్ళం. కలిసి చదువుకున్నాం. అనేకవిషయాలు యిద్దరమూ కలిసే ఆలోచించేవాళ్ళం. పెద్దవాళ్ళమయి, పెళ్ళిళ్లు చేసుకుని....యిల్లా

సంసారం అంతా మాదృష్టిలో చలనచిత్రంలా తిరిగి పోయేది. అలాంటి విషయాల్ని గురించి ఆలోచిస్తున్నప్పుడు జానకి పొందే ఆనందం చెప్ప శక్యంగాదు....

మూడు సంవత్సరాలలో పెద్దమార్పు లేవీ రాలేదు. నేను కాలేజీలో చేరాను. కాలేజీ జీవితంగురించి జానకి నే చెప్పగా విని ఆనందించేది. నిజంగా అది ఓరకమైన స్వర్గమనీ, అక్కడ అందని ఆనందం వుందని ఆమె వూహ. ఎలా కాదని చెప్పేది? ఒకవేళనే చెప్పినా జానకి వినేస్థితిలో వున్నదా? ఆమె కలల్ని భగ్నంచేయడం యిష్టంలేక, 'నీకలలు యదార్థాలుకాదు' అని నేనెన్నడూ సాహసించలేదు.

జానకి యిల్లు మరీ బజారుతల కావడం వల్ల గొప్ప చిక్కే వచ్చిపడ్డది. రెండంతస్తుల మేడమీద నిలబడి వొచ్చిపోయే కుర్రాళ్ళని చూస్తూండేది. పెద్ద పెద్ద గదులు, ఉయ్యాల బల్లలు, రేడియో, కుషన్సు అన్నీ, అన్నిరకాల నాగరీకపు అలంకారాలు ఆ యింటికి వున్నాయి. జానకి వాటిని అనుభవిస్తుంది. మేం కాలేజీకి వెళ్ళేవేళకి చక్కగా ముస్తాబై, ఏ బెంగుళూరు షిఫాన్ చీరో కట్టుకొని పోర్టికోలో నిలబడి, వోరగా వొచ్చేపొయ్యేవారిని చూస్తుండేది. చాలమంది మగ విద్యార్థులు అటే పోవడంవల్ల ఆమె ఆనందానికి అంతువుండేది కాదు. నాకు చెడ్డ చిరాకు పుట్టుకొచ్చేది జానకినిచూచి ఆమె ప్రవర్తనచూచి. 'అలాచూడడం తప్పు. అందువల్ల మనకి వొరిగేది ఏమీలేదు' అనిచెప్పాను కూడా. కానీ జానకి విన్నదా. వింటదా జానకి. తన ఆనందానికి నేను అడ్డుపడుతున్నానని చూచాయగానే తెలియజేసింది. నాకే మనస్సు చివుక్కుమని వూరుకున్నాను.

ఓరోజు సాయంత్రం కాలేజీనుండి వొస్తున్నప్పుడు జానకి పిలిచింది, 'బాడ్‌మింటన్' ఆడుకుందామని. అదీ అప్పుడప్పుడు మాకు అలవాటే. అయితే నాకు బాగా తీరికగావున్న రోజుల్లో, నెలవరోజుల్లో చేసేపని. అయినా జానకి ఆహ్వానాన్ని తిరస్కరించలేదు. నాకూ మనస్సు చీకాకుగావుండి 'సరే' నన్నాను.

'ఈవేళ ప్రెమండన్‌గా ఆడాలి....తెలుసా' అన్నది 'ఓ తెలియకేం' అనుకున్నాను, ఓ చిరునవ్వు విసిరి.

ఆట ఆడుతున్నప్పుడు జానకి విచిత్రంగా ప్రవర్తించడం మొదలెట్టింది. నవ్వడం, అరవటం, అప్పుడప్పుడు ఇంగ్లీషు ముక్కలు వొచ్చీ రానివి వొదలడం. నాకేమీ అర్థం కాలేదు. అవకాశం వొచ్చినప్పుడు, లేనప్పుడు ఎలాగో సందుచేసుకుని, బంతితీస్తున్నట్లు తలవొంచి ఆప్రక్క గదివేపు పదేపదే చూపు సాగించింది. ఏమిటి దీనిచేష్టలు చెప్మా! అనుకున్నాను. తీరా చూద్దునుకదా, కిటికీకి అవతల ఎవరో యువకుడు కూర్చుని, గదిలో ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. దగ్గరగా పిలిచి అడిగాను జానకిని: 'ఎవరే ఆ నలకూబరుడు' అని.

'ఏయ్. పారూ!' అని కళ్లురిమింది. నవ్వుతూ—నాకు మండింది. 'పారూ ఏమిటి నీతలకాయ, నాకెవరూ దేవదాసు లేదులే. సరీగా పార్వతీ అను' అన్నాను. తన దేవదాని వెక్కిరిస్తున్నానని కోపంవచ్చింది పాపం. ఆకోపంలో ఒంతిని విసిరికొట్టింది. అదృష్టవశాత్తూ అదివెళ్ళి ఆ నలకూబరుడి గదిలో దూరింది, ఆటకట్టింది.

ఎలా దాన్ని తిరిగి సేకరించడం అన్నది సమస్య అయింది. నేను వెళ్లి అడగను. జానకి వెళ్ళి అడుగుదామంటే, అడగాలనే దానికి వున్నది, కాని నన్నుచూచి సిగ్గుపడిపోయింది. అలా లాభంలేదని నేవెళ్లిపోయాను.

మరునాడు చెప్పింది జానకి జరిగిన సంగతంతానూ. తెల్లవారేసరికి కబురెట్టింది రమ్మని. వెళ్ళాను. కాఫీగ్లాసుయిచ్చి అన్నది.

'ఆయన....ఆయనేక్రింద గదిలోలేడూ.... ఆయన ఎంతమంచి వాడనుకున్నావే....?'

ఘనతవల్లనే అగ్రస్థానం




ప్రతీ షాపులోను దొరకును.

'ఊహూ! అల్లాగా, నాకుతెలీదే!' అన్నాను.

'అదిగాదే పార్వతీ! నీకు కోపంరాకుండా వుంటే చెప్తాను. నిన్న నువ్వు వెళ్ళావా! చాలా సేపు ఆలోచించాలే. దాసీదాన్ని పంపుదామా, నేనే వెళ్ళి అడగనా అని. దాసీని పంపితే ఏమైనా అనుకోగలడని, అది అట్టే మర్యాదయిన పద్ధతి కాదనుకొని తెగించి వెళ్లాను.'

అల్లా చెబుతుంటే జానకి పరవశమై పోతోంది. ఆమెకు పురుషానుభవం లేదు. ఎవర్నీ ఎరుగదు. స్నేహంలో ఎవరితోనూ యువకులతో మాట్లాడి ఎరగదు. ఈనాటి యువకుల ప్రవర్తనలకు జానకి కొత్త.

'వెళ్ళి....ఏమండీ' అని పిలిచాను.

'ఎవరూ, రావచ్చు' అన్నాడు.

'వెళ్ళేను, నాకుఆయన్ని చూస్తే తగనిసిగ్గు, భయంవేసింది. నోటమాట రాలేదు. ఆయన గారి మొఖం లోకి చూడలేకపోయాను దగ్గరగా....'

'ఏం అంత వికారంగా వుంటాడా?!-' అన్నాను.

'ఏమిటే పారూ ఆమాటలు. మర్యాదా, మన్ననా లేకండా' అని కోప్పడ్డది నన్ను....

'కూర్చోండి. నిలబడే వున్నారే!' అన్నాడు.

'నేను కూర్చోలేక పోయాను'

'అప్పుడు ఆయనే స్వయంగా, తనచేత్తో నీచేయి పుచ్చుకొని కూర్చోబెట్టాడు. అవునా?' అన్నాను కోపంగా జానకి ముఖంలోకి చూస్తూ....

నాముఖంకేసి చూడకండానే పరవశంతో చెప్పుకుని పోతున్న జానకి 'నిజం' అని చెప్పింది.

రంగం చాలవరకు వొచ్చింది. శృతి మించితే రాగాన పడుతుంది. ఎలాగైనా జానకిని ఒకమార్గంలో పెట్టాలను కున్నాను. అనుకున్నానేగాని ఆ చరణలో పెట్టలేక పోయాను. ఎలా పెట్టగలను. వ్యవధి ఏదీ! మూడోరోజుకల్లా పిడుగులాంటి వార్త రానే వొచ్చింది. 'జానకి కనిపించడంలేదు' అని. అర్ధరాత్రివేళ అమాంతంగా క్రిందిగదికి 'టులెట్' బోర్డు తగిలించవలసి వచ్చింది.

★

కొన్ని ప్రశ్నలకు సమాధానాలు కుదరవు. నేను చేసే ప్రతిపనీ మరొకరికి, లేక అందరికీ అంగీకారం కావాలని నేననుకోవడంలో అర్థం వుంది. అలాఅందరూ అంగీకరించక పోవడంలో, దోషం వక్రం లేదనుకుంటాను. నాకు ఎంత ఆలోచించినా వరూధినిలాంటి అందాల అప్సరస పిచ్చి పిరికి బ్రాహ్మణ్ని మొదటి చూపులోనే ఎందుకు, ఎలా ప్రేమించ గలిగిందో తెలియలేదు. డెస్డిమోనావంటి సౌందర్యరాజ్ఞి అందవికారి అయిన నీగ్రో ఒథెల్లోను ఎందుకు ప్రేమించిందో తెలియలేదు. ఒక సంవత్సరం

పాటు ఆలోచించాను. సమాధానం దొరకలేదు. వారి వారి మనసులు అందుకు అంగీకరించాయి. అందుకు యితరుల దృష్టి నిర్ణయం. నిర్ణయం కాదని సమర్థించుకున్నాను. 'ప్రేమ' నిజంగా మనుషుల్ని పిచ్చివాళ్ళను చేస్తుంది. అనాలోచితుల్ని చేస్తుంది. అదే మా జానకి విషయంలోనూ....ముక్కూ మొహం, సరిగా తెలియని ఓ యువకుణ్ని ప్రేమించింది అంటే అర్థంలేదు. కాని అర్థంవుంది. అతనెవరో ఆమె ఎరగదు. అతని పుట్టు పూర్వోత్తరాలు గానీ, అతని మంచిచెడ్డలుగానీ, ఏవీ జానకికి తెలీవు. అతన్ని చూచిన మొదటిసారే అతనంటే మనసుపడ్డది. మక్కువచూపింది. అతను జానకివంటి దానిచే ప్రేమింబడ అనర్హుడని నేనెలా చెప్పగలను. లోపల అనుకునేదాన్ని 'జానకి పొరపాటుపడింది' అని 'పాడుపని చేసింది' అని. అదేమాటపైకి జానకితో అనగలనా? అంటే జానకి ఉపేక్షించగలదా?

ఎంత సమాధానం చెప్పుకున్నా జానకిచేసిన పనిని నేనుగాసమర్థింలేకపోయాను. పార్వతిని జానకి స్నేహితురాల్ని అవడంకారణంగా ఆమె మంచిచెడ్డల్ని విమర్శించే హక్కు నాకున్నది. అయినా మించిపోయింది.

జానకి తలిదండ్రుల్ని ఓదార్చడం దుస్సాధ్యం అయిండి. కన్నీరు మున్నీరుగా ఆ తలిదండ్రులు ఏడుస్తోంటే నాహృదయం ద్రవించేది. వాళ్ళబాధ జానకికి అర్థంగాదు. పితృహృదయం, మాతృప్రేమ ఆమె తెలుసుకోలేదు. తెలుసుకున్నదే అయితే అలా వెళ్లిపోతుందా? ఒకవేళ ఏ ఉద్రేకాలకో లొంగి వెళ్ళిపోయినా తిరిగిరాకుండా వుండగలదా?

జానకి తిరిగిరాలేదు. సంవత్సరం గడిచింది. ఆమెనుగురించి మర్చిపోవాలని అనేక మార్లుప్రయత్నించాను. ప్రయత్నించిన కొలదీ మనస్సులో మరో తిష్టవేసింది. జానకిరూపం కళ్ళలో మెరిసేది. అంత పచ్చటిశరీరం కాకపోయినా, పచ్చటి అందమైనశరీరం, ఆమె మామూలుగా కట్టుకునే రోజారంగు సిల్కు పరికిణీ, ఆకుపచ్చవోణీ, తెల్లటి జాకెట్, కాటుకకళ్లు, ఎర్రటిపెదాలు....అన్నీ కళ్ళలో, కనిపించేవి. 'పాపం...జానకి' అనుకునేదాన్ని ఏంచేస్తుందో నాస్నేహాన్ని వొదిలి, కని పెంచి, పెద్దదాన్నిచేసిన తలిదండ్రుల్నే వొదిలిన జానకికి నాస్నేహం ఏ లెక్కలోది?

ఒకరోజు అనుకోకుండా జానకినుండి ఉత్తరం వచ్చింది. సంవత్సరం రోజులు గడచాక పార్వతిని జ్ఞాపకంవొచ్చాను కామాల్సు. పోనీ యిప్పటికైనా జ్ఞాపకంవొచ్చాను.అయినా తన కొత్త మోజులో నాలాంటి వ్యక్తులు ఎందుకు తలపుకు రావాలి? ఏప్రశాంతమైన ప్రదేశంలోనో,ఏనదీతీరాల్లోన్నో,సెలయేటి తటాల్లోన్నో చిన్న పర్ణశాల వేసుకుని, ప్రేయ ప్రియుడు చల్లగాలి అనుభవిస్తో, సెలయేటి నీరుతాగుతో, చెట్లపండ్లు తింటో, విలాసంగా, వినోదంగా, ఆనందాన్ని అనుభవిస్తున్న జానకిని—అలా వూహించుకున్నప్పుడు చప్పున అసూయ కలిగింది నాకు. జానకి అనుభవాలు నావెందుకవుతాయి? ఆత్రతతోటే ఉత్తరం విప్పాను.

పారూ!

నన్ను క్షమిస్తావుకదూ! నన్ను క్షమించగలిగింది నీవొక్కదానివే నని నా నమ్మకం, నేను చేసింది చెడ్డపని అని నువ్వు అంటావు కదూ! యింకా అలానే అంటావని నాకు తెలుసు. నీకు పెళ్ళయి, ఒక యింటిదానివయినప్పుడుగాని నీకు తెలిసిరాదు. అప్పుడు అంటావు 'జానకి మంచిపనే చేసింది' అని. నేను చాలా సుఖంగావున్నాను. ఇంతఆనందంగా నాజీవితం వుంటుందని నేనెన్నడూ ఆశించలేదు. ముకుందం చాలా మంచివాడు. అంటే ఆరోజున నువ్వు చూస్తివే-ఆయన. నాకోసం ఏమైనా చేస్తాడు. నేనంటే ప్రాణం. నన్ను చూడందే ఒక్కక్షణం వుండలేరు పాపం.... ఇంటిమీద మనసుకలిగినా- నేనంటే అంత ప్రేమగావుండే ముకుందాన్ని వొదిలి ఎలా రాగలను! రాలేను. అందుకే క్షమించు....

నేనెక్కడ వున్నదీ నీకు తెలియనియ్యను.... ఇలాగే ఉత్తరాలు రాస్తుంటాను.

నీ జానకి'

నా జానకి ఎందుకవుతుంది. ముకుందం జానకి అనుకున్నాను. కనీసం తన తలిదండ్రుల సంగతి ప్రస్తావించనందుకు నాకు యించుక కోపం వచ్చినమాట వాస్తవం. అయినా తనకే లేనిప్రేమ నాకేమిటి?

జానకి అందరివంటి స్త్రీ కాదు. ఆమెకు చదువు తక్కువైనా మహా పెద్దచదువులు చదివినవారు చేస్తారనే ఘనకార్యం తనే చేసింది. అదే స్వర్గం అనుకుంటుంది. తనుపొందేవే స్వర్గసౌఖ్యాలు అనుకుంటుంది. ఎవరు ఎందుకు కాదనాలి?

★

ఆడవాళ్ళ మనసులు అగమ్యం. ఒకందాన అర్థంగావు. పగటికలలు కనడంలో వాళ్ళకుమించిన చెయ్యివుండదు. జానకికన్నవి నిజం నూటికినూరుపాళ్ళు పగటికలలే. ఉన్నత కుటుంబంలో పుట్టింది. సంపన్నంగానే పెరిగింది. యవ్వనం పొడ సూపేదినాల్లో ఆశించింది, విలువగలబట్టలు, ఉన్నతుడైన భర్త, ఊహించగలిగినన్ని అనుభవాలు. లోకంలో తనలాంటి అదృష్టవంతులు ఏ కొందరోగాని వుండరనుకున్నది. నిజమేమరి! కాలం కనికరించి వున్నట్లయితే జానకి మంచిభర్తను పొందగలిగేది. ఆమె తలిదండ్రులు అంత అసమర్థులుగాదు. ఒక్కగా నొక్క కూతురుకు మంచి సంబంధం—రాజాలాంటి సంబంధమే తీసుకొచ్చేవారు! కాని అంతకాలం జానకి ఉపేక్షించలేదు. ఉద్రేకాలకు లొంగిపోయింది. పురుష వాంఛలకు బానిసయిపోయింది.

ముకుందం సర్వసమర్థుడూ, ఉన్నతుడు, సంస్కారి అనుకున్నదేగాని, అతనిలోని లోతులను అర్థంచేసుకో ప్రయత్నించలేదు. జానకి అప్పుడున్న స్థితిలో అర్థం అవలేదు. యువకసాంగత్యం మిక్కుటంగా అభిలషించింది. ముకుందంతోటి తన జీవనం స్వర్గప్రాయం అనుకున్నది. ఏ యితర స్త్రీ పురుషులకు లభ్యంకాని ఆనందాలు తాము అనుభవిస్తామనుకున్నది. అన్నీ ఎన్నో అనుకున్నది. కొంతకాలం అనుభవించింది.

జానకి వెళ్ళిపోయినప్పుడు.... వెళ్ళి ముకుందాన్నే పెళ్లిచేసుకుంది. అది చట్టబద్ధం కావచ్చు. సంస్కార బద్ధంకాదు. ఆమె వొంటిమీద విలువైన నగలున్నాయి. కనీసం రెండుమూడువేల రూపాయాల కిమ్మతుచేసే నగలు ఆమెవి. ముకుందం ఉద్యోగికాదు. సంపాదనాపరుడూ కాదు. అతనికి జానకిని పెళ్ళిచేసుకోవడం యిష్టం లేదు. అయినా ఏం చేయగలడు పురుషుడు.... స్త్రీ తనంత తా వలచివచ్చిన....

ముకుందం ఆశించింది ఒక్కటే. తను ఉద్యోగానికి అర్హుడు,కాకపోవడంవల్ల సుఖంగా జీవితం వెళ్ళిపోయేమార్గం. అతనిప్రయత్నానికి జానకి మొదటి సోపానం అయింది. జానకితో ఆవిషయంచెప్ప సాహసించలేక పోయాడు.

'మనం ఎక్కడకైనా వెళ్లిపోదాం. దూరంగా. సుఖంగా బ్రతుకుదాం' అన్నప్పుడు 'ఎలా?' అనేప్రశ్న వేయలేదు. స్త్రీకున్న ధైర్యం కొన్ని విషయాల్లో పురుషునికి వుండదు. ప్రేమించినస్త్రీ, డబ్బు, యోగ్యతా, గౌరవం, ప్రతిష్ఠ ఏవీ చూడదు. అవన్నీ ఆక్షణంలో స్వల్పం, అల్పాతిఅల్పంగాను అవుపిస్తాయి. సంపాదలేని ఏపురుషుడూ, తానొకవేళ ఒకర్ని ప్రేమించినా అంత తేలిగ్గా పలాయనం చిత్తగించలేడు.

రెండు మూడు సంవత్సరాలు సుఖంగానే గడిచాయి. జానకి ముకుందం దేవలోకంలోంచి ఈ లోకంలోకి కేవలం ఆనందం అనుభవించటానికి వొచ్చిన అప్సరస జీవులుగానే బ్రతికారు. జానకికి వొంటిమీద బట్ట తప్ప మిగిలింది వేరేలేకపోయింది మూడోఏడు పూర్తయే సరికి.

ఒకరోజు తెగించి అడిగింది జానకి ముకుం దాన్ని. అప్పటివరకు అనేకసార్లు అదే మాట అడగాలనుకున్నది. కాని ధైర్యం లేక పోయింది. ధైర్యంకన్నా అవసరం లేక పోయింది. ఇక రోజులు గడవడం దుర్లభం అయిపోయింది. కనక ధైర్యంచేసింది.

'పోనీ మీరు ఏదైనా ఉద్యోగం చెయ్యకూడదూ?' అని. ముకుందం మృదువుగా నవ్వాడు.

'నవ్వడంగాదు....మనం బ్రతకడం కష్టం గదా....' ముకుందం ఏమీమాట్లాడ లేదు.

'ఇంతకాలం ఎలాగో గడిచింది. యిక ముందు మార్గం అవుపించడం లేదు. ఏసంపాదనా లేకుండా యిలాగా కూర్చుంటే....'

'ఇప్పటివరకూ ఎలాగడిచిందో అలానే ముందూ గడుస్తుంది' అన్నాడు ముకుందం గంభీరంగా.

'సొమ్మంతా అయిపోయింది. డబ్బంతా అయిపోయింది!'

'ఇంకా చాలా వున్నదిగా' అన్నాడు.

'ఎక్కడ?'

'పుట్టింటి దగ్గర!'

జానకికి పుట్టెడు దుఃఖం పొంగుకొచ్చింది. వాళ్ళ చలవవల్లనే ఈ మూడేళ్ళూ గడిచింది. ఇప్పుడు ముకుందం ఎదురు తిరుగుతున్నాడు.

ముకుందం ఓదార్పుగా చెప్పాడు.-

'మనం కష్టపడవలసిన పనిలేదు....ఓమంచి రోజు చూచి యింటికి పోయిరా....ఈ సారి కొంచెం ఎక్కువగానే పట్టుకురా........'

జానకి అభిమానం దెబ్బతిన్నది.

'ఇన్నాళ్ళూ వాళ్ల మొఖం కూడా చూళ్ళేదు. అమ్మ నాన్నా చచ్చారో బ్రతికారో కూడా తెలీదు' కోపంతోనే అన్నది.' అలాంటివాళ్ళ దగ్గరకు ఏ మొఖం పెట్టుకుని వెళ్ళేది. చచ్చినా పోను. తిండి లేకపోతే మలమల మాడి చస్తాను. నాలుగు గడపల దగ్గరముష్టెత్తుకు బ్రతుకుతాను'

జానకికి జ్ఞానోదయం అయింది. ముకుందం ఎత్తులు పారలేదు. ఎన్నోరకాల చెప్పి చూచాడు. అయినా, లాభం లేకపోయింది.

జానకి సంసారంలో హాలహాలం పుట్టి ఆరునెలలు కావస్తోంది. ఎంత సాధించినా ముకుందం సంపాదనలోకి దిగలేదు.

'ఏ కిళ్లీ కొట్టో పెట్టికోమని' సలహా యిచ్చింది జానకి. లాభం లేకపోయింది. 'నాకేం అవసరం లేదు.' అన్నాడు.

'నిన్ను నమ్ముకుని బలవంతాన వొచ్చాను. లేకుంటే సుఖంగా బ్రతికేవాణ్ని' అనటం సాగించాడు.

అతని తత్వం ఏమీ అర్థం కావటం లేదు. 'పురుషుడైనవాడు ఏ సంపాదనా లేకండా, భార్య ఆ స్త్రీమీద, డబ్బుమీద ఆధారపడి వుండటం ఎంతో నీచం' అనుకున్నది జానకి.

ఉన్నట్టుండి ముకుందానికి జ్వరం ముంచు కొచ్చింది. విపరీతమైనదగ్గు, ఆయాసం.... జానకికి భయం వేసింది. కాలు చెయ్యి ఆడ లేదు. ఆడకూతురు ఏం చేస్తుంది. చేతిలో కానీ లేదు. ఉన్నప్పుడు ఉన్నతంగానే జీవించారు. కాని యిప్పుడు వస్తులు పడుకోడం అలవాటయింది.

ముకుందం జ్వరంతో బాగా నీరసించి పోయాడు. జానకితో ఒకటి రెండుసార్లు అన్నాడు—

'నీవు నమ్ముకుని బ్రతకలేవు జానకీ. నీ వాళ్ళ దగ్గరకు వెళ్లి సుఖంగా బ్రతుకు' అని.

ఓ డాక్టరు చూచి ముకుందం జబ్బు టి. బీ. గా మారుతోందని చెప్పాడు. గుండె బాగా నీరసించి పోయిందని, ఎక్కువ విశ్రాంతి కావాలని చెప్పాడు.

ముకుందానికి విశ్రాంతి వుంది. చేతిలో పుష్కలంగా డబ్బే లేదు. అది వుంటేగాని రోగం నయంకాదు.

అతనికి ధైర్యం సడలింది. బ్రతుకుతానన్న నమ్మకం దిగజారిపోయింది, జ్ఞాన

కికి కూడా అదే అనుమానం. కానీ తిరిగి యింటికి వెడితే....ఈస్థితిలో ఆదరిస్తారా? కుక్కను తరిమినట్లు తరిమి కొడతారు. గౌరవం మాట దేముడెరుగు. కనీ సాదరణ గూడా లభించదు. ఒకవేళ ముకుందం.... అనగూడదు కాని....అయితే తనగతి? ఏది శరణ్యం? బుర్ర బద్దలై పోతోంది ఆలోచనలతో. ఏ తరుణోపాయం తోచ లే దు. ఇదంతా తన స్వయంకృతం అనుకోక తప్ప లేదు. అయినా తిరిగి ఏ ముఖంతో తలిదండ్రుల్ని ఆశ్రయిస్తుంది? ఏనూతిలోనో, గోతిలోనో పడి చావటం మేలు.

లోకం తనని కులట, పతిత అంటుంది. అట్లా అనబడే కార్యం తనేమీ చేయలేదు నిజానికి. తను పతివ్రత. అయినా లోకం వెలేస్తుంది. లోకం నిందలకు స్త్రీ తలవొగ్గ లేదు. ఈ భారతదేశంలో ఏ పవిత్రనారి కూడా లోకాన్ని ఎదిరించి బ్రతకలేదు. పురుషుడు విషయం వేరు. 'ప్రేమ' ఎంతో పవిత్రమైంది అనుకున్నది- 'ప్రాణాపాయకరమైంది' అని అనుకోలేదు.

రాత్రంతా ఆలోచనలతో సతమతమైంది. కళ్లు నిద్రలేక జ్యోతు లయినాయి. సంస్కార విహీనమయింది. ఉదయానికల్లా ముకుందం అవుపించలేదు. ఎంత వెదికినా కనిపించ లేదు. కన్నీరు మున్నీరుగా ఏడ్చింది- అబల, స్త్రీ, ప్రేమతపస్వి అయిన జానకి.

★

జానకిని గురించి నాకు అంతవరకే భోగట్టా అందింది. ఆవిడరాసిన ఉత్తరాల ద్వారా. ఆ తర్వాత జానకి ఏమైందో తెలీ లేదు. ఎక్కడున్నదో, ఏంచేస్తున్నదో తెలియదు. ఆ ముకుందం రోగంతో పతనమైనాడో, బ్రతికాడో కూడా తెలియదు. ఏది ఏమాత్రం సవ్యంగా జరిగివున్నా జానకి కనీసం నాకు ఉత్తరం వ్రాసివుండేదే. ఒకటి రెండు సార్లు అనుకున్నాను. వెదికి జానకిని తీసుకొద్దాము, ఎలాగో నచ్చచెప్పి తలిదండ్రులకి వప్పజెబుదామని. అది నా వూహ మాత్రమే. వాళ్లు వొప్పుకుంటారా లేదాఅన్న ప్రసక్తి లేదు. అసలు జానకి రాదని నాకు తెలుసు. ఆమె జాడ తెలిస్తేగదా ఏ ప్రయత్నం చేయడానికైనా?

జానకిని గురించి ఆలోచించుకున్నప్పుడు నాకు జీవితంమీద, వైవాహిక జీవితం మీద విరక్తి కలిగేది. ప్రేమ ప్రేమంటూ పలవరించి తన నాశనాన్నితనే ఆపాదించుకొంది. నమ్ముకున్న ఒక్కగానొక్కడు వచ్చి మోసగాడై ఆమె జీవితాన్నే నాశనం చేశాడు. మగవాళ్ళ ప్రేమలు అంతా బుద్బుద ప్రాయాలని జానకి అనుభవం వల్లనే తెలుసుకో గలిగాను. పెళ్ళి చేసుకోవటమంటే తగనిభయం వేసింది. అంటే చూస్తూ చూస్తూ హృదయాన్ని, శరీరాన్ని యావజ్జీవితాన్ని ఒక పురుష పుంగవుడి చేతుల్లో పెట్టడం, అతని యిష్టాలకు, అభిరుచులకు అనుగుణంగానే వ్యవహరిస్తానని బాసచేయడం, ఈ వివాహబంధనం స్త్రీని పురుషునికి బానిసను చేస్తుంది. రక రకాలైన యంత్రంగా మారుస్తుంది.

అలాంటి యాంత్రిక జీవితం జీవించడానికి నా మనస్సు వొప్పుకోలేదు. నాన్న అమ్మ ఎంత బ్రతిమలాడినా సుతారామూ పెళ్ళికి వొప్పుకోలేదు. 'పెళ్లిచేసుకుని ఆ బాధలు నేను భరించలేను' అని చెప్పాను. అందుకే చదువు పూర్తిచేశాను. ఏదైనా ఉద్యోగంలో చేరి నా బ్రతుకు నేను బ్రతుకుదామని. నాన్న అందుకు వొప్పుకోలేదు. స్త్రీ జీవితానికి ఉద్యోగం ముఖ్యం కాదన్నారు. సంసారిఅయి జీవితం గడపడంలోనే అందం, ఆనందం వుందన్నారు? సరైన వరుణ్ని తాను వెదికి తీసుకొస్తానని మాటయిచ్చారు కూడా.

అప్పటికిగాని నేను ఒక నిర్ణయానికిరాలేక పోయాను. నేను అసమర్థురాలిని గాదు- ఏది ఏమైనా ఒక ఉద్యోగం సంపాదించుకోగలను. పెళ్ళిచేసుకుంటే మాత్రమేం?

అనేక సంబంధాలొచ్చాయి. అందర్నీ కాదన్నాను. నాకాలేజీ జీవితంలో అనేక వందల మంది కుర్రాళ్ళని చూచాను. వాళ్ళ నడవడి, బట్టలు, నా కసహ్యం అనిపించేవి. చివరికి గుంటూరునుండి వొచ్చినాయన్ని గురించి నాన్న చెప్పారు. అతని పేరు వేణుట. కాలేజీలో ఉద్యోగం చేస్తున్నారట. యం. ఏ. చదివారట. చాలా సామాన్యంగా వుంటారని. అసలు చదువుకున్న వ్యక్తల్లేనే వుండరని, నిగర్వి అని....ఏవేవో చెప్పారు నాన్నగారు.

అయినా నేననుకోలేదు. "వేణు" ని చూచే వరకూ మనస్సు ఆరాట పడలేదు. కాలేజీ ఉద్యోగం అంటే సూటు, బూటు, పెద్ద డాంబిక మైన వేషం వూహించాను. రేగిపోయిన జుట్టు ఓ పైజామా, మామూలు చొక్కా వేసుకుని పెళ్ళిచూపులకు వొస్తారని అనుకోలేదు. 'వేణు' ని చూచినప్పుడే అనుకున్నాను-

'చాలా మంచివారని'

'చాలా మంచివారు' అని అన్నది ఓసారి జానకి ముకుందాన్ని గురించి. చప్పున జ్ఞాపకము వొచ్చింది. అయినా 'వేణు' అలాంటి దగుల్బాజీవాడు కాడు. కాలేడు.

పెళ్ళయిన సంవత్సరానికి ఓసారి రాజమండ్రినుండి గుంటూరు వెడుతోంటే జరిగిన సంగతి. అప్పటికి వేణుని పూర్తిగా అర్థం చేసుకున్నా ననుకుంటాను. నా మనస్తత్వం ఎలాంటిదో వారిదీ అలాంటిదే. నేను ఎంత నిరాడంబరంగా వుండాలని అనుకునేదాన్నో, అంతకు రెట్టింపు నిరాడంబరత వారికి. ఆయన చేసుకోడానికి పెళ్ళి చేసుకున్నా, మహా వేదాంతి. మహర్షి తత్వం ఆయనగారిది. అందుకే మేమిద్దరం ఒకరినొకరు అర్థం చేసుకోడానికి ఆట్టేకాలం పట్టలేదు. మాది ప్రేమకాదని ఎవరూ అనలేరు. ఒకచోట వున్నప్పుడు, ఒకరు లేనిదే మరొకరం లేమనుకునేవాళ్ళం. నేను రాజమండ్రి వెళితే, వారు గుంటూరులో వుంటే, యిద్దరిమధ్యా కనీసం ఉత్తరమైనా నడిచేది కాదు. అయినా నాకు సంతోషమే. అనుమానం లేదు. 'వేణు' తత్వం నాకు బాగా తెలుసు. 'మన 'ప్రేమ'కు పోస్టాఫీసు సాక్ష్యం కాదు. మన మనసులే' ననేవాడు వేణు.

బెజవాడ స్టేషనులో జానకి అవుపించింది. నాకు ప్రాణం లేచివచ్చినంత పనయింది. అసలు జానకే అని పోల్చుకో గలిగాను. ఓ క్షణం కనుమరుగైతే ఆమె దాటిపోయేదే! అసలే సన్నగా వుండేదేమో. మరీ పరిస్థితుల వత్తిడికి ఎమికలప్రోవై పోయింది. నల్లబడ్డదికూడా....అందంఏకోశానాఅవుపించలేదు. అదే జానకిగాక మరొకరైతే, నా హోదాకు మట్టుకు నేను మాట్లాడివుండక పోదును. గుర్తించి పిలిచాను.

'జానకీ!' అని.

వెనుతిరిగి చూచింది. 'పార్వతీ నువ్వా!' అన్నది.

'అవును....రా' అని పిలిచాను. సెకండ్ క్లాసు పెట్టెలోకి రమ్మంటే ఎంతకీ రాదే. 'అది దొరలపెట్టె. నే రాను' అంటది.

నన్ను చూచి బొలబొలా ఏడ్చింది.

'అతను మళ్ళీ కనిపించాడా?' అడిగాను.

సమాధానం చెప్పకుండానే తెలిసింది.

బండి బయలుదేరిం తర్వాత కొంతసేపటికిగానీ జానకి తేరుకోలేదు. 'గొలుసులాగి బండి దిగిపోతానని.' మొండికేసింది. కానీ అలా చేయలేక పోయింది.

'నీతో చాల విషయాలు మాట్లాడాలి. గుంటూరు వెడదాం రా' అన్నాను.

'నేను రాను' అన్నది.

'వారు ముకుందంలాంటివారు మాత్రం కాదులే' అన్నాను.

'ఇస్. అతగాడి పేరెత్తకు పార్వతీ' అన్నది. ఆమె కళ్లు తిరిగి అశ్రుపూరితాలయినాయి.

'అయితే నీవు పెళ్లి చేసుకున్నా'వన్న మాట........నువ్వా దిగావా రొంపిలోకి' అన్నది లోతుల్లోంచి, బాధల్లోంచి.

'తప్పని సరైంది' అన్నాను సమాధానంగా.

జానకిని గురించి చాలా యోచించాను....

'పోనీ నిన్ను తిరిగి మీవాళ్ళదగ్గరకు పంపుతాను. పోరాదూ?' అన్నాను.

'కృష్ణలోపడి చస్తాను' అన్నది.

'అంతపని చెయ్యవద్దులే....కాస్తో కూస్తో చదువుకున్న దానివి. వారికి ఎలాగూ కాలేజీలో ఉద్యోగం కదా....నిన్ను పరీక్షకు చదివిస్తాను. చదువు. ఏదైనా ఉద్యోగం చేసుకోవచ్చు' అన్నాను.

'నేనంటే నీకెందుకింత దయ పార్వతీ' అన్నది.

జానకి పిచ్చితనానికి నవ్వొచ్చింది.

'పోనీ మాకొక ఫామిలీ డాక్టరమ్మ వుంది. ఆవిడ దగ్గర నర్సుగా చేరు....ఆయనగారితో చెప్పి ఒప్పిస్తాను' అన్నాను.

ఏదైనా చేయడానికి సిద్ధపడ్డది పాపం జానకి!

★

'వేణు' ఏమైనా అనుకుంటాడని నాతో రావడానికి జానకి సిగ్గుపడ్డది కాని అంతకన్నా ఆమెకు ఆప్తులు, ఆదరించగలవారు మాత్రం ఎవరున్నారు? వారితో జానకిని గురించి చెప్పాను. సానుభూతితో అంతా విన్నారు. దయగా ఆలోచించారు. లాలనగా జానకిని పలకరించారు.

'చాలామంది మగవాళ్లు అంతే నమ్మాయ్. అంతమాత్రాన హైరానపడి ప్రయోజనం లేదు.' అన్నారు.

జానకి జీవితంలో వానకురిసి వెలిసినంత పనయింది. హృదయం తేలికయినంతగా పీలయింది.

'మీ దాంపత్యం యింత బాగా వుంటుందని నే ననుకోలేదు పార్వతీ!' అన్నది.

జానకిని డాక్టర్ రాధారావు దగ్గర నర్సుగా చేర్పించాలని ఆయన ప్రయత్నం చేశారు, రాధారావు మా ఫామిలీ ఫ్రెండ్ అన్నాను. రాధ చదువుకునే రోజులో 'వేణు'తో స్నేహమట. ఆ స్నేహం అలాగే వుండిపోయింది. 'వేణు' ఆ విషయం నాతో ఎప్పుడో చెప్పారు. పెళ్ళయిన క్రొత్తలోనే తనకొక స్నేహితురాలున్నట్లు, చాలా మంచిదని.

అనుమానం నాలో కలగక పోవడానికి కారణం- ఆయన చాల నిర్మొహమాటంగానే చెప్పటమే ననుకుంటాను. రాధాదేవి కాలేజీలో చదివే రోజుల్లో వారితో ఎలానో పరిచయం అయింది. ఆ పరిచయం స్నేహంగా మారింది. స్నేహం స్నేహంగానే వుండిపోయింది. ప్రేమగామారే ప్రమాదం ఆనాటికీ ఈనాటికీ కలగలేదు. 'ధన్యోస్మి' అనుకున్నాను, వారా విషయం చెప్పినప్పుడు.

రాధాదేవి చరిత్ర చాలా విచిత్రమైంది. ఆవిడ చాల బీద కుటుంబంలో పుట్టింది. ఎలాగో కష్టపడి చదువుకుంది. చదువు లేకపోతే గతిలేదని ఆమె భావన. 'ఆమె అంత దరిద్రురాలు కావటంవల్లనే నా ఆదరం చూరగొన్నది' అంటాడు వేణు. నిజమేనేమో ఎలా కాదనగలం? కొందరు కార్లు, సిల్కులు, రంగులు, పై మెరుగులు చూచి ఎలా మనసు పడతారో, మరికొందరు, పరిశుద్ధమైన మనస్సును అర్థం చేసుకున్నప్పుడు ఆరాట పడతారు. రాధాదేవి బాగా తెలివిగలది కావటం వల్ల, వేణు ఆమె అంటే అభిమానం చూపించాడు. చాల బీదపిల్ల కావటంవల్ల కొంత డబ్బు సహాయం చేసేడుట. అవన్నీ వేణు చెప్పినప్పుడు 'రాధాదేవి' అంటే నాకు తెలియకుండానే నాలో ఆమెమీద ప్రేమ ఏర్పడ్డది. అసూయ పడతాననే అనుమానం కూడా వేణుకి కలగలేదు. అదీ ఆయన తత్వం.

ఈ మధ్యనే రాధాదేవి వివాహం చేసుకున్నది, మా పెళ్ళిఅయిన కొద్ది రోజుల్లోనే. 'వేణు' పెళ్ళి అయితేగానీ తాను చేసుకోనని పట్టు పట్టిందని అసలు కారణం అదికాదని చెప్పాడు వేణు,

రాధాదేవి 'రావు' అనే ఒక అతన్ని ప్రేమించిందట. అప్పటికే 'వేణు'తో ఆమెకు పరిచయం. చదువుకున్నవాళ్ళుకూడా యిలా ప్రేమ, ప్రేమ అని ఎందుకు పడిచస్తారో నా కర్థం కాలేదు. ప్రేమించిందే పో పెళ్ళి చేసుకోవచ్చుగా. అదీ చేయలేదు. కొంత కాలం అతగాడితో కులికింది. అందులో చదివేది డాక్టరు కోర్సు. రావు తర్వాత పరారైనాడు.

వేణు ఉదయం కాలేజీనుండి వొస్తూనే అన్నాడు-

'ఈవేళ సాయంకాలం డాక్టరు రాధారావు టీ కొస్తుంది. రమ్మని చెప్పాను. అప్పుడే జానకి విషయంకూడా తేల్చుకుందాం' అని.

'రాధారావు ఒక సామాన్య వ్యక్తికాదు. డాక్టరు. ఆమెకి తగ్గమర్యాదలు చేయగలమా అని నా అనుమానం.' అన్నాను వేణుతో.

'రాధ అలాంటిది కాదు పార్వతీ, మనలో మనిషిగా కలిసి పోతుంది. ఆమెనుగురించి నువ్వు విన్నావేగాని, ఆమెను చూడలేదు. నీలాగే వుంటుంది. అంతే. ఆమెకోసమని పెద్ద అట్టహాసం ఏమీ చేయనవసరం లేదు' అన్నాడు.

ఎంత మన మనిషైనా, ఎంత వేణుకి రాధ స్నేహితురాలైనా, అతిథిగా వొచ్చినప్పుడు ఆమె హోదాకితగ్గ మర్యాద చేయడం మా కర్తవ్యం.

రాధాదేవి వొస్తున్నదని చెప్పినప్పుడు జానకి ఆనందం ఇనుమడించింది. హృదయ భారమంతా ఒక్కసారిగా తీరిపోయినట్లే భావించింది.

'ఆమెగారు ఎలా వుంటుంది పార్వతీ?' అడిగింది మామూలుగా. అమాయకంగా చిన్నపిల్లకుమల్లే ప్రశ్నించింది.

'నిజానికి ఎలా వుంటుందో నాకూ తెలీదు. నేను ఎప్పుడూ ఆమెను చూడలేదు' అన్నాను.

జానకి నమ్మింది కాదు. తనతో పరాచికాలాడుతున్నాననుకుంది.

'బాగా అందంగా వుంటుందా?' అన్నది.

తనకంటె అందంగావుంటే అసూయపడే తత్వం జానకిది. ఇన్ని ఎదురు దెబ్బలు తిన్నా ఆనైజం మానలేదు. స్త్రీ తత్వానికి మామూలే అది. అలా అసూయపడటమూ....

'బహుశా ఉండవచ్చు' అన్నాను.

'పార్వతీ! నర్సుగావుంటే, వొచ్చేరోగులు, పోయేరోగులు, మహా అసహ్యంగా వుంటుంది కదూ!'

'అసహ్యం అయితే రాధ ఎలా భరిస్తుందంటావ్. అంతా అలవాటు' అన్నాను.

ఆ రోజు ఏర్పాట్లన్నీ జానకి స్వయంగా చేసింది. హాల్లో నాలుగు కుర్చీలు, టీ టేబిలు, అందంగా అమర్చింది. ఫ్లవర్ వేజులు చక్కగా పెట్టింది. యిల్లంతా ముస్తాబు చేసింది. బాగా అందంగా తయారయింది. నన్ను వొద్దన్న కొంచికీ ముస్తాబు చేసింది.

'వేణు' ఈ తతంగమంతా చూచి ఆశ్చర్యపోయాడు.

'ఏమిటి పార్వతీ ఈ వ్యవహార మంతాను, ఇదంతా నీ పనా, జానకి పనా' అన్నాడు నవ్వుతా.

'జానకే'

'ఇవన్నీచూచి రాధాదేవి సంతోషించి తనను....'

జానకి సిగ్గుపడ్డది. కళ్లు చిలిపిగా నవ్వుకున్నయ్. సిగ్గు మొఖాన్ని, శరీరాన్ని కప్పి వొయ్యారాల్ని వొలక బోసింది.

అయిదు గంటలకల్లా రాధాదేవి రానే వచ్చింది. ఆవిడ డాక్టరు అని నే ననుకోలేదు నిజానికి. మామూలు ఓ తెల్లచీరకట్టుకుని, అదేరకం రవికె వేసుకుని వుంది. డాక్టరు హోదా కాదు గదా, కనీసం ఏ రకమైన హోదా కూడా అవుపించలేదు మనిషిలో.

'నమస్కారం పార్వతీ!' అన్నది.

'నమస్కారం' అబ్బ! ఎంత చనువు. ఎంత చక్కటి అణకువ. నాకు అబ్బురం అయింది ఆమె ప్రవర్తనకు. ఆమె దగ్గర కొత్తదనం ఏమీ ఫీల్ కాలేకపోయాను. 'వేణు' కాఫీతాగి అవతల గదిలోకి వెళ్ళి చదువు కొంటున్నాడు. నేను, రాధా, జానకి, మా మూలు స్నేహితులకుమల్లే పిచ్చాపాటీలో పడ్డాం. హృదయాల్ని చీల్చుకుని అనేక రహస్యాలు బయటపడ్డాయి కూడా నేమో! కాకపోతే ఒక్క అరగంట సంభాషణలో 'ఏవోయ్' అన్నంత ఆత్మీయంగా రాలేము గదా!

ఆ చనువు పురస్కరించుకునే రాధతో అన్నాను-

'ఏమోయ్ నీ పెళ్ళికి మమ్మల్ని పిలవ వన్నా పిలవలేదు?'

'ఏం పెళ్ళి—నా పెళ్ళి అయిపోయి అయిదు సంవత్సరాలైంది.' అన్నది.

'మరి మొన్ననే అయిందన్నారు వారు' అన్నాను.

'అదంతా ఓ విచిత్రమైన గాధలే. ఈ మధ్యనే సంసారం పెట్టాం' అన్నది నవ్వుతో డాక్టరమ్మకు కూడా సిగ్గు వుంది.

'అయిదేళ్ళనాడే నేనూ, రావూ పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం. అనుకున్నప్పుడు అయినట్లే లెఖ్క. మంగళసూత్రం కట్టటం ....తరువాత హాయిగా....'

'అవును అర్థమయింది.' అన్నాను.

జానకి కేవలం ప్రశాంతంగానే వుంది.

'ఏదో మాటా మాటావచ్చి రావు అలిగి వెళ్ళిపోయాడు. కొంత కాలం దేశయాత్ర చేసి వచ్చాడు. అయినా ఒకసారి అతన్ని చేసుకుందా మనుకుని, ఏ స్వల్ప కారణం వల్లనో తిరిగి మరొకర్ని ఎలా చేసుకోను! అందుకే అతనికోసం ఎదురు చూస్తూ వున్నాను యింతకాలం. సంవత్సరం క్రితం రావు కనిపించాడు. అప్పుడు నేను వైజాగ్‌లో పనిచేస్తున్నాను. సముద్రపు వొడ్డున స్పృహ లేకుండా పడివున్నాడు. బట్టలన్నీ తడిసిపోయి నానా ఖచాటాగా వున్నాడు. బహుశా సముద్రంలో పడివుంటాడు. లేక సొమ్మసిలి పడి పోయాడో; నాడి పట్టుకు చూద్దును కదా! చాలా నీరసంగా వుంది. అప్పటికి వారం రోజులైవుంటుంది భోజనంచేసి.....

ఆ మరుక్షణంలోనే రావు నావాడను కొన్నాను. అంతకాలం అతను ఏవేవో దేశాలు తిరిగాట్ట.....

'హల్లో రావ్....కమాన్....'అని వేణు కేక వినిపించి ముగ్గురం లేచాం కుర్చీల్లోంచి. జానకి యింట్లోకి వెళ్ళింది.

రావును రాధ నాకు పరిచయం చేసింది. జానకితో పరిచయం చేద్దామని పిలిచాను. కాని జానకి రాలేదు. మగవాళ్ళంటే ఇంత అభిమానం. ఇంతసిగ్గు ఎప్పుడు నేర్చుకున్నదా అనుకున్నాను.

నేను వేణు, రాద, రావు, నలుగురం చాల సేపటివరకు మాట్లాడుకుంటూనే వున్నాం. వేణు స్నేహితురాలు రాధ. రాత్రి ఎనిమిది గంటలైంది. జానకి విషయం రాధతో చెప్పాం.

'రేపు తప్పకుండా పంపవోయ్ పార్వతీ! ఆ చిన్న విషయానికే యింతగా చెప్పాలా' అన్నది.

రాధా రావులు వెళ్ళిపోయారు.

'జానకీ ఇక రావచ్చురా. వాళ్లు వెళ్లిపోయారులే' జానకి పలకలేదు. ఓ అరగంట వుండి లోపలికి వెళ్లాను. ఎక్కడా కనుపించలేదు. కట్టుకున్న పట్టుచీర గది మధ్యలో విడిచి వుంది. చీర తీసి మంచంమీద వేస్తున్నప్పుడు ఓ కాగితం అవుపించింది. చేతులు వొణికాయి. వేళ్లు చల్లబడ్డాయి. అది చదువుతోంటే-

పార్వతీ!

నీ ఆదర్శాన్ని మరచిపోను. రావు ఎవరో. కాదు నా ముకుందం.....నన్ను మరచిపో. ఇక నన్ను చూడలేవు....

జానకి.....

అవును. తర్వాత జానకిని చూడలేదు.

అయినా జానకిని మరచిపోలేక పోయాను. ఆమె అన్నమాటలు ఇప్పటికీ నా చెవుల్లో రింగు మంటూనే వుంటాయి.

వెన్నెల కాస్తుంది. ఉన్నత స్థలాలు, విశాలమైన ప్రదేశాలు మాత్రమే వెన్నెలల్ని అనుభవిస్తాయి. గాలి వీస్తుంది. అదీ ఉన్నత స్థలాలను, విశాలమైన ప్రదేశాల్నే స్పృశిస్తుంది. ఇరుకు ప్రదేశాల్ని, గుహల్ని వెన్నెలలు గానీ, మలయ వీచికలు గానీ స్పృశించవు. ఆనందం, సంతోషం అనేవి బాగా ఎదిగిన కొన్ని హృదయాల్ని మాత్రమే స్పృశించి రంజింప చేస్తాయి. చీకటిగా-ఇరుకుగా వుండే మనసులు ఆనందాలకు, అనురాగాలకు దూరం అవుతాయి.

★


ఫిబ్రవరి విడుదల

ప్రపంచ ప్రసిద్ధి నందిన శరత్ బాబు రచనలకు అత్యుత్తమ తెలుగు అనువాదాలు, ప్రతి వారికీ అందు బాటులో ఉండే తగ్గింపు ధరలకు అందించ బడు తాయి.

| | |
|---|---|
| అరక్షణీయ | 0-8-0 |
| పరిణీత | 0-8-0 |
| బడదీది | 0-8-0 |

రూ. 2-0-0 లు పంపువారికి మూడు పుస్తకాలు రిజిస్టరు పోస్టులో పంపుతాము.

ఏజెంట్లు 25% కమీషను మినహాయించుకొని కావలసిన కాపీలకు ముందుగా డబ్బు పంపాలి.

ఆలస్యంగా చేరిన ఆర్డర్లకు కాపీలు అందక పోవచ్చు. నేడే మీ ప్రతిని రిజర్వు చేసుకోండి.

వివరాలకు:

జ్యోతి కార్యాలయం,
మద్రాసు-17.



# ఆకర్షణ: ఆభరణాలు

ప్రకృతిలో స్త్రీ ఆకర్షించేది గానూ, పురుషుడు ఆకర్షించబడే వాడు గానూ ఉన్నారు. యీ ఆకర్షణ స్వభావ సిద్ధమైనదే ఐనప్పటికీ సౌందర్యాన్ని పెంపొందించుకోవటం ద్వారా, ఆకర్షణను పెంచటం అవసరమైంది. దీనికిగాను స్త్రీ తరతరాలు గానూ నానా అవస్థలూ పడుతూ వుంది.

ప్రతి నాగరికతలోనూ స్త్రీలు సౌందర్యారాధకులుగా ఉంటూ, పురుషుల్ని ఆకర్షించి, వారి మన్ననలను పొందుతూనే వున్నారు. ఐతే ప్రతి స్త్రీకీ సహజ సౌందర్యమంటూ ఉండక పోవచ్చు; లేదా సహజ సౌందర్యానికి మెరుగులు దిద్ది, మరికొంత కృత్రిమ సౌందర్యాన్ని కూడా ఎరువు తెచ్చుకొని, తన పురుషుణ్ని కొంగున కట్టుకునే ప్రయత్నం స్త్రీ చేస్తూనే వుంది. దీన్ని సాధించేందుకు అనేక రకాల సౌందర్యాన్ని అభివృద్ధిచేసుకొనే సాధనాలను ఆమె కనిపెట్టింది; వస్త్రధారణ దగ్గిర్నుంచీ, సువాసన ద్రవ్యాలవరకూ, పౌడర్లూ, స్నోలూ, వాసన నూనెలూ మొదలైన వాటిని నిత్య జీవితంలో వాడటమనేది, ఏదో వొకరూపాన ప్రతి యుగంలోనూ జరుగుతూనే వుంది. వీటన్నిటికన్నా ముఖ్యమైనది ఆభరణాల్ని ధరించటం!

యీ ఆభరణ ధారణ ప్రతి యుగంలోనూ, సమాజంలోనూ ఒకే విధంగా లేదు. చివరకు యీ నాడు కూడా రెండేళ్ల క్రితం వున్న ఆభరణం యీ నాటికి చాలా పాతదిగా పరిగణించబడుతోంది. మానవుడు తన బుర్రను ఉపయోగించి రకరకాల రూపాల్లోనూ ఈ ఆభరణాల్ని సృష్టిస్తూనే ఉన్నాడు. ఐతే యీ ఆభరణాలకూ, లైంగిక ఆకర్షణలకూ వున్న సంబంధం ఎలాటిదో, ఆభరణ ధారణ ఎన్ని చిత్ర విచిత్ర పద్ధతుల్లో అమలు జరుపబడుతోందో యీ వ్యాసంలో తెలుసుకుందాం:

ఆదిమ మానవుడు అలంకారాల సంగతి అటుంచి, వస్త్రధారణను కూడా

ఎరుగడు. నగ్నంగానే జీవితాన్ని గడిపేం దుకు అలవడ్డాడు. కాని క్రమేణా ప్రకృతి బాధలనుంచి తనను తాను కాపాడుకునేందుకుగాను ఆకు అలముల్నీ, జంతు చర్మాల్నీ దేహ రక్షణకు గాను ఉపయోగించ సాగాడు. ఆ తరువాత వస్త్రధారణను కనుగొన్నాడు.

వస్త్రధారణ అనేది కేవలం శారీరక రక్షణకే గాక, లైంగిక ఆకర్షణకు కూడా ఉపకరిస్తూన్నదనేది మనం తేలిగ్గా రుజూ చేయవొచ్చు. ఎంత చెమట పోస్తున్నా, వస్త్రాలు అవసరం కాక పోయినా, ఎంతఎండాకాలమైనా, మనం దిగంబరులుగా ఉండటం లేదు. దిగంబరత్వాన్ని, నాగరికత బహిష్కరించింది. ఐతే నాగరికత ఉద్దేశ్యమేమిటి?

మానవుడు దిగంబరత్వమనేది ఏ విధంగానూ లైంగిక ఆకర్షణ కాదని ఏ నాడో గ్రహించాడు; పైపెచ్చు నగ్నత్వం మానసికమైన లైంగిక విముఖతను పెంపొందిస్తుంది. కనుక శరీరంలోని కొన్ని ముఖ్య భాగాలను-ఉదాహరణకు ముఖం, రొమ్ములు, జననేంద్రియాలు—ఆచ్ఛాదనల వెనుక మరుగు పరచటం వల్ల, మానసికమైన ఆతృత హెచ్చి, లైంగిక ఆకర్షణ అధికమౌతుందని గ్రహించాడు.

ఇదే ఉద్దేశ్యంతో-పురాతన, మాధ్యమిక, నవీన యుగాలలోని స్త్రీలు రకరకాల ఫ్యాషన్ల ద్వారానూ, అనేక ఆభరణాల్ని ధరించటంలోనూ ఎంతో శ్రద్ధ కనబరిచారు. యీ ఫ్యాషన్లు ఒకో ప్రదేశంలో ఒకో విధంగా, ఒకో సమాజంలో ఒకో విధంగా, ఒకో కాలంలో ఒకో విధానంలో ఉన్నవి.

వీటిల్లో కొన్ని ఆభరణాలు మాత్రం కాల పురుషుని కోరల్లో నలగకుండా నేటి దాకా వొచ్చినవి. ఉదాహరణకు రొమ్ముల సౌందర్యం ఇనుమడింప జేసేందుకూ, స్తనాలమీది వొంపులు కనిపించేందుకు వీలుగా, జాకెట్ మెడ కత్తిరింపులూ, భుజాల దగ్గిర బిగుతుగా ఉండే విధానం, మెడమీద వొంపుకు మరికొంత ఆకర్షణను ఇచ్చేందుగాను, ఏ బంగారు గొలుసో, ముత్యాల తావళమో ధరించటం, నడుం బిగించి, వ్యక్తి శారీరక సౌందర్యాన్ని హెచ్చించేందుకు వడ్డాణ్ణం లేక బెల్ట్‌ను బిగుతుగా బిగించటం, మొదలైన అనేక లైంగిక ఆకర్షణకు ఉపకరించే పద్ధతులూ, ఆభరణాలూ శతాబ్దాల తరబడిగా, వాటి స్థూల రూపాల్ని కోల్పో లేదు.

ప్రతి తరంలోనూ యీ ఆభరణాల మీది నగిషీలూ రూపాలూ కాస్త కాస్తగా మారుతూ వొచ్చినవి. యీ విధంగా ప్రపంచంలోని స్త్రీలు, పురుషుల్ని తమ వలల్లో వేసుకునేందుకు ఆభరణాల ద్వారా చేసిన కృషి ఎలాటిదో చూద్దాం:

ఐతే ఇక్కడ పాఠకులకు ఒక సందేహం కలగవొచ్చు. పురుషుల్ని ఆకర్షించేందుకే స్త్రీలు అనేక ఆభరణాల్ని ధరించారా? ఇలాటిది పురుషులు మాత్రం చేయలేదా? పురుషులుకూడా స్త్రీలను ఆకర్షించేందుకు గాను ఆభరణాల్ని ధరించటం, రకరకాల దుస్తుల్ని ధరించటం ఒకో సందర్భంలో తమ జననేంద్రి

యాల్ని గొప్ప ఆకర్షణగా కనిపించేట్లు స్త్రీలకు ప్రదర్శించటం కూడా చేశారు. ఒక శతాబ్దం క్రితం యూరప్ అంతటా అమల్లోవున్న బిగువైన పొడుగులాగూలు, పురుషాంగపు తాలూకు సరిహద్దుల్ని స్పష్టంగా ప్రదర్శించేదిగా చలామణీ ఐంది. ఇదిగాక సౌందర్యా రాధనకు ఉపకరించే సుగంధ ద్రవాలూ, స్నోలు, పౌడర్లు మొదలైన వాటిని పురుషులు మాత్రం ఎందుకు ఉపయోగించటం లేదు?

ఇక సౌందర్యం అంటే ఏమిటనే దాన్ని తేల్చటం బ్రహ్మతరం కూడా కాదు. అది ఒకో వ్యక్తికి ఒకో రకమైన అభిప్రాయంగా వుంటోంది. ఐనప్పటికీ అధిక సంఖ్యాకుల అభిప్రాయాలను సమన్వయించి, ఆయా కాలానికి, మానవుల తత్వాలకు సరిపడేట్లుగా సౌందర్యానికి ఒక విశిష్ట రూపమంటూ ఏర్పడింది. ఒక సమాజంలో, లేదా ఒక యుగంలో, సౌందర్యంగా భావించబడిందే, మరో చోట వికృతంగా భావించబడింది. కనుక సౌందర్యమనేది కాలంతో పాటు, మనుషుల తత్వాలతో, అభిరుచులతో పాటు మారుతూంటుంది కనుక, దాని కొక స్టాండర్డును నిర్ణయించటం కుదరదు.

యీనాడు చరిత్ర పరిశోధకులు పూర్వీకుల సౌందర్యా రాధన ఎలా వుండేదో ఎలా చెప్పగలుగుతున్నారనే అనుమానం మా పాఠకులకు కలగవొచ్చు. పురాతన శిల్ప కళ, ఆభరణాలు, సాహిత్యం మొదలైన వాటిల్లో, పూర్వీకుల అభిరుచులు స్పష్టంగా ప్రతిఫలిస్తవి. ఉదాహరణకు: ఒకప్పుడు సన్నగావుండే స్త్రీల కన్న, లావుగా వుండే స్త్రీలే సౌందర్యవతులుగా పరిగణించబడే వారనే వాదాన్ని బలపరుస్తూ, ఆ రోజులకు సంబంధించిన శిల్పకళలోని స్త్రీ మూర్తులు లావుగా, ఎత్తయిన పిరుదుల్తో, విశాల వక్షంతో ఉండడం కనిపిస్తుంది. ఐతే యీ కళలో అతిశయోక్తులు ఉన్నప్పటికీ, స్థూలంగా వారి భావాలు ఎలా ఉండేవో తప్పక తెలుస్తూనే వుంటుంది.

లలిత కళల్నే ఎరుగని జాతుల్లో సౌందర్యారాధనకు తార్కాణాలేమిటి? తరతరాలుగా వొస్తూన్న వారి ఆచార వ్యవహారాల్నిబట్టి, ఆనాటి వారి సౌందర్యానికీ, యీనాటి సౌందర్యానికీ పెద్ద భేదమంటూ ఉండదు కనుక, దాన్నిబట్టే చెప్పవొచ్చు.

ఆఫ్రికాలోని నైగీరియా ప్రాంతాల్లో నివశించే 'ఎనోయ్' జాతి స్త్రీల లైంగిక ఆకర్షణ ఎలాటిదో చూడు: ఆడపిల్ల రజస్వల కాగానే 'బలపు పద్ధతి'కి గాను ఏర్పడిన పాఠశాలకు పంపబడుతుంది. ఇక్కడి పనీ పాటా ఉండదు. కేవలం ఆమె బలపడాలి. తిని, కొవ్వు పెంచాలి. యీ విధంగా ఆమె ఎంత బలిస్తే అంతఅందగత్తెగా భావించబడేది. యీ ఖర్చు భరించలేని తల్లిదండ్రులకు సామాజికంగా గౌరవం ఉండదు. ఇక్కడి శిక్షణ కొన్ని వారాల మొదలూ రెండు సంవత్సరాల వరకూ సాగుతుంది. చివరకు వెళ్లేప్పుడు 'యోని లింగం' (క్లిటూరిస్)ను పొడువు చేయటంకూడా, సామాన్యంగా జరుగుతూంటుంది. యీ పద్ధతినిబట్టి, ఆ సమాజంలోసన్నగావుండే స్త్రీలు అనాకారులుగానూ, లావుగా

బలిసివున్న స్త్రీలు సౌందర్యవతులుగానూ చలామణీ అవుతున్నారని చెప్ప వొచ్చు.

మరికొన్ని సమాజాల్లో లైంగిక ఆకర్షణ నుంచి 'నిషేధం'గా కొన్ని పనులు చేసే ఆచారం వుంది. ఉదాహరణకు వికృతంగా మొహానికి రంగులు వేయటం, పచ్చబొట్లు పొడిపించటం, మొదలైనవి. కాని తీరా యీ అలంకారాలు జరిగాక, అవికూడా ఒక రకం లైంగిక ఆకర్షణగా పరిణమించ సాగినవి. యీ నిషేధాలకు మతైకమైన ప్రాధాన్యత వున్నప్పటికీ, అవి ఇంద్ర జాలంవలె పురుషుల్ని ఆకర్షించటంలో వెనుకాడ లేదు.

స్త్రీలు పురుషుల్ని ఆకర్షించేందుకు అలంకరణలు చేసుకోవటమనేది ప్రపంచంలో ఎప్పుడు ఆరంభమైనదనే దానికి స్పష్టమైన జవాబు చెప్పటం కష్టమే! కాని రాతి యుగంలోకూడా ఇలాంటిది ఉన్నదనే తార్కాణాలున్నవి. అంటే 150,000 సంవత్సరాల క్రితంకూడా, ఆలిచిప్పలు, జంతువుల ఎముకలు, రాతి ఆభరణాల్ని స్త్రీలు ధరించే వారు! భూస్థాపితమైన చరిత్ర బైటపడి, యీ సత్యాల్ని వెలిగ్రక్కింది.

పురాతన యీజిప్ట్‌లోని శిల్ప కళాఖండాలూ, ఆనాటి ఆభరణ విశేషాలూ, ఏ మ్యూజియమ్‌లో చూసినా, క్రీ. పూ. 400 సం||లకే వారి దృష్టి ఎంత ముందుకు ఉరికిందో అర్థమౌతుంది. ముఖ్యంగా స్త్రీలు ధరించే ఆభరణాదులు ప్రపంచంలో మరే ప్రాంతాల్లోనూ అంత విరివిగా ఆనాడు ఉపయోగించబడలేదు. ఆనాటికే వారి స్త్రీలు అతి సున్నితమైన వస్త్రాలంకరణలు చేసుకునే వారు. ఇక శిలా విగ్రహాలు, యీనాటికీ చెకుచెదరకుండా వుండి వారి కంఠాభరణాలనూ, కర్ణాభరణాలనూ, నాసికాభరణాలనూ తెలియ చెపుతూనే ఉన్నవి. మిగతా ప్రపంచమంతా, వెనుకబడి ఉన్నప్పుడే యీజిప్ట్‌లో నాగరికత ఆనాటికే వెల్లి విరిసింది.

పూర్వీకులు సున్నితమైన వస్త్రాలను అవిసె నార నుంచి నేసే వారు. శిరోభూషణాల్ని ధరించటంకూడా పూర్వీకుల ఆచారంగా వుండేది. స్త్రీకి తల వెంట్రుకలు ఎంతో సౌందర్యాన్ని కూరుస్తవి. సహజంగానే మంచి తల కట్టు లేని స్త్రీ-సవరాలనూ, విగ్గులనూ వాడి, తన సౌందర్యాన్ని ఇనుమడింప చేయటమనేది ఆనాడే వుండేది.

స్త్రీలు ఉపయోగించే, పలచని, తేలికైన పాదరక్షలు, తాటి యాకులతోనూ, తాటి పట్టెలతోనూ, లేదా ఒక రకం గడ్డివలె పెరిగే చెట్టు బెరళ్ళతోనూ తయారుచేసే వారు. ఒకొకప్పుడు ఏ మేక చర్మంతోనో తయారుచేసి రక్త వర్ణంతో అలంకరించే వారు. చేతి గోళ్లకూ, కాలి గోళ్లకూ పసుపు కలిసిన ఎరుపు రంగును వాడేవారు. యీ ఆచారం ఇప్పటికీ ఉత్తర, పశ్చిమ ఆఫ్రికాలోని అనాగరిక జాతుల్లో చూడనవుతుంది.

స్త్రీలు శిరోజాలను అల్లటంలో ఎంతో ప్రావీణ్యత చూపేవారు. జడలో పూలను ధరించడమేకాక, మైనంతో కలిసిన సుగంధ ద్రవ్యాలనుకూడా వాడేవారు. శరీరోష్ణానికి ఆ మైనం కరిగి క్రమంగా ఆ వాసనను విస్తరింప జేస్తూ,

శిరోజాలకు తళ తళ కాంతుల్ని ప్రసాదిస్తుంది.

స్త్రీ శరీరంలోని ఏ భాగాన్నీ నిర్లక్ష్యం చెయ్యలేదు. రొమ్ములకు ఆచ్ఛాదనల్ని ఏర్పరచి, గట్టిగానూ, నిలువుగానూ ఉండేట్లుగా చేసుకుంది. ఇక మెడ భాగానికి బంగారు కంటెలను ఒక దాని మీద మరోటి అమర్చట మనేది యీజిప్షియన్లకు క్రీ. పూ. 1700 ముందే తెలుసు. ముఖ్యంగా రాజవంశీయులు బంగారు ఆభరణాల్ని విశేషంగా ఉపయోగించేవారు. మరణానంతరం గడిపే పరలోక జీవనంలోకూడా స్త్రీ తన లైంగికాకర్షణలను విడనాడ రాదనే నమ్మకంతో, గోరీలలో (పిరమిడ్స్) ఇలాంటి వస్తు సంచయం, సంక్షిప్తం చేయబడింది. యీజిప్ట్‌లో బంగారం విశేషంగా లభించేది. ఉపయోగించినంత ఉపయోగించి, మిగతాది సిరియా, బాబిలాన్ లకు ఎగుమతి చేయబడేది.

కంటి రెప్పలకు నల్లరంగు వేయటం, ముఖానికి సౌందర్యాలంకరణల్ని చేసుకోవటం, చేతిలో చిన్న గంధపు చెక్కను ధరించటం మామూలు. ముఖానికి సన్నని వలువను ఆచ్ఛాదనకు వాడటం కూడా కద్దు. ఇది మహమ్మదీయ ఆచారంగా చలామణీ ఐనప్పటికీ, క్రీ. పూ. 4000 సం. ల అప్పుడే ఇది ఈజిప్షియన్ ఆచారంగా వుండేది; మహమ్మదీయ ఆచారంగా అది క్రీ. శ. 600 సం. లో చలామణీ కాసాగింది.

ఇక మధ్య అమెరికాలోని మయజాతి నాగరికత - క్రీ. పూ. 97 నుంచీ, క్రీ. శ. 1541 వరకూ సాగి, క్రమంగా పతనమైంది. ముఖ్యంగా స్పెయిన్ దేశస్థులు దేశాన్ని జయించాక, మయజాతి నాగరికత అంతమైంది.

మయజాతి స్త్రీపురుషులు లైంగికాకర్షణలను పెంపొందించుకునేందుకు అనేక విధానాల్ని అనుసరించారు. యీ ఆకర్షణ సౌందర్యాన్ని ఎంత ఇనుమడింపజేసినా, స్త్రీకి సిగ్గే గొప్ప ఆభరణంగా భావించబడేది. పురుషుని తీవ్ర దృక్కుల్ని స్త్రీ ఎదుర్కోకుండా, పక్కకు తప్పుకోవటం విధిగా అనుసరించబడేది.

యీ సిగ్గువల్లనే స్త్రీలు తమ రొమ్ముల్ని ఆచ్ఛాదనలతో కప్పేవారు. విందుల్లోనూ, పండగ పబ్బాల్లోనూ స్త్రీలు పురుషులతో కలిసేవారు కాదు కాని, వారు పేరంటాల్లాటి వేడుకల్ని తమలో తామే చేసుకునేవారు.

ఐనప్పటికీ, స్త్రీ పురుషుణ్ని ఆకర్షించి తీరాలనే ప్రకృతి శాసనాన్ని అమలు జరిపేందుకు, నూలుగుడ్డల్నీ పక్షుల ఈకల్నీ ధరించేవారు. ముఖ్యంగా ముఖంలోని ప్రతి అంగాన్నీ ఏదో విధంగా అలంకరించటం ద్వారానో, రంగు వేయటం ద్వారానో, దానికో ప్రాముఖ్యతను నెలకొల్పేవారు. చివరకు పెదవులకూడా, గట్టిగా అంటిపట్టుకునే ఎముకతో చేయబడిన సాధనాన్ని ఉపయోగించేవారు. ముక్కుకు రాతితో చేయబడిన వలయాకారపు ఆభరణం వుండేది. పలువరుస వాడిగా అందంగా కనిపించేందుకు పదునైన ఆయుధంతో చెక్కబడేది. చెవులకూ, మెడకు

శిలలతోనూ, రాగితోనూ చేయబడిన ఆభరణాలుండేవి.

మయజాతి నాగరికతలో, వారి విశాల దృక్పథం కనిపిస్తుంది. ఐతే స్వభావసిద్ధమైన వాంఛలకూ, ప్రకృతి శాసనాలకూ వారు బద్ధులే! ముఖ్యంగా తలను అందంగా (అప్పటి వారిదృష్ట్యా!) తయారు చేసేందుకుగాను, బిడ్డపుట్టిన కొద్ది నెలల తర్వాత, తలకు వెనుక వైపున బలమైన కొయ్య చెక్కను అంటగట్టేవారు; ఇందువల్ల తల వెనుకకు పెరగటం ఆగి, ముందుకు తోసుకుంటుంది. క్రమంగా నొసలు భాగం లోనికి వెళ్తుంది. ఇక శిరోజాలకు ముందు భాగంలో ఏదన్నా బరువును కట్టటం వల్ల కళ్ళలోనికి కమ్మబడి, సౌందర్యం వృద్ధవుతుందనే ఆశయం నెరవేర్చబడింది.

తల ఎముకలు వికృతంగానూ, చిన్నవిగానూ పెరిగేట్లు చేయటమనేది మెలినీషియన్స్‌లో కూడా కనిపిస్తుంది. ఐతే ఎముకలు ఎలా పెరిగినప్పటికీ, లోని మెదడులో భేదమేమీ ఉండదు; వారి తెలివి తేటలు ఒకేమాదిరిగా ఉంటవి.

తల వెంట్రుకల్ని పెంచటమే సౌందర్యారాధనగా దాదాపు ప్రపంచమంతటా పరిగణించ బడులోంది. బుర్ర గొరిగించటమనేది, ఏదో వొక నేరానికి శిక్షగా, అవమానించేందుకు చిహ్నంగా వుంటోంది. ఐతే బుర్రలో కొంత భాగాన్ని గొరికించటమనేది సౌందర్యారాధనగా చలామణీ అవుతోంది.

శిరోజాలను పొడవుగా పెంచి, జడ వేయటం తూర్పుదేశాల ఆచారంగా వుంది. ఇక పశ్చిమ దేశాల్లోని స్త్రీలు కొద్ది వెంట్రుకల్ని సరిసమానంగా ఉండేట్లు కత్తిరించుకోవటం రివాజు. వెంట్రుకల్ని ఉంగరాలుగా చుట్టించుకోవటం, రకరకాలుగానూ తిప్పించుకోవటం, నాగరికతారాధనగా నేడు చలామణీ అవుతోంది. స్త్రీ శిరోజాలకు మెరుగులు దిద్దేందుకు గొప్ప నిపుణులు కూడా తయారయ్యారు. మరీ సినీమాల్లోని మేకప్పులు చూస్తే వీరి ప్రావీణ్యం అర్థం గాక పోదు.

ఇక చేతుల విషయంలో - చేతులకు గాజులు కంకణాలు ధరించటాన్ని స్త్రీ కలకాలంగా చేస్తూనే వుంది. ముఖ్యంగా చేతి గోళ్ళకు రంగువేయటం, లేదా గోరింటాకుతో ఎర్రగా అయేట్లు చేయటం కద్దు. ఐశ్వర్యవంతులైన స్త్రీలు చేతి గోళ్లను కొన్ని అంగుళాల వరకూ పెంచే ఆచారం వుంది. తాము సామాన్యులు కాదని యీ గోళ్ల ఆకారమే చెపుతుంది! చేతిగోళ్ళు చాలా పెద్దవిగా పెరగటం వల్ల, వారిచేతులు సాధారణ పనిపాటలకు నిరుపయోగం. ఇదేవిధంగా చైనా స్త్రీ సిగ్గు ఆమె పాదాల్లో దాచుకుంది. తన పాదాన్ని ఆమె ఏ పరిస్థితిలోనూ, పురుషుని కంట పడనీదు. పాదం ఎంత చిన్నదైతే అంత అందగత్తెగా భావించ బడుతుంది. అందుకని చిన్నతనం నుంచీ, పాదం పెరగకుండా, చాలా బిగుతైన బూట్స్‌తో బంధించ బడుతుంది. యీ పూర్వాచారాన్ని నేటి ప్రభుత్వం నిషేధించింది.

బంగారాన్ని కొనేస్థితి అందరికీ ఉండదు. అలాటివారు రాగితోనూ, ఇత్తడితోనూ

చేయబడిన ఆభరణాల్ని' ధరిస్తున్నారు. ఇప్పుడు బంగారు పూతపూసిన ఆభరణాలు విరివిగా అమ్ముడవుతూన్నవి. తక్కువజాతి లోహాల్ని, ముఠుగులకూ, గాజులకు, కాళ్ళ కడియాలు గానూ, పెద్ద పెద్ద చెవి కమ్మలకూ, కంఠాభరణాలకూ ఉపయోగిస్తున్నారు. చెవికి బరువెక్కువయి, చెవి విపరీతంగా కిందికి సాగటం కూడా సామాన్యంగా జరుగుతూంటుంది. ఉత్తర బర్మాలోని కెరెన్ తెగ స్త్రీలు మెడకు చాలా బరువైన వలయాకారపు ఇత్తడి ఆభరణాల్ని ఎక్కువగా ధరించటం వల్ల, వారి మెడ కండరాలు నిరుపయోగా'లవటం సామాన్య విషయం.

బెల్జియన్ కాంగో ప్రాంతంలోని స్త్రీలు చాలా బరువైన కంఠాభరణాన్ని, దాదాపు 30 పౌన్ల బరువుండే దాన్ని అలంకారానికి గాను ధరిస్తారు. ఇది ఎప్పుడో కాకుండా, నిత్యా గుదిబండ వలె, మెడలో వేళ్ళాడుతుండ వలసిందే! దీన్ని తియ్యాలంటే కమ్మరి రావల్సిందే! ఇలాటి కంఠాభరణం, ఒకోసారి సమాజంలో, ఆడపిల్ల రజస్వలైనందుకు చిహ్నంగా ధరించటం కూడా కద్దు.

పెదవుల అందానికి 'లిప్‌స్టిక్' పూసుకోవటం నవనాగరికతా స్త్రీలు అనుసరిస్తూన్న పద్ధతి. ఇండియన్లు తమలపాకులు వేసుకోవటం ద్వారా, పెదవుల్ని ఎర్ర బరుస్తున్నారు. పోతే అనాగరికజాతుల వారు, పెదవులు కూడా కామసంచలనాన్ని కలిగించే శరీర భాగాలుగా గుర్తించి, వాటికి కూడా అలంకరణల్ని తయారు చేశారు. ముందు రెండు దంతాలనూ ఊడబెరికి, పెదవిగుండా రంధ్రం చేసి, ఏ శిలతోనో తయారు చేయబడిన చిన్న ఆభరణాన్ని ధరింప చేసేవారు. ఆఫ్రికాలోని ఛాడ్ సరస్సు ప్రాంతంలోని స్త్రీలు కొయ్యతో చేయబడిన ఆభరణాన్ని పెదవుల ఆకర్షణకుగాను ఉపయోగించేవారు. క్రమంగా యీ ఆభరణాల వల్ల పెదవులు విపరీతంగా సాగిపోయి, వికృతాకారాలు తయారవటం వల్ల క్రమంగా యీ ఆచారం విడనాడ బడింది.

ఇక మనదేశంలోని శిల్ప కళ చూస్తే పూర్వీకులు ఎంతగా ఆభరణాలంటే చెవి కోసుకునేవారో తెలుస్తుంది. యీనాడు ఆ ఆభరణాలు చాలా మోటుగా కనిపించినప్పటికీ, యీనాటి నాజూకు తనానికి అవే పునాదిరాళ్లు.

ఆనాటి 'కంటె'కు ప్రతి రూపమే, యీనాటి గొలుసు. ఆనాటి చెవి కమ్మలకు ప్రతిరూపాలే, లోలాకులూ, జూకాలూను. నాగరాలకు ప్రతిరూపాలే, జడపిన్నులు. ముక్కు పుడకలురూపుమారినా, పూర్వం నుంచీ ఉన్నవే. వడ్డాణ్ణాలు, నడుంకు బిగించటం యీనాడు కనిపిస్తూనే వుంది. చెంప స్వరాలు క్రమంగా పోయి, తిరిగి సినిమా నటీ మణుల దగ్గిర్నుంచీ ధరించటం జరుగుతూనే వుంది. ఒకరు, అందునా, నాగరికతను నడిపేవారుగా ఉన్నవారు ఏది మొదలెడితే, అదే ఫ్యాషనుగా చలామణీ అవుతోంది. ఉదాహరణకు విదారేళ్ళక్రితం, జాకెట్లకు చేతులు బాహుమూలాలవరకూ వెళ్ళి, తిరిగి ఇప్పుడు మోచేతుల కిందిదాకా దిగినవి!

ఆభరణాలంటే చెవికోసుకోవటం స్త్రీకి సహజం! ఆమె మనస్సును జయించేందుకు పురుషుడు మొదటినుంచీ ఆభరణాన్ని ఎరగా ఉపయోగిస్తూ నేవున్నాడు. ముసలివాడు, పడుచుదాన్ని పెళ్ళిచేసుకు నేందుకు ఆభరణాదులే కారణంకదా! సౌందర్యారాధన, ముఖ్యంగా లైంగిక ఆకర్షణ పెంపొందేందుకు ఆభరణాల పట్ల స్త్రీలు ఆనాడూ, యీనాడు కూడా ఎక్కువ మక్కువను చూపుతూనే ఉన్నారు.

అజంతా, ఎల్లోరా శిల్పాలనుచూసిన వారికి, ఆనాటి స్త్రీ సౌందర్యమూ, అలంకరణల విశిష్టతా అర్థమౌతుంది. స్త్రీ శరీరంలోని అన్నిభాగాలూ, ఏదో వొక అలంకరణకు గురయినవే! ఏదేవాలయం మీది చెక్కడాలు చూసినా ఆభరణాలు విలువ, కళకు ఎంత దోహదమైందో తెలియక పోదు.

కొంతమంది పరిశోధకులు యీ ఆభరణాదులు కేవలం లైంగిక ఆకర్షణకే కాకుండా, పురుషుడు స్త్రీని బానిసగా


విడుదలయింది.

# భామా కలాపం

(డిటెక్టీవ్ నవల)

రచన: దాసు

గతంలో ఆమె శీలం పవిత్రమైనది! అగ్నివంటిది ఆమె!
ఆమె సౌందర్యవతి కూడాను. ఐతే, ఆ సంగతి ఎన్నాళ్ళకో గాని
అదీ, ఒకడు తనను రెచ్చగొట్టాక కాని—ఆమెకు తెలీదు!
తెలిసాక, ఆసుందరి వన్నెలాడి ఐపోయింది!
ఆమె అందం పదిమంది చేతా పరీక్షింపబడింది!
'నిన్ను ప్రేమించాను, నన్ను పెళ్ళాడు!' అన్నాడతడు.
'నేను భార్యగాపనికిరాను,నన్ను ప్రేయసిగా నేవుంచు'అన్నదామె.
అతడు అర్థం చేసుకోలేక పోయాడు. ఫలితం...?

వెల 8 అణాలు మాత్రమే!

'సినీతార దుర్మరణం' రచయిత కలంనుండి వెలువడ్డ మరో విశిష్ట రచన ఇది!

జ్యోతి కార్యాలయం, మద్రాసు_17.

చేసుకునే నిమిత్తం కానుకలుగా ఇచ్చే అంచమనీ, ఒకవిధంగా ఆమె విశ్వాసంతో పడివుండే ఉద్దేశం వెనుక దాగివున్నదనీ అంటున్నారు. నిత్యజీవితంలో ఆభరణాదుల్తో స్త్రీలను కట్టివేసుకోవటం మనం చూస్తూనే వున్నాం.


మరి కొంతమంది పరిశోధకులు ఆభరణాలు స్త్రీకి అతి సున్నితమైన, బలమైన బంగారు సంకెళ్ళే నన్నారు. సంకెళ్ళ ఉపయోగం, ఆమె తప్పించుకొని పోకుండా ఉండటమే కాదు; అలాటి ప్రయత్నం జరుగుతే తెలుసుకొనే అవకాశమూ వుంటుంది. ఉదాహరణకు ఏ అర్థరాత్రి పూటో, నిజభర్తను విడనాడి, ఏ ప్రియునితోనో గడిపేందుకు ఆడది కదిలి వెళ్ళే పక్షంలో, యీ ఆభరణాలు తప్పకుండా ప్రతిబంధకాలే అవుతవి. గాజులు గల్లుమని, కాళ్ళ అందెలు చప్పుడుకాక తప్పదు. అప్పుడు భర్త నిద్రలేచి దేహశుద్ధి చేసినా చేయవొచ్చు. పురుషుడు యీ వుద్దేశ్యంతోనే వొదులుగా ఉండే ఆభరణాల్ని స్త్రీలకు ఇచ్చాడనే నింద వున్నమాట నిజమే కాని, యీ వ్యాసానికి అది అప్రస్తుతం కనుక, ఇంతతో వొదిలేద్దాం.

యీ ఆభరణాలు ఒకో జాతికి ఒకో రకంగా ఉన్నవి. లంబాడీలను చూస్తే, ఎంత మోటుతనమో అని మనకు అనిపిస్తుంది కాని, అనే వారికి అందంగా చలామణీ అవుతోంది.

ఇక దుస్తుల్లో వొచ్చిన మార్పుల్ని గూర్చి రాయాలంటే భారత మంత అవుతుంది. నేడు ఎంత పలచటి గుడ్డలు దిగుమతి అవుతూన్నవో, లోన వేసే లంగా కనిపించేట్లుగా చీరెల్ని కట్టటందగ్గిర్నుంచీ, లంగా చివర్లో అల్లికలు వేసి స్పష్టంగా ఆకర్షణకుగాను ఉపయోగించటం వరకూ మనం చూస్తూనే వున్నాం. జాకెట్ల మీద చిన్న అద్దాలు బిగించటం, రకరకాలుగానూ, చిన్న చిన్న కిటికీలు అమర్చిన జాకెట్లను కుట్టటం మొదలూ, రొమ్ము భాగానికి ప్రాధాన్యతనిస్తూ తయారుచేసే జాకెట్ల వరకూ నిత్యం మనం చూస్తూనే వున్నాం. యీ అవస్థలన్నీ స్త్రీ పురుషుణ్ని ఆకర్షించేందుకేనని మనం మరిచిపోకూడదు.

వస్త్రధారణలోనూ, ఆభరణాల్లోనూ కొద్ది కొద్ది మార్పులు వొచ్చినా వస్తురూపం మారవొచ్చు కాని, దాని గుణగణాలూ, ఆశయాలూ పూర్వమేమిటో, ఇప్పుడూ అవే! యీ మార్పులు ఎంత కాలం సాగినా, స్త్రీ ప్రకృతి సిద్ధంగా ఆకర్షించవలసిన బాధ్యతను కలిగివున్నది కనుక, తన విధిని నిర్వర్తించేందుకు ఎప్పటి కప్పుడు కొత్త కొత్త పద్ధతుల్ని ప్రవేశపెడుతూనే వుంది!





# పరాజిత

రచన
పి. సూర్యారావు

ప్రపంచంలో సౌందర్యానికిగల ఆకర్షణ దేనికీ లేదు. ఐశ్వర్యం కంటే అందమే గొప్పది. యిది ఒకప్పటి రాజేశ్వరి అభిప్రాయం. యథార్థ ప్రపంచంలో అడుగుపెట్టేసరికి ఆమె అభిప్రాయం తలక్రిందు లయింది. ఆమె ప్రేమించిన యువకుడొకడు ఆమెను మోసగించి డబ్బు కల మరో యువతిని వివాహం చేసుకున్నాడు. భవిష్య జీవితంలో ఆనందాన్ని అనుభవించ వచ్చునని ఆమె ఇంతకాలం నుంచీ కనిన కలలు చెదిరిపోయాయి. తన కోరికలు తీర్చలేని, తనను సుఖపెట్టలేని ఒక నిర్భాగ్యుణ్ణి ఆమె పెళ్ళి చేసుకో వలిసి వచ్చింది. దానితో ఆమె మైకం పూర్తిగా వదిలిపోయింది. యీ ప్రపంచంలో డబ్బుకు యింతటి మహత్తర శక్తి వుందా అని ఆమె ఆశ్చర్య పోయింది.

డబ్బులేని వాడికి వైరాగ్యం యిట్టే వస్తుంది. నిజానికి రావాలికూడా. 'మంచి పిక్చరు వచ్చింది. వెడదామండీ.' అని రాజేశ్వరి అన్నప్పుడు 'ఛ! ఎందుకొచ్చిన సినిమాలు. డబ్బు దండుగ. వాటి నుంచి తెలుసుకునేదేం వుంటుంది...!' అనే వాడు నారాయణ.

మొదటిలో కష్టంగా వున్నా రాను రాను యీ పరిస్థితులకు ఆమె అలవాటు పడి పోయింది. ఆ సమయంలో ఆమెకు లక్ష్మితో పరిచయం కలిగింది. లక్ష్మి అమ్మగారు బాగా డబ్బుకలవాళ్లు. ఆమె భర్తకూడా నెలకో రెండువందలు సంపాదిస్తాడు. ఆ దంపతులకు రెండేళ్ల కొడుకు మాత్రం వున్నాడు. ఏ విచారం లేకుండా జీవితాలను హాయిగా సాగిస్తున్నారు వాళ్లు. లక్ష్మికి తనకు మధ్య పెద్ద అఖాతం వుందన్న సంగతి రాజేశ్వరికి తెలుసు. లక్ష్మి అనుభవించే ఆనందమయమైన జీవితానికి కనుమూపు మేరలో నిలుచుండ వలసిందే తను. అందుకే రాజేశ్వరి లక్ష్మికి సన్నిహితంగా రాకుండా కొంత

కాలం గడిపింది. కాని యీ పరిస్థితి ఎంతో కాలం కొనసాగ లేదు.

తొలి పరిచయంలోనే లక్ష్మి చాలా మంచిదని తెలుసుకుంది రాజేశ్వరి. ఆ తరవాత ఆమెతో మాట్లాడ్డానికి, ఆమె యింటికి వెళ్లి కాలం గడపడానికి రాజేశ్వరి వెనుకాడ లేదు. అచిరకాలంలోనే వాళ్లిద్దరికీ స్నేహం ఏర్పడింది—లక్ష్మి యిల్లు విలువైన వస్తువులతో, చక్కని అలంకరణలతో కల కల లాడుతూ వుంటుంది. తన యిల్లు మాత్రం కాంతి విహీనంగా వెల వెల పోతూ వుంటుంది. ఆమె రోజులో ఎక్కువ సమయం లక్ష్మి యింట్లోనే గడుపుతూ వుండేది. రేడియో వేసుకొని పాటలు వింటూ కుర్రాడితో ఆడుకుంటూ వుండే వారు. బీచికి, సినిమాలకు వెళ్ళే వారు. తనకు తెలియకుండానే విలాస జీవితం వైపు నడవ సాగింది రాజేశ్వరి. యీ విషయాన్ని మొదట కనిపెట్టినవాడు ఆమె భర్త. అయినా ఆమెకు ఎదురు చెప్పడానికి అతను సాహసించ లేదు.

తన సరదాల కోసం లక్ష్మి చేత డబ్బు ఖర్చు పెట్టించడం రాజేశ్వరికి లోలోపల కష్టంగా వుండేది. లక్ష్మికి మాత్రం అటువంటి విచక్షణ ఏమీ వున్నట్లు కనిపించదు. లక్ష్మి భర్త చలం చాలా మంచి వాడు. అతను ఆమె యిష్టానికి వ్యతిరేకంగా నడవడు. లక్ష్మి ఎంత డబ్బు ఖర్చు పెట్టినా అతనేం చిరాకు పడడు. భార్య స్వాతంత్ర్యానికి అడ్డురాని అటువంటి మగ వాళ్ళంటేనే రాజేశ్వరికి యిష్టం. భర్తయినా భార్య అయినా, ఎవరి వ్యక్తిత్వం వాళ్ళది. ఒకరి అభిప్రాయాలమీద ఒకరు దాడి చెయ్యకూడదని ఆమె ఉద్దేశం. మొత్తానికి రాజేశ్వరికి నచ్చిన సుగుణాలు చలంలో చాలా వున్నాయి. అటువంటి భర్త దొరకడం నిజంగా లక్ష్మి అదృష్టం.

నిష్పాక్షికంగా చెప్పాలంటే లక్ష్మి చలానికి తగిన భార్య కాదు. చలం సన్నంగా, పొడవుగా, అందంగా వుంటాడు. అతని కళ్ళు ఎప్పుడూ దేనినో అన్వేషిస్తున్నట్లు కొంటెగా చూపులను విసురుతూ వుంటాయి. అతని ముఖంలో ఉత్సాహం తొణికిస లాడుతూ వుంటుంది. అతని కంఠ స్వరంలో ఆకర్షణ వుంది. లక్ష్మి ముఖంలో ఆకర్షణ చాలా తక్కువ. ఆమె కళ్లు చిన్నవి. ఒక కాన్పుకే ఆమెలో యౌవనం సడలి పోయిన చిహ్నాలు కనిపించ సాగినై. రూపం చక్కనిది కాక పోయినా ఆమె మనసు మంచిది. సాధారణంగా భార్యాభర్తలు యిద్దరూ అందమైన వాళ్లై వుండరు. ఉదాహరణ కోసం ఎక్కడికో దూరంగా వెళ్ళడం దేనికి? తన భర్త తనకు తగిన వాడేనా? యీ ప్రశ్నకు తనలో తాను నవ్వుకుంది రాజేశ్వరి.

చలం రోజంతా వూళ్లో తిరుగుతూ వుంటాడు. ఏ రాత్రి 10 గంటలకో యిల్లు చేరుకుంటాడు. ఒకో రాత్రి రాడు కూడా. అయినా లక్ష్మి అతనిని మందలించినట్లు కనిపించదు. అదే తనైతే చెవి మెలేసి యింట్లో కూర్చోబెట్టేది. యింత కాలం నుంచీ తను లక్ష్మితో స్నేహంగా వున్నా తనకు చలం కనిపించిన సమయాలను వేళ్ళపై లెఖ్ఖించ వచ్చు. సాధారణంగా మగ వాళ్ళలో ఎక్కువ మంది తనకేసి రెప్ప వెయ్యకుండా

చూస్తూ వుండడం రాజేశ్వరి చాలా సార్లు కనిపెట్టింది. కాని చలం మాత్రం ఆమెకేసి నిర్లక్ష్యంగా చూసి తిరిగి తన పనిలో నిమగ్నమయ్యేవాడు. అతను సౌందర్యారాధకుడు కాక పోయి అయినా వుండాలి, లేదా గర్విష్టి అయినా అయి వుండాలి అనుకొంది రాజేశ్వరి.

రాజేశ్వరి జీవితంలో అన్నీ పరాజయాలే! ఆమె మనసారా ప్రేమించిన యువకుడు మోసగించాడు. సరదాలను తీర్చగల ధనవంతుడైన భర్త దొరకలేదు. పోనీ దొరికిన భర్తయినా అందగాడా అంటే అదీ కాదు. అతనితో కలిసి ఎక్కడికి వెళ్ళడానికీ ఆమె యిష్టపడేది కాదు. యింట్లోనే వుండి పోయిగా కాలం గడపడానికి రేడియో లేదు. సినిమాలకు, నాటకాలకు వెళ్లాలంటే డబ్బు లేదు. చివరకు కట్టుకోడానికి తనకు తగిన చీరలైనా లేవు. ఆమెలోని నిస్పృహను, విషాదాన్ని లక్ష్మి స్నేహం చాలా వరకూ దూరం చేసింది.

లక్ష్మి మాట కాదనలేక రాజేశ్వరి ఆమెతో ఆ రోజు సినిమాకు వెళ్ళడానికి ఒప్పుకొంది. కాని కట్టుకోడానికి సరైన చీర ఆ సమయానికి లేదు. ఈ విషయాన్ని లక్ష్మి గ్రహించింది.

'నా దగ్గర సందేహిస్తావెందుకు రాజేశ్వరి! మనం యిద్దరం యింత కాలం నుంచీ కలసి మెలసివున్నా నువ్వు నన్ను అర్థం చేసుకున్నట్లు కనిపించదు.'

లక్ష్మి తన చీరలలో మంచి సిల్కు చీర ఒకటి తీసి రాజేశ్వరికి యిచ్చింది. రాజేశ్వరి వద్దని ఎంత చెప్పినా లక్ష్మి అంగీకరించ లేదు. పైగా తన నెక్లేసు కూడా ఆమెకు యిచ్చింది.

'యీ రోజు నిన్ను చూసి అందరూ ఆశ్చర్య పోవాలి. నువ్వు ముస్తాబవుతూ వుండు. యీ లోగా నేను స్నానం చేసి వస్తాను.' ఆమె జవాబుకు ఎదురు చూడకుండా లక్ష్మి బాత్‌రూమ్ వైపు వెళ్ళి పోయింది.

రాజేశ్వరి చీరను పరిశీలనగా చూసింది. దాని ఖరీదు కనీసం వంద రూపాయలైనా వుంటుంది. అటువంటి చీర తనకు ఒకటి వుంటే ఎంత బాగుంటుంది? చీర కట్టుకొని అద్దంలో చూసుకొంది, నెక్లేసు వేసుకొంది. యీసారి తనరూపం తనకే వింతగా కనిపిస్తోంది. యీనూతనాలంకరణ తనలో దాగివున్న సౌందర్యాన్ని పైకితీసుకువచ్చినట్లు కనిపిస్తోంది. యీ సమయంలో గది బయట తనకు చిరపరచితమైన బూటు చప్పుడు వినిపించింది. చలం ఆకస్మికంగా గదిలో ప్రవేశించాడు.

'ఎక్కడికి లక్ష్మి ప్రయాణం?' అంటూ అతను ఆమె రెండు భుజాలను పట్టుకొని ఆమెను తన వైపు తిప్పుకున్నాడు. ఆమె ముఖం చూడగానే అతను ఎలక్ట్రిక్ షాక్ తగిలినవాడిలా 'సారీ! పొరబాటు' అని రెప్పపాటు కాలంలో గదిలోంచి బయటకు వెళ్ళి పోయాడు చలం...

ఏమిటిది?... ఆమె యింకా ఆశ్చర్యాన్నుంచి తేరుకోక ముందే 'ఏం? యింకా నువ్వు తయారు కాలేదా?' అంటూ లక్ష్మి గదిలో అడుగు పెట్టింది.

ఆమె తడబడుతూ 'ఆఁ. అయిపోయింది. యిక నా ఆలస్యం లేదు.' అన్నది.

'అయితే వేగం వెళ్ళి మీ ఆయనకు చెప్పిరా! పోదాం!' అంది లక్ష్మి.

తన గదిలో అడుగు పెడుతున్న రాజేశ్వరికేసి ఆమె భర్త 'అవునా? కాదా?' అన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు.

'లక్ష్మితో పిక్చరుకు వెడుతున్నానండి!' అంది ఆమె.

'యీ వేషం యేమిటి?' అన్నాడు నారాయణ.

'ఏం లేదు. నా చీరలు లేవంటే లక్ష్మి బలవంతంగా తన చీర యిచ్చింది.'

'సరే! అయితే వెళ్లు!' అన్నాడు నారాయణ.

థియేటరు జనంతో నిండి పోయింది. లైట్లు ఆరిపోయినై. సినిమా ప్రారంభమయింది. రాజేశ్వరి ఏకాగ్రతతో చిత్రాన్ని చూడలేక పోతోంది. ఆమె మస్తిష్కంలో రకరకాల ఆలోచనలు పరుగు లెత్తుతున్నై. చలం తనను తెలిసి పట్టుకున్నాడా? తెలియక పట్టుకున్నాడా? లక్ష్మి చీర తను కట్టుకున్నందువల్ల ఆ మసక వెలుతురులో తనను గుర్తించలేక పోయాడా? తెలియక పొరబాటున తనమీద అతను చెయ్యి వేశాడన్న ఆలోచన ఆమెకు సంతృప్తికరంగా లేదు. తను లక్ష్మి కంటే పుష్టిగా, పొడవుగా వుంటుంది. చూపు సరిగా అనుతున్న ప్రతి వాడికీ యీ విభేదం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే చలం ఎటువంటి మనిషి? తనను ఐచ్ఛికంగానే అతను తాకి వుండాలి. ఆ స్పర్శకు తనలో విద్యుత్తు ప్రవహించింది. కాని తను అతని కళ్ళల్లోకి చూసిన వెంటనే అతను వణికాడెందుకు? నిజంగా పొరబాటుగానే అతను అట్లా ప్రవర్తించాడేమో! పొరబాటుగానే అలా జరిగితే మరేం ప్రమాదం లేదు. అతనే కాని ఆ సమయంలో మరి కొంత సాహసించి తన నేమైనా చేస్తే, ఆ పరిస్థితిలో తనులొంగి పోవలిసి వుండేది. అతను నిగ్రహంతో అలా పోవడం చాలా మంచిదే అయింది. లేక పోతే లక్ష్మి వంటి స్నేహితురాలికి ద్రోహం చేసినందుకు తను శాశ్వతంగా దుఃఖించవలసి వచ్చేది. ఈ సంఘటనను యిక మరిచి పోవాలని ఎంత ప్రయత్నించినా ఆమె మరిచి పోలేక పోతోంది. ఆ స్పర్శ ఆమెలో నిద్రాణమైవున్న తీయని అనుభూతులను మేల్కొలిపింది. చాలా కాలం క్రితం తను ప్రేమించిన యువకుడు తనను తొలిసారిగా స్పర్శించినప్పుడు యిటువంటి అనుభూతి కలిగింది. నేటి సంఘటనతో ఆమెతిరిగి నవయవ్వన ప్రాంగణంలో అడుగుపెట్టినట్లు తలచింది.

రోజులు దొర్లి పోతున్నాయి. రాజేశ్వరికి లక్ష్మితో స్నేహం మరింత గాఢమయింది. ఆమె యెప్పుడూ లక్ష్మి యింట్లో వుండడానికే ప్రయత్నిస్తోంది. పట్నాలలో ఒకే యింట్లో నివసించే స్త్రీలు స్నేహంగా వుండడం సహజం అనుకున్నాడు నారాయణ. పగలంతా ఇక్కడ వుండడమే కాక రాత్రి పది గంటల వరకూ కూడా రాజేశ్వరి లక్ష్మి యింట్లో వుండడం నారాయణకు కొంచెం కష్టంగానే వుంది. అయినా అతను పైకి ఏమీ అనలేక పోయాడు.

ఈ సంఘటన జరిగిన తరవాత చలం చూపులలో మార్పు కనిపించింది రాజేశ్వరికి. 'మన యిద్దరి మధ్యా లోతైన రహస్యం ఒకటి దాగివుంది సుమీ' అని ఆమెను హెచ్చరిస్తున్నట్లుండేవి అతని చూపులు. ఆ చూపులకు తోడు అతని పెదవులపై చిరునవ్వు కూడా కనిపిస్తూ

వుండేది. లక్ష్మి పెరడులో వున్నప్పుడు అతను తన సమీపానికి ఏదో నెపంతో రావడానికి వెనుకాడేవాడు కాదు. తను ఆ రోజే లక్ష్మితో జరిగిన సంఘటన చెప్పి వుంటే యితను యింత చెలరేగి వుండేవాడు కాదు-అనుకొంది రాజేశ్వరి. ఒకవేళ తనకు తెలియకుండా తన మనసు కూడా అటువైపు లాగుతోందా? అని సందేహించింది. ఏది ఏమైనా లక్ష్మితో తన స్నేహం ముఖ్యం. అది చెడిపోకూడదు.

ఒకనాడు లక్ష్మి ఆకస్మికంగా పుట్టింటికి వెళ్ళవలిసి వచ్చింది. ఆమె రాజేశ్వరికి అన్నీ అప్పగింతలు పెట్టింది. చలానికి ఏమైనా అవసరమయితే పని మనిషితో పంపిస్తూ వుండమని, వారం రోజులలో తిరిగి వస్తానని చెప్పి లక్ష్మి బండి యెక్కింది.

లక్ష్మి వెళ్ళిన తరవాత రాజేశ్వరికి అసలు కాలక్షేపం అవడం లేదు. ఒంటరిగా కూర్చోవలిసి వస్తోంది. కొంతసేపు చదువుకుంటోంది. కొంతసేపు యింటి పనులు చూసుకుంటోంది. ఎంత ప్రయత్నించినా కాలం గడవడం లేదు. యిదివరకు లక్ష్మి యింటికి వెడుతుంటే చలం కనిపిస్తూ వుండేవాడు. యీసారి అతనిని చూడడానికికూడా అవకాశం లేదు. వాళ్ల పని మనిషితో మాత్రం నీళ్లుకాచి పంపిస్తోంది. అతని ముఖం యీ రెండు రోజుల నుంచీ ఒకసారైనా చూడలేదు. ఏం? చూడకపోతే కొంప మునిగిపోయిం దేమిటి? అతని గురించి అసలు వూహించనే కూడదు-అని నిశ్చయించుకొంది రాజేశ్వరి. ఆ సాయంత్రం భర్త ఆఫీసు నుంచి రాగానే 'ఏం తోచడం లేదండి. యివేళ ఏదైనా పిక్చరుకు వెడదాం.' అంది.

చాలా కాలానికి ఆమె తనను కోరిన కోరిక తీర్చకపోతే బాగా వుండదనుకున్నాడో ఏమో, అతను ప్రయాణమయ్యాడు. భర్తతో కలిసి సినిమా చూడడానికి అయిష్టపడుతూనే ఆమె అతని ప్రక్కను కూర్చుంది. మూడు గంటలైనా హాయిగా గడపవొచ్చు అనుకొంది. కొత్తగా విడుదలైన చిత్రమేమో హాలు నిండా జనం క్రిక్కిరిసి వున్నారు. తమ వెనుకవరుసలో కొందరు బాక్సులలో కూర్చుని వున్నారు. వాళ్లకేసి చూసింది రాజేశ్వరి. చక్కగా అలంకరించుకున్న స్త్రీలు తమ భర్తల ప్రక్కను కూర్చుని వున్నారు. వాళ్లెంత అదృష్టవంతులు! ఆమె చూపులు చివరను కూర్చున్న యిద్దరు స్త్రీపురుషులమీద వాలి అక్కడే ఆగిపోయినై. పొరబాటేమో అనుకొని ఆమె మరింత పరిశీలనగా చూసింది. ఎమీ సందేహం లేదు. అతను చలం! ఆ ప్రక్కనున్న ఆమె ఎవరు? భార్యను పుట్టింటికి పంపించి అతను యిక్కడ 'నాటకం'ఆడుతున్నాడా? యింతకాలం నుంచీ అతను ఎంతో బుద్ధిమంతుడనుకుంటోంది. లక్ష్మి దగ్గర వినయ విధేయతలతో ఎంత అమాయకునివలె ప్రవర్తిస్తాడు! అంతా నటనేనా? లైట్లు ఆరిపోయినై. పిక్చరు ప్రారంభమయింది.

ఆ మర్నాడు రాజేశ్వరి పని మనిషినడిగింది. 'ఏమే! అయ్యగారు రోజూ సరిగా యింటికి వస్తున్నారా?' అని.

'దీపాలు పెట్టిన తరవాత అసలు యిల్లు కనలడమ్మా!' అంది అది ఎంతో తెలిసిన దానిలా.

'ఊహూ! అలాగేం? పోనీ పగలైనా యిల్లు కదులు తారా?' అంది హేళనగా.

'పది దాటాక యింట్లో వుండరమ్మా!'

'యిప్పుడు యింట్లో లేరా?'

'లేరండి. ఆఫీసుకు వెళ్ళి పోయారు.' ఒక క్షణం ఆగి 'అయ్యగారు మీ గురించి అడిగేరండి.' అంది అతి సామాన్యమైన విషయంలా.

'ఏమడిగారు?' అంది ఆత్రుతగా రాజేశ్వరి. 'నేను లేనప్పుడు ఆవిడ యెప్పుడైనా యిక్కడకు వస్తారా?' అని అడిగేరండి.'

'నువ్వేం చెప్పావు?'

'అసలు రానే రారని చెప్పానండి.'

'అబద్ధం ఎందుకు చెప్పావు? నేను రోజుకోసారి వచ్చి చూడడం లేదూ?' అంది కోపాన్ని నటిస్తూ రాజేశ్వరి.

'అవుననుకోండి. అయినా ఆడవాళ్ళ గొడవలన్నీ ఆయనకెందుకు చెప్పండి?' అంది పని మనిషి.

'నువ్వు భలే మనిషివే!' ప్రశంసించింది రాజేశ్వరి.

యిద్దరూ మాట్లాడుతూ లక్ష్మి యింట్లో ప్రవేశించారు.

'యిక నేను వెళతానమ్మా!' అంది పని మనిషి.

'సరే! వెళ్లు! సాయంత్రం వేగంరా!' అని ఆమెను వెళ్ళనిచ్చి తలుపు గడియ వేసింది. రేడియో వేసి సోఫాలో పడుకొంది. రేడియో శ్రావ్యంగా పాడుతోంది. ఈ యింటిలో వాతావరణం ఎంత హాయిగా ప్రశాంతంగా వుంటుంది! తిన్నగా నిలువుటద్దంలో తన ప్రతిబింబం కనిపిస్తోంది. పడుకునివున్న తన శరీరపు వంపులు శిల్పి చెక్కిన శిల్పంలా తనకే వింతగా కనిపిస్తున్నై. ఆమె మనసు తేలిక అయింది. మధురమైన సంగీత తరంగాలు ఆమెను 'జో' కొడుతున్నాయి. కను రెప్పలు బరువుగా మూత పడుతున్నాయి. నిలువుటద్దంలో మసకగా ఆమెకు మరో రూపం కనిపించింది. కళ్లు తెరిచే ఆమె కలకంటున్నది. లేక పోతే అన్ని తలుపులు మూసివున్న ఈ యింట్లోకి ఎవరు రాగలరు? అద్దంలోని మగ రూపం కదిలింది. ఆమె ముంగురులపై చలిస్తున్న వేళ్ళు వాలినై. ఆమె ఉలికిపడి ముఖం పైకెత్తిచూసింది. చలం చిరునవ్వుతో తన ముఖంలోకి చూస్తున్నాడు. ఆమె చివాలున లేచి నుంచుంది. ఆమె శరీరం కంపిస్తోంది.

'మీరుయింట్లోనే వున్నారా! ఆఫీసుకు వెళ్ళి పోయారని చెప్పిందే!' అంది అతని ముఖంలోకి తీక్షణంగా చూస్తూ. ఆమె ముఖంలోని తీక్షణతను చూసి అతను కొంచెం వెనకడుగు వెయ్యవలసి వచ్చింది.

'నేనేఅలా చెప్పమన్నాను.' అన్నాడు చలం.

'అంటే మీ ఉద్దేశం?' కోపంతో ప్రశ్నించింది.

'నా ఉద్దేశం స్ఫటికంలా స్వచ్ఛంగా తెలుస్తూనే వుంది.' అన్నాడు చలం చిరునవ్వుతో.

ఎక్కడో మొండి ఘటంలా వున్నాడనుకొంది రాజేశ్వరి. యిటు వంటప్పుడు మెత్తబడితే తను శాశ్వితంగా దుఃఖించవలసి వస్తుంది.

'నా దగ్గర అటువంటి వ్యవహారాలేం సాగవు. కొంచెం మర్యాదగా ప్రవర్తించండి.' అంది సీరియస్‌గా.

'రాజేశ్వరీ! నువ్వు నమ్ము నమ్మక పో. ఆ రోజున నేను పొరబాటున నీ మీద చెయ్యి వేశాను. నువ్వేం గొడవ చేస్తావో అని చాలా భయపడ్డాను. ఆ రోజు నుంచీ నా మనసు కలిగి పోయింది. నిన్ను వూహించని క్షణం లేదంటే నమ్ము!—యింత కంటే మంచి అవకాశం దొరకదు. కాస్త దయ చూపించు!' ఆమె రెండు చేతులూ తన చేతులలోకి తీసుకుంటూ ప్రార్థేయ పూర్వకంగా అడిగేడు చలం.

యిలాంటి విషయాలలో యితను చాలా ఆరిందాలా కనిపిస్తున్నాడు. కాని తను మాత్రం తీసి పోయిందా యేం? ఆడది మెత్తబడితే మగవాడెలా ప్రవర్తిస్తాడో ఆమెకు తెలుసు.

ఆమె వెంటనే తన చేతులను అతని చేతుల నుంచి వదిలించుకొని 'మీరు యిటువంటిమనుషులని నేనెన్నడూ అనుకోలేదు. లక్ష్మి లేని సమయంలో మీరిలా చెయ్యడం నాకేం నచ్చలేదు. మీలాగా నేనింకా బరి తెగలేదు. నాస్నేహితురాలికి నేను ద్రోహం చెయ్యలేను. తప్పుకోండి. నేను వెళ్ళిపోతాను.' అంది తీక్షణంగా.

అయినా అతనేం చలించ లేదు. దృఢ నిశ్చయంతో యిలా అన్నాడు. 'యింత వరకూ వచ్చిన తరవాత వెనకడుగు వేస్తాననుకోకు. ఏమైనా సరే యీరోజుతో అటో యిటో తేలిపోవలసిందే! నీకోసం ఎంతటి సాహసానికైనా సిద్ధమవుతాను. స్నేహం, ద్రోహం అంటూ ఏవో శుష్క సిద్ధాంతాలను పట్టుకొని వేళ్లాడుతూ యీ సదవకాశాన్ని పాడుచెయ్యకు రాజేశ్వరీ!' ఆమె రెండు భుజాలను తన చేతులతో పట్టుకొని ఆమె ముఖంలోకి చూశాడు చలం. భుజం మీది చేతులను ఉపేక్షిస్తే, అవి ఏం చేస్తాయో ఆమెకు తెలుసు. ఆమె యీసారి మృదువుగా అతని చేతులను తన భుజాలమీది నుంచి తొలగించింది. యిక అతనిని మంచి మాటలతో దారికి తీసుకు రావడం కష్టమని ఆమె గ్రహించింది.

అతని ముఖంలోకి చిరునవ్వుతో చూస్తూ—

'నా కోసం ఎటువంటి సాహసమైనా చేస్తారేం?' అంది.

దానితో అతను తలక్రిందు లయ్యాడు.

'ఆ విషయంలో నీకేమైనా సందేహం వుందా?' తన రెండు చేతులతోను ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు. ఆమె వెంటనే తప్పించుకొంది.

'యిన్నాళ్ళకు మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకోగలిగాను. యిక ఫరవా లేదు. మన యిష్టం.... నేను రాత్రి సరిగా 11 గంటలకు వస్తాను. తలుపు తెరచి వుంచండి.' ఆమె చివాలున అతనిని తప్పించుకొని వెళ్ళి పోయింది.

తన గదిలో కూర్చుని ఒక దీర్ఘనిశ్వాసం విడిచింది రాజేశ్వరి. తను ఎంతటి ప్రమాదం నుంచి తప్పించుకొంది! తనను తన స్వంత చెల్లెలులా చూసుకొనే లక్ష్మికి తను ఎన్నడూ ద్రోహం చెయ్యలేదు.

ఆ రాత్రి సరిగా 11 గంటలకు మధ్య తలుపు పెద్ద చప్పుడుతో తెరవబడడం ఆమెవిని నవ్వుకొంది. పాపం! తెల్లవార్లూ జాగారం చేస్తాడు కాబోలు అనుకుంది. యీ సారి చలానికి తన మీద చాలా

కోపం వస్తుంది. లక్ష్మిలేని యీ సమయంలో అత నేసాహసానికైనా ఒడిగట్టవచ్చు. అయితే తనేం చెయ్యాలి! ఆమె బుర్రలో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది.

'ఏమండీ! రేపు ఉదయం మా అమ్మగారింటికి వెడతాను.' అంది రాజేశ్వరి భర్తతో.

'ఏం? ఎందుకు?' అన్నాడు నారాయణ.

'ఏమీ లేదండీ. మా వాళ్లను చూసి చాలాకాలం అయింది. వెళ్ళి నాలుగు రోజులు వుండి వస్తాను.' అంది.

'సరే! నీ యిష్టం! వెడితే వెళ్లు!'' అన్నాడు నారాయణ.

ఆ రోజు సాయంకాలానికి రాజేశ్వరి అమ్మ గారిల్లు చేరుకొంది. రాజేశ్వరి ఆకస్మికంగా రావడం యింట్లో వాళ్ళెవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. ఆమె ఎప్పుడు వచ్చినా అలాగే వస్తుంది. యీ మధ్య కొంచెం రాకపోకలు తగ్గించింది. కాని యిదివరకు భర్తతో చీటికి మాటికి చిలిపి కజ్జాలు పెట్టుకొని పుట్టింటికి వస్తూ వుండేది. కుశల ప్రశ్నలు, పరామర్శలు అన్నీ అయిన తరవాత స్నానం చేసి కూర్చుంది. ఆమె వచ్చి గంట యింది. యింట్లో వాళ్లంతా కనిపించారు. కాని ఆమె చెల్లెలు మాత్రం కనిపించలేదు.

'యమున కనిపించదేం?' తల్లిని అడిగింది రాజేశ్వరి.

'చదువు కొనడానికి వెళ్ళింది.' అని చెప్పి తల్లి తనపనిలో నిమగ్నమయింది.

అయితే యమున కూడా అచ్యుతం దగ్గరకువెళ్ళి చదువు కుంటోందా? తన చెల్లెలు కూడా తను నడిచిన దారిలోనే నడుస్తోందా? తనలో అప్పుడు వుండే చెడ్డ గుణాలన్నీ యమునకు అలవడుతున్నాయా? అలా జరగడానికి వీల్లేదు. ఆమె కింకా లోకానుభవం లేదు. సాధారణంగా ఆడపిల్లలు యీ వయసులోనే తప్పటడుగులు వేస్తూ వుంటారు.

ఆమెకు దూరాన్నుంచి వస్తున్న యమున కనిపించింది. తను మునుపుచూసినప్పటికీ యిప్పటికీ ఆమెలో బాగా మార్పు కలిగింది. యౌవన శోభ నిండు గర్వంతో ఆమెలో తొణికిసలాడుతోంది.

'ఎంత సేపయిందే అక్కా నువ్వు వచ్చి?' అంది సంతోషంతో యమున.

'గంటయింది. ఎక్కడికి వెళ్ళావు నువ్వు?' తిరిగి ప్రశ్నించింది రాజేశ్వరి.

'చదువు కోడానికి'

'నువ్వు చదువు కుందుకే వెళ్లావా?' సీరియస్‌గా అడిగింది రాజేశ్వరి.

ఆ ప్రశ్న వేసిన తీరుచూసి చకితురాలయింది యమున.

'చదువు కోడానికి అక్కడికీ యిక్కడికీ వెళ్ళడం ఏమీ మంచిదికాదు. నీ అంతట నువ్వు చదువుకో!' అని హెచ్చరించింది రాజేశ్వరి.

తన అక్క వచ్చీ రావడంతోనే తనమీద యీ విధంగా దండయాత్ర ప్రారంభించిందేమిటా అని ఆశ్చర్యపోతూ లోనికి వెళ్ళింది యమున.

రాజేశ్వరి పుట్టింటిలో అప్పటికీ యిప్పటికీ ఏం మార్పు కనిపించ లేదు. దరిద్రదేవత యింకా తాండవ మాడుతూనే వుంది. తన తండ్రి గుమాస్తాగా అహోరాత్రాలు శ్రమ పడుతూనే

వున్నాడు. ఆయన 20 ఏళ్ళ సర్వీసులోను కానీ మిగిల్చిన నెల ఒకటీ లేదు. ఆయన దరిద్రుడైనందువల్లనే కదా తను యిన్ని కష్టాలను అనుభవించ వలిసి వస్తున్నది! ఆయనకే డబ్బు వుంటే తనకు నచ్చిన వరుణ్ని కట్నం యిచ్చికొని పెట్టి వుండేవాడు. యమునకు కూడా మంచి సంబంధం చూసి యీ సరికి వివాహం చేసి వుండేవాడు. తను ఎక్కడికి వెళ్లినా ఏవో సమస్యలు తనను వెన్నాడుతూనే వున్నాయి. ఐతే యిక్కడి సమస్యలు వేరు.

ఆ మర్నాటి సాయంత్రం కూడా యమున చదువుకోడానికి వెళ్లిపోయింది. ఆమె శ్రద్ధగా చదువుకోడానికి వెళ్ళడంలో గల ఆంతర్యం రాజేశ్వరికి తెలుసు. ఆమె కూడా ఒకప్పుడు అలా వెడుతూ వుండేది. పుస్తకంలో ముఖాన్ని దాచుకొని దొంగతనంగా అచ్యుతం చిలిపి కళ్ళలోకి చూస్తూ వుండేది. అతని కళ్ళలోని ఆకర్షణకు ఆమె లొంగిపోయింది. నిత్యం అతనితోనే వుంటూ అతని ఒడిలో తల పెట్టుకొని పడుకోడానికి ఉవ్విళ్ళూరేది. అది నవ యౌవనంలోని తొలి వలపు. అది అలా అనిపిస్తుందేమో! యిప్పుడు తనలో ఆ ఉద్రేకం అంతా చల్లారిపోయింది ... అచ్యుతం ముసలి తల్లి ఎప్పుడూ ఏదో మూలను కూర్చునేది. ఆమెకు తమ విషయం అసలు తెలియదు. తీరా పెళ్ళి సమస్య వచ్చేసరికి కట్నం లేకపోతే వీల్లేదని ఆమె పట్టు పట్టింది. అప్పుడు అచ్యుతమే కనక తల్లికి ఎదురు తిరిగి తనను వివాహం చేసుకొని వుంటే, తన జీవితం మరో దారిని నడిచి వుండేది. కాని అచ్యుతం స్వార్థపరుడు. డబ్బు కాసించి మరో సంబంధం చేసుకున్నాడు.

అప్పుడు అతను అవివాహితుడు గనక తను అతనితో ఆ రోజులలో స్వేచ్ఛగా ప్రవర్తించేది. అతను యిప్పుడు వివాహితుడు. యిది తెలిసికూడా యమున అతనితో స్నేహం చెయ్యడం రాజేశ్వరికి మరింత బాధాకరంగా వుంది. తనలాగే యమున కూడా నడుచుకుంటోందని ఎందుకనుకోవాలి? ఆమె సద్బుద్ధితో కేవలం చదువుకోడానికే వెడుతోందేమో! అయినా తను ఒకసారి పరీక్షించడం మంచిది.

ఆమె తన సందేహం తీర్చుకొనడం కోసం లేచింది. పక్క యింట్లో అడుగు పెట్టింది వసారాలో ఎవరూ లేరు. గదిలోంచి యిద్దరు యువతీ యువకుల నవ్వులు వినిపిస్తున్నయ్. ఆ రెండు కంఠాలు ఆమెకు పరిచితమైనవే. గదితలుపులు తెరచే వున్నాయి. గది ముందు నిలబడింది. ఎలక్ట్రిక్ దీపపు కాంతిలో గది పూర్తిగా కనిపిస్తోంది. ఆ గదిలో ఏం మార్పు లేదు. యమున అచ్యుతం చెరో కుర్చీలోను దూరంగా కూర్చునివున్నారు. మాట్లాడుకుంటూ మధ్య మధ్య ఒకరికేసి ఒకరు చిలిపిగా చూసుకుంటున్నారు. వాళ్ళు తన రాకను గమనించలేదు. వాళ్ల చూపులలోని భావం రాజేశ్వరికి తెలుసు. వాళ్లు కూర్చున్న తీరును బట్టి పరిస్థితి యింకా శ్రుతి మించలేదని తెలుసుకొంది. సరిగా సమయానికి తను పుట్టింటికి వచ్చినందుకు ఆమె సంతోషించింది. ఎలాగైనా విశ్వప్రయత్నం చేసి యమునను యీ ఆపద నుంచి రక్షించాలి... రాజేశ్వరి నిశ్శబ్దంగా అక్కడి నుంచి కదిలి వెళ్లిపోయింది.

ఆమె ఆ రాత్రి దీర్ఘంగా ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చింది. ఆ మర్నాడు సరిగా యమున వెళ్ళే సమయానికే రాజేశ్వరి చక్కగా ముస్తాబై పక్కయింటికి వెళ్ళింది. అడుగుల సవ్వడికి అచ్యుతం తల ఎత్తి చూశాడు. యమునకు బదులు రాజేశ్వరి తిన్నగా నుంచుని వుండడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. రాజేశ్వరి పెళ్ళి అయిన తరవాత తనకు కనిపించడం యిదే మొదటిసారి. రాజేశ్వరి అమ్మగారింటికి వచ్చిందని వినడమే కాని అత నెప్పుడూ చూడలేదు. ఒకే యింట్లో వున్నప్పటికీ ఆమె తనకుకనిపించడం లేదంటే ఆమెకు తనమీద గాఢమైన కోపం ఉండి వుండాలి అనుకునేవాడు అచ్యుతం.

'రాజేశ్వరీ!' అన్నాడు ఆశ్చర్యంతో.

'ఏం? ఆనవాలు తెలియడం లేదా?' అంది హేళనగా.

'చాలా మారిపోయావు రాజేశ్వరీ, మునుపటికంటే బాగా చిక్కిపోయావు. మీ అత్త వారింట్లో నాకు అన్ని సౌకర్యాలు బాగా జరుగుతున్నాయా?'

'దరిద్రులకు సౌకర్యాలు కూడానా? ఆత్మ సంతృప్తే ఒక పెద్ద సౌకర్యం'

'యింత కాలానికి తిరిగి నిన్ను చూడ గలిగినందుకు నాకు చాలా సంతోషంగా వుంది రాజేశ్వరీ!'

'నన్ను చూస్తే నీకు చాలా సంతోషంగా వుంది. కాని నిన్ను చూస్తుంటే నాకు చాలా విచారం కలుగుతోంది.'

'అవును! అది నాకు తెలుసు!'

'తెలిసివుండే కదూ నిర్దాక్షిణ్యంగా నువ్వు నా గొంతు నులిమావు?'

'పొరబాట్లు చెయ్యడం—చేసిన పొరబాట్లకు చింతిస్తూ వుండడం మానవ నైజం - నీకు నేను చాలా ద్రోహం చేశాను రాజేశ్వరీ! పరిస్థితులకు తల వంచి - నిన్ను కాదని - మరొకామెను పెళ్ళి చేసుకొన్నాను. అందుకు తగిన ఫలితాన్ని యిప్పుడు అనుభవిస్తున్నాను.''

'ఏం? ఏం జరిగింది?

'ఆమెకూ నాకూ పడలేదు. ఆమె ఎప్పుడూ అమ్మగారి యింటి దగ్గర. నేను యిక్కడ.'

తనను మోసగించినందుకు యితనికి తగిన శాస్తి జరిగింది అనుకొన్నది రాజేశ్వరి.

'ఆమె నువ్వు తిరిగి కలుసుకునేందుకు అవకాశాలు లేవా?'

'లేవు. మేం యిక శాశ్వతంగా విడిపోయినట్లే!'

తాము విడిపోయినది మొదలు నేటి వరకూ జరిగిన అన్ని విషయాలు వాళ్లిద్దరూ మాట్లాడుకోసాగారు. బాగా రాత్రి అయిన తరవాత రాజేశ్వరి యిల్లు చేరుకుంది.

ఆ రోజు మొదలు రాజేశ్వరి ప్రతి రోజూ అదే సమయానికి అచ్యుతం దగ్గరకు వెళ్లి అతనిని కబుర్లలోకి దింపేది. రాత్రి 8 గంటవరకూ యిద్దరూ మాట్లాడుకుంటూ కూర్చునేవారు. యమునకు అచ్యుతం దగ్గరకు వెళ్ళడానికి అసలు అవకాశం చిక్కడం లేదు. తన అక్క తన చదువుకు యిలా ఎందుకు అడ్డుపడుతోందో యమునకు అర్థం కాలేదు. ఆమెకు బాగా ఆలోచించగా పాతవిషయాలు కొన్ని జ్ఞప్తికి వచ్చినై. ఆ రోజులలో తన అక్క, అచ్యుతం ఎంతో

స్నేహంగా వుండేవారు. ఆ స్నేహం వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకుంటూర నేవరకూ వెళ్లింది. తరవాత ఏం జరిగిందో యేమో యిద్దరూ ఆకస్మికంగా విడిపోయారు. అచ్యుతం మరొకామెను వివాహం చేసుకున్నాడు. అది మొదలు అక్కయ్య అతన్ని అసహ్యించుకొనేది. కాని యిప్పుడు యింత ఆప్యాయంతో అతనితో రాజేశ్వరి తిరిగి స్నేహం చెయ్యడంలో గల ఆంతర్యం ఎంత ఆలోచించినా యమునకు బోధ పడలేదు.... రాజేశ్వరి యమునను వెయ్యికళ్ళతో కనిపెడుతూ అచ్యుతం సమీపానికి వెళ్ళే అవకాశం ఆమెకు కలగకుండా చేస్తోంది.

రాజేశ్వరి ప్రవర్తన అచ్యుతానికి కూడా ఆశ్చర్యాన్ని కలిగించక పోలేదు. యీమె ఎందుకు తన దగ్గరకు నిత్యం వస్తోందా అని ఆలోచించాడు. అతని బుద్ధి మరోరకంగా పోయింది. తనమీద అనురాగం ఆమెకు తగ్గలేదు కనక నే ఆమె వస్తోందని అపోహ పడ్డాడు. అంతరాంతరాల్లో అణగివున్న పూర్వస్మృతులు ఆమెను చూసే కొద్దీ పైకి రాసాగినై. యింతటి అపురూప సుందరిని చేతులారా జారవిడుచుకున్నందుకు అతను యిప్పుడు పశ్చాత్తాప పడసాగాడు.

ఆ సాయంత్రం రాజేశ్వరితో అతను అన్నాడు-

'రాజేశ్వరీ!మనం యిద్దరం చేతులారా మన జీవితాలనునాశనం చేసుకున్నాం - తిరిగి ఆ ఆనందాన్ని అనుభవించే అవకాశం యిక మనకు లేదా!'



'పునర్జన్మ మీద ఆశపెట్టుకో!' అంది రాజేశ్వరి హేళనగా.

'యీ జన్మ మీద యిక ఆశవదులుకోవలిసిందేనా?'

'దివ్యంగా!' అంది చిలిపిగా.

సహజమైన దారులు మూసుకుపోయినప్పుడు దొడ్డిదారులు వెతుక్కోవడం మానవ సహజం.' అన్నాడు అచ్యుతం ఆశగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

అతని అభిప్రాయాన్ని ఆమె గ్రహించింది. ఆమెకు చాలాకోపం వచ్చింది. కేవలం శారీరక వాంఛకంటే నీతి, స్నేహం మున్నగు విషయాలకు ప్రాముఖ్యాన్ని యివ్వాలి. అందుకే కదా తనపై అనురాగం కలిగిన చలాన్ని మోసగించింది. అచ్యుతం తన దుర్బుద్ధిని మరోసారి వ్యక్తం చేశాడు. తను యిప్పుడు కోపాన్ని అణచుకోకపోతే తన ప్రయత్నం విఫలమాతుంది. నేర్పుగా యమునను యీ దుర్మార్గుడికి అందకుండా చెయ్యాలి.

'నీతి నియమాలను విడిచిపెట్టి అందరూ మోసగాళ్లు, వ్యభిచారులూ కావాలనా ఉద్దేశం!' అంది అతనికేసి తీక్షణంగా చూస్తూ.

'నీతి నియమాలనేవి ఎక్కడినుంచో ఆకాశంలోంచి ఊడి రాలేదు. వాటిని మనమే సృష్టించుకున్నాం. --- అవసరమైనప్పుడు వాటిని మనం స్వల్పంగా సవరించుకోవచ్చును.' అతని కళ్ళలో వాంఛ ద్యోతక మాతోంది. అతను లోలోపల చాలా బాధపడుతున్నాడని ఆమె తెలుసుకుంది. అతనికి యీ శిక్ష చాలదు, తీరని కోరికలతో యింకా

కృశించి పోవాలి. ఆనందానికి, డబ్బుకు వుండే తేడా అప్పుడు తెలుస్తుంది.

'మనం పెట్టుకున్న నియమాలను మనమే తృణీకరించాలంటావ్?' అంది ప్రసంగాన్ని దీర్ఘంగా కొనసాగించే ధోరణిలో.

అచ్యుతం నిముష నిముషానికి తన లోని సహనాన్ని కోల్పోతున్నాడు. ఆమె రోజూ తన దగ్గరకు వచ్చి తనను కవ్వించి రెచ్చగొట్టి వెళ్లిపోతోంది. ఎంత ప్రయత్నించినా చేతికి చిక్కడం లేదు. మరో అస్త్రం ప్రయోగించి చూద్దామనుకున్నాడు.

'ఏవిచారం లేకుండా ఆనందంలో మునిగితేలే ఆ రోజుల్ని జ్ఞాపకం తెచ్చుకో రాజేశ్వరి! నువ్వు నామీద వాలి, నా ముఖానికి ముఖాన్ని తాకిస్తూ నాతో రహస్యంగా చెప్పిన ఆనాటి మాటలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకో. మన జీవితాంతం ఆ మధుర క్షణాలను మరిచి పోగలమంటావా రాజేశ్వరీ?'

ఆమె ముఖంలో అచ్యుతానికి ఏదో మార్పు కనిపించింది. నేర్పరి అయిన అచ్యుతం యీ సదవకాశాన్ని వదులుకోకూడ దనుకున్నాడు. లేచి ఆమె రెండు భుజాలమీద చేతులువేసి ఆమె కళ్ళల్లోకి చూస్తూ 'యీ జీవితాంతం తపస్సు చేసినా పునర్జన్మలో యింతటి సౌందర్యరాశి దొరుకుతుందనే నమ్మకం నాకు లేదు.' అన్నాడు పరవశత్వంతో.

యింతకాలం ఆమె బుర్రలో దాగిన పూర్వస్మృతులు ఒక్కసారిగా పెల్లుబికినై. ఆమెలో మైకం కలిగించినై. ఆమెను తిరిగి నవయవ్వనంలో వున్న కన్యగా మార్చినై. తా నిప్పుడు ఒక గృహిణి అన్న విషయం ఆమె మరిచి పోయింది. అతని యినుప కౌగిలినుంచి తప్పించుకోవడానికి ఆమె ప్రయత్నించ లేదు. తన అచ్యుతం తిరిగి తనవాడయ్యాడు. యిద్దరూ బాహ్య ప్రపంచాన్ని మరిచిపోయి ఏవో మాట్లాడుకుంటున్నారు...

తన అక్కను పరీక్షించాలనే తలంపుతో అక్కడకు రహస్యంగా వచ్చిన యమునకు యీ దృశ్యం కనిపించింది. ఆమెలో ఎన్నడూ లేని ఈర్ష్య ఒక్కసారి మెరుపులా మెరిసింది. యిందు కా తన అక్క తనను యిక్కడకు రాకుండా చేస్తున్నది! తన అక్కలా తనేం దుర్బుద్ధితో వెళ్ళడం లేదే!—యమున నిశ్శబ్దంగా అక్కడి నుంచి వెళ్ళి పోయింది.

రాజేశ్వరి బాహ్య ప్రపంచంలోకి వచ్చేసరికి పరిస్థితి తారు మారయింది. తను రెండవసారి పతనమైనందుకు లోలోపల చింతించింది. తను చెడిపోయినా ఫరవాలేదు. యమున చెడిపోవడం మాత్రం తను భరించలేదు. తన ముద్దు చెల్లెలు తనలా కాకూడదు. ఆమె ఆనంద ప్రదమైన గౌరవ జీవితాన్ని సాగించ గలగాలి. అందుకు అవసరమైనంత త్యాగం తను చేస్తుంది. యీ ఆలోచన ఆమెకు సంతృప్తిని కలిగించింది. యమున కళ్ళారా యీ సంఘటన చూసిన విషయం - పాపం ఆమెకు తెలిస్తే కదా!

ప్రతిరోజూ రాజేశ్వరి అచ్యుతంతో ఆనందంగా కాలాన్ని గడుపుతోంది.

యమునను ఆ పరిసరాలకు రానివ్వడమే లేదు.

ఒకరోజు రాజేశ్వరి స్నేహితు రాలింటికి వెళ్లవలిసి వచ్చింది. యిద్దరూ చిన్నప్పటికి విషయాలు మాట్లాడుకుంటూ వుండిపోయారు. సాయంత్రం వెళ్లిపోవడానికి లేచింది రాజేశ్వరి. కాని ఆస్నేహితురాలు ఆమెను వెళ్లనివ్వలేదు. చాలా కాలానికి కలుసుకున్నందువల్ల రాజేశ్వరికి కూడా తొందరగా ఆమెను విడిచి పెట్టటానికి మనస్కరించ లేదు. ఎలాగైతే నేం ఆమె యిల్లు చేరుకునేసరికి రాత్రి 8 గంటలయింది. వెళ్లేప్పుడు అచ్యుతంతో ఏమీ అనలేదు. పాపం! ఆతనుతనకోసం ఎదురుచూస్తూ వుంటాడు. యిప్పుడైనా వెళ్లి చెప్పడం మంచిది.

ఆమె అచ్యుతం గది దగ్గరకు వెళ్లింది. ఆ గదిలో కనిపించిన దృశ్యానికి ఆమె నిలువునా కృంగి పోయింది. ఏ చెల్లెలు శ్రేయస్సు కోసం తను పతనమవడానికి కూడా సిద్ధమయిందో, ఆ ముద్దు చెల్లెలు —యమున—అచ్యుతం కౌగిలిలో చిక్కుకొని వుంది.

యుద్ధంలో పరాజయం పొంది సేనానిలా తల వంచుకొని ఆ ప్రదేశాన్ని విడిచి పెట్టింది రాజేశ్వరి.

ఆ రాత్రే తన వూరికి తిరిగి ప్రయాణం అయింది.

★


విడుదలైంది. త్వరపడి నేడే మీ కాపీలకు ఆర్డరివ్వండి.

## సినీతార దుర్మరణం

(డిటెక్టివ్ నవల)

రచన : దాసు

వెల: 8 అణాలు మాత్రం.

సునంది గొప్ప పేరు ప్రఖ్యాతులు గల సినిమా నటి. ఆమె అందం హావ భావ విలాసాలూ, తెరమీదా, తెరవెనకా కూడా ప్రేక్షకుల్నీ ప్రియుల్నీ మత్తెక్కించి, మైమరపించినై.

ఒకనాడు, అది సుదినమో, దుర్దినమో చెప్పలేం; ఆవిడ డిటెక్టివ్ కిశోర్‌కు ఆపదలో వున్నట్టు ఫోన్ చేసింది. అంతే...ఆ తరవాత అంతా గందరగోళం, గజిబిజి.

కిశోర్ తీగ లాగాడు; డొంక కదిలింది. చోరులూ, హంతకులూ, దగాకోర్లూ...సినీమాలో లాగా ఫేడిన్—ఫేడౌట్!

జ్యోతి కార్యాలయం, మద్రాసు_17.



# శిలా శిశువులు

సర్వ సామాన్యంగా మానవుల్లో 266 రోజుల గర్భధారణను ప్రకృతి నిర్ణయించింది. యీ కాలం వీర్యకణం, గుడ్డును పొదిగి నప్పటినుంచీ, శిశువు భూమిమీద పడే వరకూ పడుతుంది. ఐతే పక్వమైన గుడ్డు సరిగ్గా ఏనాడు ఫలవంతమైనదో తెలుసుకోవటం కుదరదు కనుక, గతసారి బహిష్ఠయిన తేదీ నుంచే రోజులు లెక్కించటంవల్ల, పైన చెప్పాకున్న కాలంలో కొద్ది భేదం ఏర్పడుతూంటుంది. యీ లెక్క ప్రకారం సర్వ సామాన్యంగా, శిశు జననం 280 రోజుల తర్వాత జరుగుతుంది. అంటే 266 రోజుల కాలానికి 14 రోజులు—అనగా, బహిష్ఠుకూ, బహిష్ఠుకూ మధ్య వున్న కాలంలో సగం—కలపబడుతోంది. ఇది కూడా అంత సరైన లెక్క అవదు. మొత్తంమీద పదింట ఒక గర్భధారణ సరిగ్గా 280 రోజులూ పడుతోంది.

ఇక వైద్య చరిత్రలో చాలా కాలం వరకూ గర్భవతులుగా వున్న స్త్రీల కేసులు అనేకం ఉన్నవి. నిజానికి సంవత్సరాల తరబడిగా గర్భవతులుగానే వుంటూ, పురుడు పోసుకోని స్త్రీలు వున్నారు. ఇలాటి స్త్రీల గర్భాశయంలో ప్రాణ రహితమైన 'శిలా శిశువు' వుండటం పరిపాటి.

యీ శిలా శిశువులు, సాధారణ శిశువు రూపాన్నే కలిగి వుండి, శిలవలె కఠినమైన మాంసపు ముద్దగా తయారవుతారు. యీ శిలలు గర్భకోశంలో సంవత్సరాల తరబడి—ఒకానొక కేసులో 35 సం॥ల పాటు కూడా—ఉంటవి. స్త్రీకి బహిష్ఠు వుండదు; కనుక గర్భవతిననే అభిప్రాయం వుంటుంది. క్రమంగా పొత్తికడుపు కూడా పరిమాణంలో పెరుగుతూండటం వల్ల, నిజమైన గర్భమేననే 'నమ్మకం కలుగుతుంది. యీ విధంగా కాలం గడుస్తుంటే కాని పురుడు రాదు. ఏ శస్త్ర చికిత్సో జరిగినప్పుడు, యీ శిశువు బైట పడతాడు!

శిలా శిశు జననాలు కొన్ని శతాబ్దాల క్రితమే వైద్య చరిత్రకు తెలుసు. ప్రసిద్ధిగన్న ఒకానొక ఫ్రెంచి వైద్యుడు 1586

లోనే శిలా శిశువుల్ని గూర్చి గ్రంథస్థం చేశాడు. ఆ తరువాత చాలా మంది వైద్యులు తను అనుభవాలనుకూడా బైట పెట్టారు. ఐతే ఆనాటి శాస్త్రీయ విజ్ఞానం చాలా శైశవ దశలోనే ఉండటం వల్ల, ఇలా జరిగేందుకు తగిన కారణాల్ని ఎవ్వరూ సరిగ్గా చెప్పలేక పొయ్యారు.

19-వ శతాబ్ద మధ్యంలో కాని శిలా శిశువుల్ని గూర్చిన శాస్త్రీయ చర్చలు ఒక విశిష్ట రూపాన్ని దాల్చలేదు. 1880-1912 సం॥ల మధ్య వైద్య చరిత్రలో గ్రంథస్థమైన 74 కేసుల్ని తీసుకొని ఒకానొక ప్రముఖ వైద్యుడు ఆలోచించ సాగాడు.

శిలా శిశువును గర్భంలో వుంచుకొన్న స్త్రీల చరిత్రలు ఏ విధంగా ఉండేదీ, కొన్ని, యీ కింద పొందు పరచబడినవి.

ఒకానొక 67 సం.ల స్త్రీ, కడుపులో నెప్పి కలుగుతోందని డాక్టర్ను సలహా చేసింది. పరీక్ష తర్వాత, కడుపులో కణితి వుండాలని వైద్యుడు నిర్ణయించాడు. శస్త్ర చికిత్సలో ఒక పెద్ద గుండ్రని ముద్ద తొలిగించబడింది. ప్రమాద వశాత్తు అది నేలమీదపడి, రాయిపడిన శబ్దమైంది. దాని బరువు 4½ ఔన్సులు!

యీ మాంసపు ముద్దను కోసే ప్రయత్నంలో పదునైన కత్తి లాభం లేక పోయింది. చివరకు రంపంతో కోయవలసి వచ్చింది. పై పొరలు తొలిగించబడ్డాక, లోన బాగా పెరిగిన పిండం, శరీరాంగాలన్నీ వుండి, చివరకు కాలికీ చేతికీ గోళ్ళతో సహా పెరిగి వుంది. శిశువు సెక్సునుకూడా చెప్పేందుకు వీలుగా, పురుషాంగమూ బీజాలూ ఉన్నవి. పిండం పొట్టలో నుంచి బొడ్డుతాడు వుంది; మాయకూడా వుంది. ఏమైనా పిండం శిలవలె కఠినంగా వుంది.

విచారించగా, ఆమె 32 సం.లనుంచీ బహిష్టు లేకుండా, గర్భవతినని ఆమె చెప్పింది. నిజానికి నవమాసాలూ నిండాక పురిటి నెప్పుల్నికూడా ఆమె అనుభవించింది. కాని పురుడు రాలేదు. కొన్నాళ్ళ పాటు పొత్తి కడుపు ఉబ్బెత్తుగావున్నా, ఇతరత్రా బాధకానీ, ఇబ్బంది కానీ ఉండనందువల్ల ఆమె నిర్లక్ష్యంగా వుండేది. ఆ తరువాత ఆమె మామూలు ఆకారాన్ని తిరిగి పొందటం వల్ల అనుమానించ లేదు. తిరిగి గర్భధారణ జరిగిన చిహ్నాలుకూడా పొడసూపనూ లేదు.

మరో కేసులో—ఆమె వయస్సు 40 సం॥లు. వైద్య సలహా చేసేందుకు ఒక సంవత్సరం ముందు నుంచీ కడుపులో పోట్లతో ఆమె బాధపడేది. 12 సం॥లకు ముందు ఆమె గర్భవతియై, 6 నెలల తరువాత, ప్రమాద వశాత్తు ఒక బావిలో పడటం వల్ల గర్భానికి దెబ్బతగిలింది. వెను వెంటనే ఆమె పురిటి నెప్పుల బాధ అనువించింది, యోని నుంచి విశేషంగా రక్తస్రావం జరిగింది; కాని శిశు జననం లేదు. యీ స్థితిలో రెండు వారాలు గడిచాక, హఠాత్తుగా రక్త స్రావం ఆగిపోయింది. ఆ తరువాత పొత్తి కడుపు కూడా యథాస్థితికి వొచ్చింది.

మరి కొన్నాళ్ళు గడిచాక, పొత్తి కడుపు కింది భాగంలో ఏదో ఘన పదార్థం వున్నదనే అనుమానం ఆమెకు కలిగింది. తడివి చూస్తే కోడి గుడ్డంత పదార్థం, కడుపులో అటూ ఇటూ కదులు

తూండటాన్ని ఆమె గమనించింది. విశేషంగా దేహపరిశ్రమ చేసినప్పుడు తప్ప, ఆమెకు ఏ విధమైన బాధా ఉండేది కాదు.

వైద్య పరీక్షానంతరం, కడుపులో ఏదో ఒక కణితి వుండి వుంటుందని నమ్మబడింది. తీరా శస్త్ర చికిత్స జరిగాక కడుపులోని ఖాళీ భాగంలో ఘన పదార్థమొకటి తేలుతూండటం కనిపించింది. దాన్ని ఖండించి రసాయన పరిశోధన చేయగా కాల్షియమ్ లవణాలతో కూడిన రాయిగా రుజువైంది. ఐతే అది పిండ రూపంలోనే ఉండి, చివరకు బొడ్డు తాడును కూడా కలిగి వుంది. ఘనీభవించి పోయిన 'మాయ'కూడా కనిపించింది.

ఇంతకూ యీ శిలా శిశువులు ఎవరు? వీరు ఎలా రూపొంది, ఘనీభవించి శిలలయ్యారు? యీ విషయాన్ని తెలుసుకొనే ముందు, శిలా శిశువులు, గర్భకోశంలోగాక, కడుపులోవున్న ఖాళీ భాగంలో కనిపిస్తారు. సాధారణమైన గర్భధారణలో శిశువు గర్భకోశంలోనే పెరుగుతాడు. ఐనప్పుడు యీ శిలా శిశువులు కడుపులోని ఖాళీ భాగంలోక ఎలా వెళ్లగలిగారో తెలుసుకోవాల్సి వుంది.

గర్భధారణ జరగటమనేది, సర్వసామాన్యంగా అండవాహికలోనే జరుగుతుంది; పక్వమైన గుడ్డు, ఇక్కడే వీర్యకణం చేత పొదగబడి, గర్భకోశంలోకి వొచ్చి క్రమంగా పిండ మౌతుంది.

ఒకో సమయంలో గుడ్డు పొదగబడినాక, ప్రమాదవశాత్తూ, అది క్రమంగా గర్భకోశంలోకి రావుండా, అండవాహికలోనే అంటి పెట్టుకొని వుంటుంది; ఇలాటి దాన్ని ట్యూబల్ గర్భం అంటారు. ఇక్కడకూడా గర్భకోశంలో వలెనే పిండం పెరగ సాగుతుంది.

2, 3, నెలలు గడిచేప్పటికి, అండవాహిక, పెరిగే పిండానికి సరిపోదు. పెరిగే పిండం వొత్తిడివల్ల, అండవాహిక పైభాగంలో చీల్చబడుతుంది. యీ విధంగా ఛేదించుకొన్న పిండం, కడుపులోని ఖాళీ భాగంలోకి జారబడుతుంది. ఇది కూడా ఒక రకం గర్భస్రావమే! ఇది జరిగినప్పుడు, వెను వెంటనే శస్త్ర చికిత్స అవసర మౌతుంది.

ఐతే ఒకొకప్పుడు పిండం మాత్రమే కడుపులోకి దూసుకోవటం, పిండానికి సంబంధించిన మాయ మాత్రం, అండవాహిక కండరపు గోడకే అంటి పెట్టుకొని ఉండటం జరుగుతుంది. ఎన్నాళ్ళయితే 'మాయ' ద్వారా పిండానికి ఆహారం సరఫరా అవుతుందో, అన్నాళ్లూ పిండం కడుపులోని ఖాళీ భాగంలో పెరుగుతూనే వుంటుంది.

ఇలా కడుపులోని ఖాళీ ప్రదేశంలో పెరగ గలిగిన పిండం, శిశువుగా బైటపడటం వున్నదా అనే ప్రశ్న వొస్తుంది. పరిపూర్ణంగా పెరగగలిగిన శిశువు బైటపడేందుకు వేరొక మార్గంలేదు కనుక, శస్త్ర చికిత్స ద్వారా, ఆరోగ్యకరంగా వున్న శిశువులు బైటపడిన కేసులు వైద్య చరిత్రలో అనేకం ఉన్నవి; ఐతే యీ విధంగా బైటపడిన శిశువుల్లో అధిక భాగం చాలా త్వరలోనే విగత జీవులవుతూ వుండటం సర్వసాధారణం.

ఒకొక్కప్పుడు, కడుపులో పిండం పెరగటమనేది గమనించ బడకుండా వుంటుంది. అలాటప్పుడు, ఆ పిండం మృతి నొంది, తల్లి కడుపు భాగంలో చాలా కాలం, సంవత్సరాల తరబడి ఉండి పోవటం జరుగుతుంది. ఇలా మృతి నొందిన శిశువు ఏమౌతాడు?

యీ ప్రశ్నకు జవాబు చెప్పేముందు, 'శిలా శిశువు' అనే పదంలోని 'శిల' నిజంగా రాయి కాదు. శారీరక శాస్త్రాన్ని గూర్చిన మానవుని విజ్ఞానం ప్రాథమిక దశల్లో ఉన్నప్పుడు ఆ పేరు వొచ్చింది. నిజానికి శిలా శిశువులోవున్నది మాంసపు ముద్దా, గట్టి ఎముకలూను. కడుపులో చని పోయిన పిండం, తల్లి శరీరానికి సంబంధం లేని పదార్థంగా వుండి, కొద్దిగా ఇబ్బందినీ, ఇరిటేషన్‌నూ కలిగించవొచ్చు. యీ 'ఇరిటేషన్ కారణంగా' కాల్షియమ్ లవణాలు విపరీతంగా తల్లి శరీరం నుంచి విడుదలవుతవి. యీ లవణాలే ఎముకల నిర్మాణానికి ఉపయోగపడుతవి; ఇవన్నీ ఆ పిండాన్ని జేరి పొరలు పొరలుగా ఏర్పడి, గట్టి ఎముక పదార్థంగా రూపొందుతవి. శిలా శిశువులు యీ విధంగానే తయారవుతారు.

శిలా శిశువు, సాధారణ శిశువు కన్న చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. ఎందుకంటే సాధారణ శిశువులోని చీము రక్తాలూ, ఇతర ద్రవ పదార్థాలేవీ శిలా శిశువులో ఉండవు. శరీరంలోని మెత్తని భాగాలన్నీ కుదించుకొని పోయి, ఘనీభవించి బరువునూ, పరిమాణాన్నికూడా కోల్పోతవి. ఐతే అప్పుడప్పుడు సున్నపు లవణాలు కాల్షియమ్ లవణాలమీద పడటంవల్ల, యీ ఘన పదార్థపు బరువు పెరగటంకూడా కద్దు.

పై పొరల్లో కాల్షియమ్ లవణాలున్నప్పటికీ, లోన పిండరూపం ఉండటంవల్ల శిశువు వలెనే యీ ఘన పదార్థం కనిపిస్తుంది. ఒకొక్కప్పుడు పిండమంతా ఎముకల ముద్దగా తయారవక, కొన్ని మెత్తని భాగాలు కుదించుకొని పోయి, ఎముకల నిర్మాణం చెక్కు చెదరకుండా ఉండటంకూడా జరుగుతుంది. అలాటప్పుడు 'అస్థిపంజర' రూపాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది.

అదృష్టవశాత్తూ శిలా శిశువులు చరిత్ర కుతూహలాన్ని తీర్చేవిగానే ఉన్నవి. శిలా శిశువులు నూటికి కోటికి తప్ప కనిపించరు; అందునా శాస్త్రీయ విజ్ఞానం విపరీతంగా పెరిగిన రోజుల్లో శిలా శిశువు చాలా అరుదైనదిగా మారిపోయింది.

★



# ఆత్మా పరమాత్మ



రచన వనశ్రీ

'గజం మిథ్య! పలాయనం మిథ్య!!' స్వామీ నిత్యానందులవారు, గంజాయి దమ్ము గట్టిగా పట్టి పెదవుల సందుగా పొగ వదులుతూ అన్నారు.

'అంతే నంటారా గురూజీ!' అన్నాడు సరవయ్య గంజాయి గొట్టంలో అంత గంజాయి పోడివేసి తడిగుడ్డ చుట్టి స్వామీజీకి అందిస్తో.

'అంతకంటే యింకేమీ లేదు యీ లోకంలో సరవయ్యా! సుఖ దుఃఖాలు మన వూహా కల్పితాలే! నువ్వెవరూ? నేనెవరూ? అంతా ఆ పరమేశ్వరుని లీలా విలాసమే! ఈ జగత్తంతా మిథ్య! మాయ! అంతా అంధకారం! ఈచీకట్లో పడి ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని కానలేక మానవుడు శ్లేష్మంలో పడిన యీగలాగా మాయలో తన్ను కొంటున్నాడు సరవయ్యా!' స్వామీజీ గంభీర స్వరంతో పలుకుతూంటే సరవయ్య - 'ఓ హోహో! స్వామీ!' అంటూ భక్తి శ్రద్ధలతో వింటున్నాడు.

'ఒక అల్పసందేహం స్వామిజీ! గజం మిథ్య అంటే ఏనుగు లేదనేకదా స్వామిజీ! ఏనుగే లేనప్పుడు అది పరుగెత్తటమనేది ఇంకెక్కడ వుంటుంది స్వామిజీ! అలాంటప్పుడు గురువులు పలాయనం మిథ్య అని వేరే శలవిచ్చారెందుకో? నాయీ అల్పబుద్ధికి బోధపడటం లేదు. స్వామీజీ!' అన్నాడు సరవయ్య. స్వామిజీ చేతుల్లోంచి గంజాయి గొట్టం అందుకొని తనూ ఒక దమ్ము పీల్చి, గొట్టాంలో మళ్ళీ గంజాయి దట్టించడం మొదలు పెట్టాడు.

పిచ్చిక గూడులాంటి గడ్డంమీదగా ఒక చిరునవ్వు విసిరి, స్వామీజీ నిశితంగా సరవయ్యను చూస్తో-

'నీది చాలా సూక్ష్మబుద్ధి సరవయ్యా! యీ మాయను చీల్చుకొని, అంధకారంనుంచి బయటపడి, ఆ పరమా

త్మను చూడగలిగిన దృష్టి, శక్తి నీలో వున్నాయ్ సరవయ్యా! కానీ...'

'చెప్పండి స్వామీ సందేహిస్తారేం?'

'సందేహం మా కెందుకు సరవయ్యా! సర్వసిద్ధులం! మహాఋషులం. మాకా సందేహం?'

'అవును స్వామీ! మహాఋషులకు సంకోచ మెందుకూ? శలవియ్యండి!'

'సరవయ్యా! నువ్వు, ఆత్మను పరమాత్మలో ఐక్యం చెయ్యాలంటే అందుకు సాధన అవసరం అని తెలుసుకో!' అని నిత్యానందులవారు గంభీర మౌనాన్ని దాల్చారు.

సరవయ్య ఒక క్షణం ఆలోచించి - 'స్వామిజీ! ఓపినంతలో నేనూ భగవత్ కాలక్షేపంలోనే కాలాన్ని గడుపుతున్నాను గదా! మీబోటి మహాత్ముల పాదసేవలతో అవకాశం దొరికినప్పుడల్లా నా జన్మను తరింప చేసుకుంటున్నానే! అయినా స్వామిజీ ఇంకా 'సాధన' అంటున్నారు. తమ అభిప్రాయమేదో కరుణించి విదితం చేయండి స్వామీ!' వినమ్రతతో అన్నాడు.

'మాయ! అంతా మాయ!' స్వామి చప్పరిస్తూ అన్నారు.

సరవయ్య ఒకింత నిరుత్సాహపడి— 'ఏమి స్వామిజీ! నేను కూడా మాయను తెలుసుకోలేక పోయాననే నా తమరి అభిప్రాయం!'

'అవును సరవయ్యా! మాయను తెలుసుకోవడం ఒక ఎత్తు. మాయను జయించడం ఒక ఎత్తూ; మాయను జయించడం అంత సులభసాధ్యం కాదు, సరవయ్యా!' స్వామిజీ తమ గంభీర కంఠాన్ని వివిధ స్థాయిల్లో నొక్కుతూ అన్నారు.

'అయితే నేను మాయను జయించలేదా? మరి నాకు తరుణోపాయం ఏమి స్వామీ?' మెత్తబడి సాగిపోతూ దీన వదనంతో అన్నాడు సరవయ్య.

'మాయను జయించినవాడే మహాఋషి! మహాఋషి అయినవాడే మాయను జయించగలడు. అది సర్వసామాన్యులకు దుర్ఘటం సరవయ్యా!' నిశితమైన చూపులు సరవయ్య మీదకు విసురుతూ అన్నారు నిత్యానందులు.

'మహాత్మా! నాకు ముక్తి మార్గం చూపండి! వెలుగు బాటను చూపించండి. స్వామీ! నా జన్మ తరింప జేసుకొంటాను!' సరవయ్య చేతులు జోడించి స్వామిజీని అర్థించాడు.

'మాయను జయించడం సర్వసామాన్యులకు సాధ్యం కాదని మేము ముందే చెప్పాంగా సరవయ్యా! మానవుడు సుఖ దుఃఖాలకు ఎప్పుడు అతీతు డవుతాడో, ఐహిక వాంఛల్ని ఎప్పుడు విడనాడ గలుగుతాడో, ఎప్పుడు సంసార బంధనాల్నుంచి విముక్తి కాగలడో అప్పుడే మాయను జయించగలడు—' స్వామిజీ గంజాయి దమ్ము పట్టేందుకు ఒకింత సేపాగి మళ్ళీ ప్రారంభించారు. సరవయ్య ఆత్మను పరమాత్మలో ప్రవేశ పెట్టే పనిలో నిమగ్నులైన స్వామీజీ, వేదాంతాన్ని తరిచి తరిచి తర్కించి బోధ చేస్తున్నారు.

'ఐతే స్వామిజీ! ఎంతో కాలంగా నేను సాధుజన సేవలో, సర్వేశ్వరుని ఆరాధనలో వున్నాను గదా! ఇంకా ఆ మాయ నన్ను ఆవరించే వుందంటారా?

ఆ పరబ్రహ్మ స్వరూపుని సేవలోపడి నిక్షేపమయిన ఏ డెకరాల మాగాణి కూడా అమ్ముకున్నానే! ఐహిక సుఖాల్ని, వాంఛల్నీ ఎంత దూరం తరిమి తరిమి కొట్టానో స్వామిజీకి నేడు వేరే చెప్పాలా? ఇంకా మాయను జయించ లేదంటారేమి మహాత్మా!' పాపం సరవయ్య ఎంతో అలజడి పడుతో అన్నాడు.

'అదే మాయ! మాయను జయించా నని నువ్వు అనుకోవడంలో ఎంతో మాయ ఇమిడివుంది! మాయలో వున్న మాయే అది సరవయ్యా!...'

'స్వామీ! నాకు అంతా మాయగా అయోమయంగా వుంది! మీ మాటల అంతరార్థాన్ని యీ అల్పుడు గ్రహించ లేకపోతున్నాడు! విడమర్చి చెప్పండి స్వామీ?' సరవయ్య ముఖం తేలవేసి అన్నాడు.

'పిచ్చివాడా' స్వామీజీ మందహాసం చేసి అన్నారు—'సరవయ్యా! సంసార సాగరంలో మునిగి కొట్టుమిట్టాడుతున్న నువ్వా దరిజేరు టెప్పుడూ? ఆ పర మాత్మలో ఐక్యం పొందటం ఎప్పుడూ? భవబంధనాలలో బంధించబడ్డ నీ ఆత్మకు విముక్తి ఎలా కలుగుతుంది సరవయ్యా?'

సంసారం అనగానే ఆముష్మిక చింతనలో వున్న సరవయ్యకు పెళ్ళాం ఆదెమ్మ గుర్తుకొచ్చి కళ్లు తెరిపిళ్ళు పడ్డాయి. అన్నట్టు స్వామిజీ భోజనం ఏర్పాటు చెయ్యమని పొద్దు ననగా పెళ్ళానికి చెప్పా డతను. అది ఏమి చేసిందో? అసలు ఇంకా వంట తయా రయిందో? లేదో?

సరవయ్య లేచి లోపలకు వెళ్దామను కుంటుండగా, స్వామిజీ గంజాయిగొట్టం సరవయ్య చేతికి అందిస్తో—

'చూడు సరవయ్యా! గంజాయంతా కాలిపోయినట్టుంది! వట్టి బూడిద నోటికి వస్తోంది! మళ్లీ కొంచంవేసి సిద్ధం చెయ్యి!' అన్నారు.

సరవయ్య గంజాయి గొట్టాం అందు కొని, పొడి దట్టించి, ఒక్క తాటి నిప్పుతో వెలిగించి స్వామిజీ కిచ్చాడు.

నిత్యానందులు గట్టిగా వో దమ్ముపట్టి పొగ వదుల్తో — 'సంసార సుఖాల్ని నిర్జించ గలిగినవాడే మాయను జయించి నట్టు! అప్పుడు మాత్రమే పరమాత్మ సాన్నిధ్యాన్ని పొంద గలుగుతాడు. అన్యధా మార్గంలేదు సరవయ్యా! అదీ అసలు రహస్యం! అదీ అసలు రహ స్యం!' అన్నారు.

'ధన్యోస్మి! ధన్యోస్మి!' అంటూ సర వయ్య నిత్యానందులవారి పాదాల్ని తాకాడు.

ముక్తిమార్గంలో తను సగం దూరం పైగా నడిచా ననుకొన్న సరవయ్యకు జర్రున వెనక్కు జారిపడ్డట్టయింది! ఇంత కాలం తను ఏదో సాధించా ననుకొ న్నాడు! కాని అంతా మాయలోనే వున్నాడన్నమాట! సంసార సాగరంలో పడి మునిగితేలుతూ ఇంతకాలం తను ఎంత భ్రమలో పడిపోయాడు? ఏమైతే నేం? స్వామిజీ యీ రోజున తనకళ్లు తెరిచాడు. తన ముముక్షువుకు దృష్టిని ప్రసాదించారు నిత్యానందులు. తను ఇక నేరుగా పరమాత్మలో ఐక్యమయేందుకు నిరంతర సాధన చేయాలి! ఇక తన బాటకు ఏదీ అడ్డురాకూడదు, యీనాటికి

తను మాయను చీల్చుకొని, సంసార సాగరాన్ని యీది అద్దరిచేరబోతున్నాడు. సరవయ్య ఆలోచనలు ఒక్కొక్కమెట్టే ఎక్కి కైలాసగిరి చేరతున్నాయి--సరవయ్య ఆత్మను - క్షుద్ర వాంఛల్నుంచీ, ఐహిక సుఖాల్నుంచీ, మమకార బంధనాల్నుంచీ విముక్తి చేసే ప్రయత్నంలో పడి పోయిన స్వామిజీ నిత్యానందుల వారికి తమ ప్రసాద కైంకర్య సమయమయిందన్న మాటే గుర్తు రాలేదు. స్వామిజీ కడుపులో పేగులు గొడవ చేయగా, పీలుస్తోన్న గంజాయి గొట్టం పక్కన పెట్టి ఒకసారి సకిలించి గొంతు సరి చేసుకొని---

'సరవయ్యా! మా జీవోపాసనకు సమయ మయిందే!' అన్నారు.

మాయను చీల్చుకొని ఆత్మ పరమాత్మను చేరే సందర్భంలో హిమాలయాలంత ఎత్తున లేచిన తన వూహాలు చెల్లాచెదురుకాగా సరవయ్య స్వామివారి మాటవింటూనే తృళ్లిపడ్డాడు.

'ఎంత అపరాధం! ఎంత అపరాధం! వేదాంత చర్చలోపడి స్వామీజీకి కాలాతీతం అయిందే గుర్తించలేదు! ఇదిగో అన్నీ క్షణంలో సిద్ధం చేయించుతాను!' అంటూ సరవయ్య లేచి నుంచున్నాడు.

స్వామిజీ నిర్లిప్తంగా ఓ చిరునవ్వు పారేసి, సంచిలోని కాషాయి పంచను బయటికి తీసుకొన్నాడు.

'అన్నట్టు స్వామిజీ! యీ వేదాంత గోష్ఠిలో పడితే కాలం ఎలా గడిచేది కూడా తెలియదు కదా! గజం మిధ్యా పలాయనం మిధ్యా అని ప్రారంభించిన చర్చ, ఎంతవరకూ సాగిపోయిందో చూశారా?' అన్నాడు సరవయ్య.

'అవును! గజం మిధ్య పలాయనం మిధ్య! అన్న ఒక్క ముక్కమీద మూడు రాత్రిళ్లు మూడు పగళ్ళు మాట్లాడవచ్చు సరవయ్యా! దీనికిఅంతెక్కడ!' అన్నారు నిత్యానందులవారు భోజనానికి సిద్ధమవుతూ.

'గజం మిధ్య! పలాయనం మిధ్య! ఎంత గూఢార్థం ఇమిడి వుంది?' అనుకొంటూ సరవయ్య వసారా అరుగుల మీద నుంచి లోపలకొస్తో, తలుపుతోసి- 'ఏమేవ్! వంట అయిందా?' అన్నాడు.

'ఏఁవిటీ ఆకేకలూ? కొంచెంచిన్నగా మాట్లాడ్డురూ? ఏవిఁటీ అయిందీ?' అంటూ దీర్ఘం తీసింది, అంతవరకూ తలుపుచాటున కూర్చుని పొంగుడు సరవయ్య ఆ గోసాయి ముండా కొడుకుతో మాట్లాడిన దంతా వింటోన్న ఆదెమ్మ.

'ఆఁ! అదేనే! స్వామిజీకి భోజనానికి వేళయింది! వంటయితే వడ్డించు!' అన్నాడు సరవయ్య.

'ఆఁ! ఏవిఁటీ? భోజనమా? ఎవరికి?' బుగ్గమీద వేలు నొక్కుకొని అన్నది ఆదెమ్మ.

'అదేనే! స్వామిజీకి!' అన్నాడు సరవయ్య విసుగ్గా.

'స్వామిజీ ఎవరూ? ఎక్కడాఏమిటీ?' అన్నది ఆదెమ్మ ఆశ్చర్యాన్ని నటిస్తో.

'నీకేం కళ్ళు పోయినయ్యా! ఆదేం అరుగుమీద వసారాలో కూర్చుని స్వామివారు నీకు కనిపించడంలా? పొద్దున్నే వంట చెయ్యమని చెప్పానుగా? బుద్ధి లేదూ? ఇంతకీ వంటచేశావాలేదా?' గుడ్లు ఉరిమి గద్దిస్తో అడిగాడు సరవయ్య.

'నువ్వు మిథ్య! అరుగుమీద కూర్చున్న మీ స్వామిజీ మిథ్య!! మీరు అన్నం తినడం అంతకంటే మిథ్య!!' వచ్చే నవ్వును ఆపుకొంటూ అన్నది ఆదెమ్మ.

నిలుచున్న పాటుగా సరవయ్య కొద్ది క్షణాలు బిగిసిపోయాడు. గవదలు కదల్లేదు. పెదవులు ఆడలేదు.

నోట్లో పవిట చెంగు కుక్కుకొని ఆదెమ్మ పొట్ట చెక్కలయేట్టు నవ్వ సాగింది---

సరవయ్య తెప్పరిల్లుకొని --- 'నువ్వూ నీ నవ్వూ ఏడ్చినట్టే ఉంది గాని ఇంతకీ వంట చేశావా? లేదా?' అన్నాడు.

'చేసే దెవరూ? చేయించే దెవరూ? అంతా మాయ! మిథ్య!' పెదవులు విరిచి చేతులు తిప్పుతో అన్నది ఆదెమ్మ.

'ముయ్ నోరు! తన్నే వాళ్ళు లేక! వాగుడు కట్టిపెట్టి స్వామీజీకి అన్నం వడ్డించు!' కళ్ళెర్ర చేసి తీవ్రంగాఅన్నాడు సరవయ్య.

సరవయ్య కోపం వస్తే మనిషి కాడని తెలిసిన ఆదెమ్మ పొంగి వస్తోన్న నవ్వును మింగేసి వంటింట్లోకి నడిచింది.

కజాణాబాతులా నడుం, మెడా తిప్పుకొంటూ వెళ్తూన్న ఆదెమ్మను చూస్తో-'బోడిముండ! వేదాంతం ఏడుస్తోంది వేదాంతం! నీతిక్కకుదిరిస్తాలే!' అనుకొన్నాడు సరవయ్య.

## 2

సరవయ్య ఆతిథ్యానికి సంతృప్తులైన స్వామి నిత్యానందులు,సరవయ్యకు గురూపదేశంచేసి, తన అనంత శిష్య కోటిలో చేర్చుకొన్నారు. ఆత్మను పరమాత్మలో ఐక్యం చేసే 'సాధన' వగైరా విషయా లన్నీ సరవయ్య చెవుల్లో నూరిపోసి, నిత్యానందులవారు శిష్యుణ్ని దీవించి, పాపుల్నుద్ధరించే కార్యక్రమంలో బయలుదేరి వెళ్ళి పోయారు.

స్వామిజీ వెళ్ళిందగ్గర్నుంచీ సరవయ్య ఎడతెగని చింతలో మునిగి పోయాడు---భార్యాబిడ్డల్ని వదిలేసి పరమాత్మను దర్శించడానికి దేశాటన చేస్తోన్న స్వామి నిత్యానందులు ఎంతటి మహానుభావుడో కదా? తనూ అలాచేయగలిగిన నాడే కదా తన జన్మ సార్థకమయ్యేది! బుద్బుద ప్రాయమైన యీ మానవజన్మను నమ్ముకొని తనెంత కాలం మోసపోయాడు? తను యీ సంసార బంధనాల్ని తెంచుకొని-పెళ్ళాం బిడ్డలను తెగతెంపులు చేసుకున్న నాడే తన ఆత్మకు శాంతి; విముక్తిమార్గం గోచర మయ్యేది. తన ఊరూ, ఇల్లూ భార్యా కొడుకులనూ వదిలేసి, ఎలావెళ్లడమా, అన్న నిరంతర చింతనలో మునిగి పోయాడు సరవయ్య.

సరవయ్యకు ఆధ్యాత్మిక చింతన యీ నాడు కొత్తగా వచ్చిందేమీ కాదు. తాత ముత్తాతల ఆస్తితోపాటు సరవయ్యకు ఆముష్మిక జిజ్ఞాస, వారసత్వంగా అబ్బింది. అయితే అతని పూర్వీకుల్లో పెళ్ళాం బిడ్డల్ని వదిలేసి సన్యాసుల్లో కలిసిపోయినవాళ్ళు ఎవరూ లేరుగాని, గుళ్ళూ గోపురాలు కట్టించడంలో వున్న ఆస్తిని తగలేసుకొంటూ భగవంతుని సేవలో కాలాన్ని వెళ్ళబుచ్చిన వాళ్ళే! సరవయ్య తాత తండ్రులమీద ఊళ్ళో జనానికున్న పూజ్యభావం సరవయ్య తన మీద కూడా ఆ పూజ్యభావం, గౌరవం సడలకుండా వుండటానికి తన సర్వశక్తులూ, మిగిలిన వున్న ఆస్తి తగలేసి

'షోరా వారసుడా' అనిపించుకొన్నాడు. శివాలయంలో పూజలకీ, పునస్కారాలకూ, సంతర్పణాలకూ ఏ లోపమూ రాకుండా జరుపుకొచ్చిన సరవయ్యకు ఇంట్లో నూకలు నిండనారంభించాయి. అంతవరకూ పరమసాధ్వి పతివ్రతా అనిపించుకొన్న సరవయ్య పెళ్లాం, మొగుడు చేస్తోన్న పనికి కొంపగుండం అవడం చూసి, నెత్తిన నోరుపెట్టుకొని సరవయ్యను హెచ్చరించ సాగింది. సరవయ్య పెళ్ళాం ఆదెమ్మ కళ్ళు తెరిచేసరికే ఆలస్యమయింది. చేసేది లేక ఆదెమ్మ భర్త పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శించటంకోసం చేసే దుబారాఖర్చునూ, దమ్మిడీ ఎత్తుపని చేయకుండా, తత్త్వవేత్తలతో వేదాంత చర్చలతో కాలాన్ని గడుపుతోన్న సరవయ్య చేష్టల్ని నిరసించసాగింది. చీటికిమాటికి భార్య తన మాటకు ఎదురు చెప్పడం, ఎప్పుడూ పెడసరిగా ప్రవర్తించడం చూసి సరవయ్యలోని మమకారబంధనాలు ఒక్కొక్కటే తెగిపోసాగాయి. ఉన్న ఆస్తంతా తాకట్లకిందా, అప్పులకిందా చెల్లిపోగా ఇల్లు మాత్రం మిగిలి వుంది. అది కూడా తాకట్టుపెట్టి ఏ మాత్రమో తెచ్చాడనీ, ఆ డబ్బుపెట్టే తండ్రిగారి ఆరాధనకు ఏ లోటూ రాకుండా జరిపించాడని ఆదెమ్మ పసికట్టింది. సరవయ్య తండ్రిగారి ఆరాధనకు వచ్చిన సదస్యులంతా వెళ్ళిపోయినా, నిత్యానందులవారు సరవయ్య కోరికపై అదనంగా మరి రెండురోజులు అక్కడే తిష్టవేశారు. ఆ రెండురోజులూ నిత్యానందులవారి శుశ్రూషచేసి సరవయ్య ఆత్మవిముక్తిని ప్రసాదించే, చిదంబర రహస్యాలన్నీ, తెలుసుకొన్నాడు. గురూజీ వెళ్లిందగ్గిర్నుంచీ తన సాధనలో మునిగిపోయాడు. ముంచుకు వస్తోన్న ఆర్థిక ఇబ్బందులూ, నిత్యం పెళ్లాంపోరూ, పిల్లాడి ఏడుపూ—అంతా మాయ - తన తపోభంగానికి మాయకల్పిస్తోన్న కుట్ర! ఈ మాయను చీల్చుకొని తను బయటపడాలి!

## 3

సరవయ్య ఇల్లు వదలి పారిపోయాడన్న వార్త చలికాలం తెల్లవారుఝాము పొగమంచులా ఊరంతా పాకిపోయింది! పెళ్ళాం ఆదెమ్మ గుండెలు బాదుకొంటూ నట్టింట్లో కూర్చుని విలపింప సాగింది. ఆదెమ్మ కొడుకు - మూడేళ్ళ పసివాడు-తల్లికంఠం చుట్టేసుకొని గుక్కపెట్టి ఏడుస్తోన్నాడు.

ఆదెమ్మకు అయిన వాళ్ళు, కాని వాళ్లూ ఇరుగూ పొరుగూ, ఆదెమ్మ చుట్టూ చేరి తమకు చేతనయినమాటల్తో వోదారుస్తున్నారు.

'ఊరుకో అమ్మాయ్! ఎక్కడికి పోతాళ్ళే! వారం తిరిగే లోపల వస్తాడో లేదో చూడు!' అన్నాడు శీనయ్య; ఆ గ్రామానికే 'తల' అనుకోదగ్గమనిషి కాబట్టి, లేచిపోయిన సరవయ్య తిరిగి వస్తాడనే నమ్మకం తనకు లేకపోయినా, శీనయ్య ఆదెమ్మకు ధైర్యాన్ని చెప్పడం తన బాధ్యతగా ఎంచి అన్నాడు.

'ఏమోబాబాయ్! ఆ మనిషిది వట్టి మొండిపట్టుదల! వెనకా ముందు చూడరు! ఏదనుకుంటే అదిచేసి తీరతారు!' పవిట చెంగుతో ముక్కులు చీదేసుకొని, కళ్ళు తుడుచుకొంటూ అన్నది ఆదెమ్మ.

'అదేం మాటలే అమ్మాయ్! ఏదో కోపతాపంలో వెళ్ళిపోయిన మనిషి మళ్లీ రాకుండా వుంటాడా?' అన్నాడు శీనయ్య.

'ఏమో? నా కర్మ ఎలా వుందో? ఇక నాకు దిక్కెవరు బాబాయ్!' అంటూ ఆదెమ్మ పెద్ద పెట్టున ఏడవ సాగింది.

'అదేవిటాదెమ్మా! ఇది ఊరనుకొన్నావా కాదనుకొన్నావా? మేమంతా లేమూ?' పొదుగుతోన్న కోడిపెట్టలా నేలకు కరచుకుని కూర్చున్న ఆదెమ్మను కంటితో చూస్తో అన్నాడు చంద్రయ్య.

'మీబోటివాళ్ళే నాకు దిక్కు మరి! చంద్రయ్యన్నా!' చంద్రయ్యకేసి బాణం గుచ్చిన లేడిలా - జాలిగా చూస్తో అన్నది ఆదెమ్మ.

ఆదెమ్మ మొదటి మాటకు చంద్రయ్యలో ఉబికిన సంతోషం, రెండో మాట వింటూనే నీరయిపోయింది. ఎన్నడూ లేనిది ఇప్పుడు తన్ను 'అన్నా!' అని సంబోధించుతుందేమిటి? చంద్రయ్యన్నా అట! చంద్రయ్యన్న! వెధవ వరస! బోడివరస! చంద్రయ్య మామా అని పిలిస్తే దానినోటి ముత్యాలు రాలతాయా ఏం? ఇంత గడుసుది గాబట్టే మొగుడు తట్టుకోలేక పారిపోయాడు. అసలు ఆ సరవాయిగాడేం కాపరం చేస్తాడట? ఎప్పుడూ, సత్తూ చిత్తూ అంటూ బెమ్మంగారి ఏదాంతం మాట్టాడే సన్నాసికి ఆదెమ్మ లాంటి రవుజయిన ఆడదెందుకంట! నాకు తెలవ కడుగుతా గాని---

'చంద్రయ్యన్నా' అన్న ఆదెమ్మ సంబోధన చంద్రయ్యకు గూబమీద రాయి పెట్టి గుద్దినట్టు కాగా, అంతరాత్మలో ఆదెమ్మ స్థితికి అవగింజంత ఆనందపడి, గుప్పెట్లోవున్న బావుటా బీడీదమ్ములాగి గుప్పు గుప్పున పొగవదలుతూ---

'నేను వస్తాన్లే ఆదెమ్మా! భయపడమాక! వేళయింది; పొలం పోవాలి! ఏవన్నా అవసరమొస్తే నాకు కబురు చెయ్యి! ఆఁ. వస్తానయ్యా శీనయ్యా!' అంటూ చంద్రయ్య ఆదెమ్మ కేసి చూసి వెళ్ళిపోయాడు. చంద్రయ్య నిష్క్రమణ చాలామందికి-ముఖ్యంగా వెంకటేశ్వర్లుకి గుండెలమీద బరువు తీసినట్టయింది. వెంకటేశ్వర్లుకు చంద్రయ్యంటే చావుభయం! వాడెన్ని సార్లో తనమీదకు కోడిపుంజులాగా ఎగబడ్డాడు మరి?

'అదెమ్మా! వాడొట్టి లుచ్చాగానీ వాడిమాట నమ్మబాక! వాడ్ని చేరనిచ్చావంటే నీ కొంపారుస్తాడు!'' అక్కడికి తనొక్కడే ఆదెమ్మను ఉద్ధరించేవాడిలా ముఖం పెట్టి అన్నాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు మాటలు ఆదెమ్మను భవిష్యత్తులోకి నెట్టాయి. భవిష్యత్తుని గురించి వూహలు ఆమె మెదడులో పాముల్లా పాకగా ఆదెమ్మ గుండెలు గజగజా వణికి పోయాయి.

తను మూడేళ్ల పనికందుతో క్రూరమైన, కఠినమైన లోకంలో ఎలా బతగ్గలదు! ఉన్న ఆస్తి అంతా ఆర్పి మరీ పోయాడు తన మగవాడు. గౌరవంగా బతికిన కుటుంబం. తనకా పనీపాటా చేతగాదు. ఇల్లుకూడా తాకట్టులోవుంది. మరి తను ఎలా బతకాలి? ఎంత నిర్దయుడు? తనకూ, తన బిడ్డకూ ఎంత అన్యాయం చేశాడు? ఆ ముసలిగోసాయి ముండాకొడుకు వచ్చి వెళ్ళిం దగ

ర్నుంచీ ఆ మనిషి పూర్తిగా మారిపోయాడు. అయినా ఇంత ఘోరం చేస్తాడని తానెప్పుడూ తలచలేదు. ఇంత పని చేసిపోయినవాడు మళ్ళీ తిరిగి వస్తాడంటే తనకు నమ్మకం లేదు. భగవంతుడా ఇంకేం దారి? ఏది దిక్కు - ఆదెమ్మ భవిష్యత్తుని తలచుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తో కూర్చున్నది.

అన్నపువేళ అయేసరికి ఆదెమ్మను వోదార్చడానికి వచ్చిన పెద్ద మనుషులంతా లేచి ఎవరిదారిని వాళ్లు వెళ్లిపోయారు. బావురుమంటూన్న ఇల్లు చూసుకొని ఆదెమ్మ కుమిలికుమిలి ఏడ్చింది.

## 4

ఏడు సంవత్సరాలు గడిచి పోయాయి దిగ్మండలంలో భూమి సూర్యుని చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేసింది.

సరవయ్య—క్షమించాలి— సదానందుల వారు పరబ్రహ్మ స్వరూపాన్ని వెదుకుతూ, ఏడు సంవత్సరాలపాటు కర్మభూమి-భారత దేశం, అంతా కలయ తిరిగి గాలించారు. పవిత్ర నదీ నదాల్లో మునిగి పాప ప్రక్షాళన చేసుకొని, పుణ్య క్షేత్రాల్ని దర్శించి పుణ్యాన్ని మూట కట్టుకొని సరవయ్య నిజంగా పునర్జన్మ ఎత్తాడు! దేశం నాలుగు చెరగులా వున్న ఆశ్రమాల్ని సందర్శించి, అనేక మంది మహాఋషుల బోధనలు విని, వేదాంత చర్చలు జరిపాడు. అనంతమైన ఆధ్యాత్మిక సంపదన సముపార్జించి సరవయ్య, సదానందుల వారిగా రూపొందాడు. ఎన్నో వేదాంత సభలలో పాల్గొని ప్రతిపక్షులను చిత్తు చిత్తుగా ఓడించి సదానందులు తన గురువులైన నిత్యానందుల వారి పేరు నిలబెట్టాడు. అనతి కాలంలోనే సదానందులు, ఉరఫ్ సరవయ్యను జగద్గురువులైన నిత్యానందులు మహాఋషుల కోవలోకి చేర్చారు. మహాఋషి అయిన సదానందులు జగద్గురువుల అనుమతి పొంది ఆశ్రమాన్ని వదిలి స్వయంగా దేశ సంచారానికి బయలు దేరారు. పోయిన చోటల్లా అజ్ఞానంలో మునిగి దారీ తెన్నూ గానక విల విల కొట్టుకుంటూన్న మూఢులకు జ్ఞానబోధ చేశారు. సత్తూ, చిత్తూ, ఆత్మ-పరమాత్మ-బ్రహ్మం, పరబ్రహ్మ పదార్థాల్ను గురించి అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు విపులీకరించి సదానందులు చెప్తూంటే, శ్రోతలు అమాంతం తమ ఆత్మ ఎగిరి ఆ బ్రహ్మ పదార్థంలో ఐక్యమయిపోతూన్నట్టే భావించే వాళ్ళు.

సదానందుల దేశాటనంలో ఒకానొక చోట సత్తెయ్య అనే యువకుడు సదానందుల తత్వ బోధకు వళ్ళు మరిచి, తన్మయుడై సదానందుల కాళ్ళమీద పడి తమ శిష్య పరమాణువుగా అంగీకరించమని ప్రాధేయ పడ్డాడు. సదానందులు మందహాస వదనంతో సత్తెయ్యను శిష్యుడుగా అంగీకరించారు. సత్తెయ్య నిండు యవ్వనంలోవున్న పెళ్ళాన్ని వదిలేసి పచ్చని సంసారంలో నిప్పులు చెదజల్లి సదానందుల వారికి శుశ్రూష చేస్తూ, గురువులతోపాటు దేశాటనకు బయలు దేరాడు.

సదానందుడు శిష్య సమేతుడై, కాశీ, ప్రయాగ, త్రివేణి సందర్శించి, బదరీ నారాయణం చేరాడు. బదరీనారాయణ సందర్శనానంతరం హిమాలయ ప్రాంతంలో కొంత కాలం గడిపి, ఉత్తర

దేశ యాత్ర ముగించుకొని సదానందులు శిష్యుణ్ని వెంటపెట్టుకొని దక్షిణాదికి బయలుదేరాడు.

చలీ, వానా, ఎండలకు గురు శిష్యుల శరీరాలు చెట్టు బెరడులా తయారయి నాయి గాని, హిమాలయ ప్రాంతంలో ఎన్నాళ్ళు తపస్సుచేసి గాలించినా పర బ్రహ్మ పదార్థం అంతు చిక్కలేదు. ఆ హిమాలయ ప్రాంతంలోనే తను సిద్ధి పొందుతానని, కపాలమోక్షం జరిగి ఆత్మ పరమాత్మలో ఐక్యమవుతుందనీ, తల పోశారు సదానందులు. కాని అందుకు భిన్నంగా జరిగింది. తన కింకా ఆ సర్వే శ్వరుని-ఆ కైలాస నాథుని కృప కలగ లేదని తలచి సదానందులు శిష్యుడు సత్తెయ్య వెంట రాగా బైరాగి టిక్కెట్టు మీద దక్షిణాది దేశానికి బయలుదేరాడు.

మూడవ రోజు కను చీకటి పడుతూం డగా టికెట్ కలెక్టరు గురు శిష్యుల్ని బలవంతంగా రైల్లోనుంచి ఒక స్టేషన్‌లో దించి వేశాడు. తమ ప్రయాణంలో ఎన్నోసార్లు టికెట్ కలెక్టర్లు పట్టుకోవ డం, వదిలేయడం, రైల్లో నుంచి దించ డం మళ్లీ ఎక్కడం జరిగింది; కాని యీ టికెట్ కలెక్టరు కఠినాత్ముడిలావున్నాడు. బండి స్టేషన్ వదిలి వెళ్ళి పోయే దాకా వాళ్లను ప్లాట్‌ఫారం మీద నుంచి అడుగు కదలనీయకుండా నుంచో పెట్టాడు. వాడు అంతటితో నైనా వదిలాడా?

'అరే! సాధూజీ? ఎక్కణ్నుంచీ ప్రయాణం?' అన్నాడు టికెట్ కలక్టరు.

'హం! హిమాలయాసే ఆరహాఁహై' అన్నాడు శిష్యుడు ఒక్క బిగువున; ఎవ రేమడిగినా ముందా మాట చెప్పడం అలవాటు చేసుకొన్నాడు శిష్యుడు.

సదానందులు మౌనంగా నిలబడ్డారు. బొత్తిగా ఆధ్యాత్మిక చింతనా, పాప భీతిలేని టికెట్ కలెక్టరు బైరాగుల దగ్గర ఏమున్నా రాల్తుందేమోనని ఒక్క అర గంటసేపు స్టేషన్‌లో కూర్చోబెట్టాడు.

'ఏమిటోయ్! వాళ్ళ దగ్గర నీకు రాలేది బూడిద! వదిలెయ్!' అంటూ స్టేషన్ మాష్టరు వచ్చాడు.

'ముచ్చు ముండా కొడుకులు! దమ్మిడీ కనపడనిస్తారా? వాళ్ళ దగ్గర చాలా వుంటుంది! ఊఁ! ఫోండి!బయటకు. మళ్ళీ స్టేషనులో కనిపించారా కాళ్ళిరగ్గొ ట్టాను!' అన్నాడు టికెట్ కలక్టరు.

గురు శిష్యులు తాపీగా, నిర్లిప్తంగా బయటికి నడిచారు. ఇల్లాంటి వెంగళా యుల్ని ఎంతమందిని చూడలేదు గనుక? వాడా తమ్ము హడల గొట్టేది? తమ దగ్గర రైల్వే మినిష్టరొచ్చినా కానీ వసూలు చేయలేడు! నిజం చెప్పొద్దూ —శిష్యుడికి కొంత గర్వంగాకూడా వుంది. తమ దగ్గర కొద్దో గొప్పో వుం దనుకో! అయినా లేనట్టు ఎలా తలా యించ గలిగేమో చూడు అన్నట్టు ముఖంపెట్టి గురువుగారికేసి చూశాడు.

మొల పంచె—కాషాయ గుడ్డలో మెలకలు తిప్పి దాచిన చిల్లర డబ్బులు తీసి శిష్యుడు, మిఠాయి, పళ్ళూ, యింత గంజాయీ కొనుక్కొచ్చాడు. ఊర్లో అటూ యిటూతిరిగి తొమ్మిది పదిగంటల ప్రాంతంలో ఒక సత్రం చేరుకొన్నారు గురుశిష్యులు కాని; సత్రం వరండా, అరుగులూ జనంతో నిండిపోయి వుంది,

సత్రవుకు ఎదురుగా వున్న ఇళ్ళ వరుసలో, ఒక ఇంటి బయటి గుమ్మానికి ఇరు వైపులా పెద్ద పెద్ద అరుగులు ఖాళీగా వుండటం చూసి ఇద్దరూ అక్కడికి చేరారు. మిఠాయీ పళ్ళూ ఆరగించి గురు శిష్యులు గంజాయి దమ్ము పట్టిస్తూ చేరాక అరుగుమీద బిచాణా వేశారు. అరుగుల కిందగా మురికి కాలవలో నీళ్ళు బుడ బుడ శబ్దం చేస్తూ పోతున్నాయి. దోమలు సంగీతం పాడుతూ తూముల్లోంచి ఝుయ్యిన బయటికి వొస్తోన్నాయి. వీధంతా నిశ్శబ్దంగా నిర్మానుష్యంగా వుంది. సత్రవులో పడుకొన్న జనం గుర్రు కొట్టి నిద్ర పోతున్నారు. గతుకుల రోడ్డుమీద వుండి వుండి ఒక రిక్షా ఊగిసలాడుతూ పోతూన్నది. రిక్షా ఆగిన చోట వీధి వాకిలి తెరిచిన చప్పుడూ, అంతలోనే మళ్ళీ మూసిన చప్పుడూ వినపడుతోంది.

దూరంగావున్న మునిసిపాలిటీ లాంతరు స్తంభం వెలుగు చీకటిని చీల్చుకొని మందంగా తేలి తేలి పోతూ రోడ్డు మీద పడుతోంది.

'గురూజీ!' అన్నాడు శిష్యుడు.

'ఏమిటి సందేహం సత్తెయ్యా!' అన్నాడు సదానందులు, గంజాయి దమ్ము పట్టిన పొగను వదుల్తూ పొదలావున్న గడ్డాన్ని నిమురుకుంటూ.

'ఆత్మకు విముక్తి ఎప్పుడో స్వామీ?'

'మాయ తెరను ఛేదించగలిగి నప్పుడే సత్తెయ్యా!'

'గురూజీ! అందరిలోవున్న ఆత్మ స్వరూప మొకటేనా?'

'సమస్తజీవకోటిలో ఉన్న ఆత్మలన్నీ ఆపరమాత్మ స్వరూపాలే! మళ్లీ అవి ఆ పరమాత్మను చేరుకోవాలనే ప్రయత్నం చేస్తూంటవి. కాని తరచు మాయా ప్రభావంవల్ల దారితప్పుతూ వుంటాయి.'

'అయితే స్వామీ! మీలో వున్నదీ, నాలో వున్నదీ ఆ దోమలో వున్నదీ ఒకటేనా?'

'నిస్సందేహంగా...' తెరుచుకొన్న వీధి వాకిలి శబ్దానికి సదానందుల మాట మధ్యలోనే ఆగి పోయింది.

తలుపు వోరాకలిగా తీసి ఒక స్త్రీ మండిగం మీద కాలుమోపి తల బయటకు పెట్టి, వాకిలికి పక్కగా అరుగుల మీద పడుకొన్న గురు శిష్యుల్ని చూసి ఒక్కడుగు వెనక్కువేసి—

'ఎవరయ్యా మీరు?' అన్నది.

ఆమె మృదు మధుర కంఠస్వరం, సదానందుల హృదయంలో ఎండి పోయి బీటలు వేసిన భూమిలో ప్రవహించే నీళ్ళ సవ్వడిలా వినిపించి పులకరింప చేసింది.

అంతలోనే సదానందులు నిలతొక్కుని తనలో గలిగిన వికారానికి తనే సిగ్గుపడ్డాడు. సర్వ సంగ పరిత్యాగంచేసి మహాఋషుల అంతస్తును చేరగలిగిన తను ఒక ఆడదాన్ని చూసి చలించడమా? హాతోస్మి!

—అనుకొంటూ సదానందులు తన నిర్వికారతను తెలియజేయ గలందులకా అన్నట్టు తల ఎత్తైనా ఆమె వైపు చూడకుండా నిగడ తీసుకొని పడుకొన్నాడు.

'ఎవరయ్యా మీరంటే మాట్లాడరేం?' విసురుగా అన్నది ఆమె.

'మేం బైరాగులంతే అమ్మా!' శిష్యుడు సత్తెయ్య చెప్పాడు.

'ఐతే ఇక్కడేం పని! లేలెండి!' విదిలించుతూ అన్నది ఆమె.

చేయాలని శపథంచేశాను. నేను పెద్ద దాన్నయాక అతను నన్నే పెళ్ళాడాలి. ప్రపంచంలో వేరెవ్వరినీ నేను పెళ్ళాడలేను; ఈ విధంగా ప్రేమించ గలగటం అసంభవం.

'వివాహం ఇంకా పదిరోజులు వుందనగా, ఒక నాటిరాత్రి ఇంటిముందు అతనితో నీవు వెన్నెల్లో పచార్లు చేస్తున్నావు...దూరంగావున్న పైన్ చెట్టు కింద అతను నిన్ను తన చేతుల్లోకి లాక్కున్నాడు. నీవు అదంతా మరిచి పోలేదనుకుంటాను. ఆ సంఘటన అయాక, నీవు వెలవెలబోతూ గదిలోకి వొచ్చావు; నేను చాటుగా అంతా చూస్తూనే వున్నాను. నేను కోపంతో వొణికి పోతున్నాను. ఆ కోపజ్వాలలో మీరిద్దరూ మసికావలసింది. నిన్ను కానీ, వేరెవ్వరిని కానీ అతను వివాహమాడరాదని నేను శపథంచేశాను. అతను నన్ను తప్ప ఇంకెవర్ని వివాహమాడినా, భరించలేను...కాని యీ క్షణంలో అతనంటే నాకు పరమ అసహ్యం కలిగింది.

'నేనేం చేశానో నీకు తెలుసా? విను! తోటమాలి పిచ్చికుక్కల్ని చంపేందుకు మాంసంలో విషం కలపటం చూశాను. ఒక గాజుసీసాను మెత్తగానూరి, ఆ పొడిని మాంసంలో కలుపుతున్నాడు. యీ విధానం నాకు బాగా నచ్చింది. ఒక సీసాను పగలగొట్టి మెత్తగా నూరి వుంచాను. ఆ పొట్లం విప్పితే ఆ గాజుపొడి తళతళా మెరిసేది. మర్నాడు నీవు కేకుల్ని చేశాక, వాటిని జాగర్తగా కత్తితో చీల్చి యీ గాజుపొడివేసి, మళ్ళీ అతికించాను. అతను మూడు కేకుల్ని తిన్నాడు. నేను ఒకటి తిన్నాను. ఇంకా మిగిలిన ఆరింటినీ కొలనులో పారేశాను. మూడురోజులు తర్వాత, కొలనులో యీదే రెండు బాతులూ చచ్చినవి...

'ఇదంతా నీకు జ్ఞాపకమే ననుకుంటాను. నీవు మాట్లాడవొద్దు...నన్ను చెప్పనీ; ఆ కేకుల్ని తిన్నవాళ్ళందరూ చచ్చారు; నేనుమాత్రం చావలేదు. బహుశా మోతాదుసరిపోయివుండదు. ఆనాటినుంచే నా ఆరోగ్యం చెడింది.

బ్రిటన్‌లోని ఆరోగ్య శాఖాధికారులు, భోజనంచేసే పాత్రసామాగ్రుల్లోనూ, ఆహార పదార్థాలు నిలవ చేసే పాత్రల్లోనూ కలిపే సీసం పాలు చాలా భాగం తగ్గించాలనే సూచనను చేశారు; యీ సీసంవల్ల ఆరోగ్యం చెడటం చాలా ఎక్కువగా గమనించబడింది.

సీసంవల్ల కలిగే భౌతికలాభాలు ఏమీలేవు. కాని దీనివల్ల శరీరంలోని రక్తం క్రమంగా విషతుల్యం కాగల అపాయంవుంది. చిన్న మోతాదుల్లో, కొంతకాలంగా ఇది ఆరోగ్యాన్ని భంగపరచగలదు. మరీ ముద్రణాలయాల్లోని కంపోజిటర్లు పైపుల్ని నోట్లోపెట్టుకొనే దురలవాటువుంది. ఇందువల్ల వారిరక్తం 'లెడ్ పాయిజన్'కు గురవవొచ్చు. వారీ దురలవాటును వొదిలించుకోవటం అత్యవసరం.

చచ్చిన హెన్రీ విషయం కాదు...కాని ఆనాటినుంచీ పిశాచునివలె నన్ను అతను వెన్నాడుతూనే వున్నాడు.

'అంతే — ఆనాటినుంచీ జీవితం దుర్భరమైంది. జీవితంలో నిన్ను విడనాడ దలచలేదు. యీ సంగతులన్నీ మృత్యుముఖంలో నీకు చెపుదామనుకున్నాను. నా మనస్సులో యీ దుర్మార్గమంతా కరుడుకట్టి నన్ను జీవితమంతా బాధిస్తూనేవుంది. అక్కా! అది ఎంత ఘోరమో, ఎంత విషాదమో, ఎంత బాధో చెప్పలేను.

మేల్కొనివున్న ప్రతినిమిషంలోనూ చావబోయ్యే ముందు నీకీ సంగతులన్నీ చెప్పాలనే మాట జ్ఞాపకం చేసుకుంటూ వుండేదాన్ని. చాలాకాలంగా వేచి కూర్చొన్న ఆ సమయం ఇప్పటికి వొచ్చింది ... ఇప్పుడు నా హృదయం తేలికయింది...అక్కా! మాట్లాడకు. నేను నైతికంగా భయపడిపొయ్యాను ...చనిపొయ్యాక అతన్ని చూడటం తటస్థ పడుతుందనుకో...అతన్ని చూడగలగటం అంటే—దాన్ని నీవు వూహించుకోగలవా? నాకు అతన్ని చూసేందుకు ముఖం చెల్లదు; నాకు ధైర్యంలేదు కూడాను!...ఏమైతేనేం అతన్ని చూడక తప్పదనుకుంటాను... నేను చనిపోబోతున్నాను. అక్కా! నాకు క్షమాభిక్ష ఇవ్వు. నీ క్షమలేనిదే నేను అతన్ని చూడలేను...ఫాదర్! మా అక్కచేత నాకు క్షమ ఇప్పించమని వేడుకుంటున్నాను. ఆమె క్షమించనిదే నేను చావలేను!"

భరించలేని నిశ్శబ్దం గదిని ఆవరించింది. మార్గరెట్ వూపిరికోసం పెనుగులాడుతూ, దుప్పటిని మెలిపెడుతోంది.


సుజన్నీ తన ముఖాన్ని అరచేతుల్లో దాచుకొని కదలక మెదలక ఉండిపోయింది. ఎన్నో సంవత్సరాలు తన స్వప్నసుందరిని ప్రేమలో దొర్లి ఉండవలసింది; ఆ వివాహమే ఐనట్లయితే తనెంత సుఖపడి ఉండేది! జ్ఞాపకం వుంచుకోలేని గతించిన- ఆ రోజుల్ని ఆమె గుర్తుతెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. జరిగిపోయిన కాలంలోకి ఆమె మనస్సు వేగంతో వెనక్కు పరుగెత్తుతోంది...అతనినుంచి ఆమె పొందిన ఆముద్దు! ఆ ఒక్కముద్దు తాలూకు మాధుర్యమే ఇన్నేళ్లపాటూ తనను బతికించగలిగింది! దాని తాలూకు జ్ఞాపకాన్నే ఆమె హృదయాంతరాళంలో దాచుకొంది...ఆతరువాత- ఏం లేదు- మరెన్నడూ-ఏమీలేదు- అంతే!

మతబోధకుడు లేచి నిలబడి, ఆజ్ఞాపూరిత స్వరంతో 'సుజన్నీ! నీ చెల్లెలు చావబోతోంది' అన్నాడు.

సుజన్నీ కన్నీటితో తడిసిన తన ముఖంనుంచి చేతుల్ని తీసేసింది. చెల్లెల్ని ఆదరణతో, అభిమానంతో, అనురాగంతో కావలించుకొని ముద్దుపెట్టుకుంది.

'తల్లీ! నిన్ను క్షమించాను; హృదయపూర్వకంగా క్షమిస్తున్నాను' అందా అక్క!

★




[ఈ శీర్షికలో ప్రచురించబడిన లేఖలకు ఈ కింది విధంగా బహుమతులు ఇవ్వబడినవి.

మొదటి బహుమానం: రు. 15–0–0 పి. కృష్ణమూర్తి, మద్రాసు, 24.

రెండవ బహుమానం: రు. 10–0–0 నాయుడు సీతాదేవి, కాకినాడ.

మూడవ బహుమానం: రు. 5–0–0 కె. అనసూయమ్మ, టంగుటూరు.

బహుమతుల మొత్తాలు అక్టోబర్ మొదటివారంలో పంపబడుతవి.]

## 14

ఒకప్పుడు నాకూ ఇలాటి సమస్య ఎదురైంది. నా భర్త మేనమామ కొడుకే కావటంవల్ల, మా మధ్య అరమరికలు లేవు. యీ సమస్యనుగూర్చి అప్పట్లో దీర్ఘంగా ఆలోచించి, మా వారితో ఇలా అన్నాను:

"నా స్నేహితురాలు విశాలాక్షి సంగతి- పాపం ఆమె చాలా గాభరాపడి పోతూవుంది. ఆమెభర్త స్నేహితుడు ఆమె భర్త లేనపుడు, లేడనే సంగతి తెలిసికూడా తెలియని వానిమాదిరి ఇంటికివచ్చి లోకాభిరామాయణం మాట్లాడుతూ ఆమె భర్తసంగతి- అతని వ్యభిచారం సంగతి- తన సంగతి, తనను ఇతర స్త్రీలు ప్రేమించే సంగతి-ఇలాగే ఏమిటేమిటో వాగుతూ వుంటాడట. ఆమె భర్తతో చెప్పటానికి ధైర్యంలేక అతన్ని ఏమీ అనలేక తికమకపడుతూ నాతో చెప్పి ఈ పీడ వదలించుకునే మార్గం చెప్పమంది. దీనికి మీరేమైనా మార్గంచెప్పి ఆమెను కాపాడండి" అన్నాను.

ఈ మాటలు మావారితో చెప్పేసరికి నాకు ముచ్చెమటలుపోసినాయి. గొంతు బొంగురుపోయింది. గుండె దడ దడ లాడింది. పెదిమలు వొణకిపోయినాయి. ఎలాగైతే నేం చెప్పినాను. నేనీమాటలు చెప్పింతర్వాత దీనంగా మావారి ముఖం చూచాను. వారిముఖంలో కూడా కాంతిలేదు. వారిలో చాలా మార్పు వచ్చింది. ఈ సమస్య నా స్నేహితురాలిది గాదనీ- నాదేననీ నన్ను పీడిస్తుందే సమస్యేననీ మావారు గ్రహించారు. వారు గ్రహించారని నేను తెలుసుకున్నాను. ఈ సంగతిలోని వాస్తవికతను వారు తెలుసుకున్నారని నేను గ్రహించిన సంగతిగూడా వారు

గ్రహించినట్లు నేను తెలుసుకోగల్గివాను. కానీ బాహాటంగా ఎవరమూ బయటపెట్టలేదు.

రెండు నిముషాలాగి సారంలేని 'ఒక నవ్వు నవ్వి వారిలా అన్నారు. ''పాపం నీ స్నేహితురాలికి మంచి భూతమే పట్టుకునిందే- పోనిలే-మంచి పనిచేసింది- ఆమె భర్తతో చెప్పటానికి ముందే నీ సలహా కోరింది. ఇలాంటి విషయాలు త్వరపడి ముందే భర్తతో చెబితే ఆవేశపూరితుడౌతాడు. ఆ ఆవేశం ఎలా తిరిగినా తిరుగొచ్చు. ఇందుకు మార్గం ఒకటే—భర్తకు చెప్పటానికి ముందు-ఏకాంతంగా, వచ్చే స్నేహితునితోనే సూటిగా రావద్దని వచ్చి చెప్పటం మంచిది-అవసరమైతే శీల రక్షణకు - అపార్థాలకు అవకాశం లేకుండా ఉండటానికి కొన్ని అసత్యాలనుగూడా సృష్టించి అతని ఏకాంతపు రాకపోకలను ఆపివెయ్యాలి - ఏమౌతుందిలే అని, ఏమౌతుంగో చూద్దాంలే అని—బాగా రెచ్చగొట్టి బుద్ధి జెప్ప

73 సం॥ల వయసున్న ఒక దర్జీవాడు రకరకాల జబ్బులతోనూ బాధపడి వాషింగ్‌టన్‌లో మరణించాడు. ఇతనిపట్ల జరిగిన శస్త్రచికిత్సలో అతని శరీరంలోని వివిధ భాగాల్లో 20 ఉక్కుసూదులు కనిపించినవి. అవన్నీ తుప్పుపట్టి కండరాల్లో ఇరుక్కొని పోయినవి. పని చేసేప్పుడు సూదిని నోట్లో పెట్టుకోవటం, ప్రమాదవశాత్తూ అది కడుపులోకి జారటం జరిగి ఉండాలి.

మన స్త్రీలకు ఒక దురలవాటు కలకాలంగా వుంది. బట్టకుడుతూనో, పూలుగుచ్చుకుంటూనో, సూదిని నోట్లో పెట్టుకోవటం; ఇందువల్ల పొరపాటున అది కడుపులోకి జారిందంటే ఎంతైనా ప్రమాదం. స్త్రీలు తీసుకోవల్సిన మరో జాగ్రతేమంటే, అల్లిక పనిచేసే సూదులవిషయం; యీ సూదులు చివర్లలో కొంకి తిరిగిఉంటవి. పనిచేస్తూ చేస్తూ అది అక్కడపారేసి వెళ్ళిరావటంవల్ల, పొరపాటున ఆమె కానీ, కుటుంబంలోని ఇతరులుకానీ దానిమీద కాలువేయటం అదిగుచ్చుకోవటం జరుగుతుంది. మామూలు సూది ఐతే, లాగెయ్యవొచ్చు. కాని యీ సూదిగుచ్చుకుంటే అది కండరంలోకిదిగి, కొంకి పట్టుకుంటుంది. ఎటు కదిల్చినా చాలాబాధ. చివరకు శస్త్రవైద్యుని అవసరంతప్పదు. అందుకనే యీ అల్లికసూదులకు కేసు ఏర్పాటుచేయబడింది. పనితీరగానే దాన్ని కేసులో పెట్టెయ్యటం మంచిది. నిత్యజీవితంలో యీ జాగ్రతలు తీసుకోవటం చాలా అవసరం. పోతే, ఆ సూదులకు తుప్పువుంటే ఒక ప్రాణగండమే సంభవించవొచ్చు!

వచ్చునని ఏమేమో యుక్తులు చేయబోతే చల్లగా వలలో పడటంకూడా సంభవించొచ్చు!' అన్నారు.

సూటిగా ఎలా చెప్పాల్నంటూ బొంగురు ధ్వనితో తిరుగా ప్రశ్నించాను. దాంతో వారిలా అన్నారు. "మీరు ఏకాంతంగా నాతో మాట్లాడం-పైగా ఊళ్లో యువతీయువకుల ప్రేమ కలాపాలు చెప్పటం ఇకేమంత సబబుగా వుండటం లేదు. స్త్రీ పురుషులు ఒకచోట చేరితే అన్యులు అపార్థాలు పడటానికి ఎక్కువ అవకాశాలున్నాయి. మనం ఇలా మాట్లాడుకుంటూ వుంటే, స్నేహితుని యందు భార్యయందు విశ్వాసంగల మా వారు యేమీ అనుకోకపోవచ్చు. కానీ పొరుగింటి వారు, మన ఇంటిలోని పని మనుషులు మనల చులకనగా చూస్తారు. వాళ్లవాళ్ల స్నేహితులవద్ద ఉన్నవి లేనివి కల్పించి తాటాకులు కడతారు. అందుకని మన స్నేహితం పవిత్రంగా చిరకాలం వుండాలంటే మా వారున్నప్పుడే వస్తూవుండండి. అలా చేయకపోయారంటే అందరం బాధపడాల్సి వస్తుంది" అని చల్లగా మెల్లిగా చెప్పి సాగనంపడం మంచిది. అప్పుడాతడు ఆమె భావాన్ని స్పష్టంగా తెలుసుకోగల్గుతాడు. ఇక ఏకాంతంగా రాడు. వచ్చినాగానీ మర్యాదగా మసలుకుంటాడు." అని అన్నారు. దాంతో నా దడ దడ కాస్త తగ్గిందేమో మరొక ప్రశ్న వేశాను. "సరే, ఒక వేళ అతడంతటితో ఆగక తిరుగా తన పాతపాటే పాడితేనో?" అన్నాను.

'అలాంటప్పుడు మరికొంత కఠినంగా చెప్పవలసివస్తుంది. అసలు చదువు సభ్యత లేని ఆడవాళ్లయితే చీపురుతో ఝాడించినట్లు ఝాడిస్తారు. సభ్యతా ప్రపంచంలోనివాళ్లే దిక్కుతెలియక తికమకపడుతూవుంటారు. సూటిగా ధైర్యంగా చెప్పే సామర్థ్యం లేకపోతే అతనితో సంభాషణకు అవకాశం ఇవ్వకుండానే తప్పుకోవాలి. ఊకొట్టేవారు, ఎదురుప్రశ్నలు వేసేవారూ

పశువుల్లో కూడా గొడ్రాలితనం వుంది. ఐతే అలాటి పశువులనుంచి పాలు పిండుకోవటం సాధ్యమా? పశువు గర్భంధరించి, యీనెతేనే కాని పాలు రావా? మానవుడు జంతుజాలాన్ని తనకు ఎంతో అనుకూలంగా ఉపయోగించుకోవటంలో అనేక పరిశోధనల్ని చేస్తూనే వున్నాడు.

రతినెరుగని పశువులకూ, ఎన్నాళ్ళకూ కట్టనిపశువులకూ, డైయిథిల్ స్టిల్ బెస్టరాల్ (diethil stilbes toral) అనబడే హార్మోన్లు ఇవ్వటం వల్ల పశువులు పాలివ్వసాగినవి.

థైరాక్సిన్ అనబడే థైరాయిడ్ గ్రంథితాలూకు హార్మోనుల్ని ఇవ్వటంవల్లకూడా పాలు అధికమవసాగినవి. ఇందువల్ల పాలిచ్చే కాలం కాకున్నా, తిరిగి పాలివ్వగలగటం, ఆ పాలలో 20% కొవ్వు పదార్థం ఉండటం గమనించబడింది. యీ పరిశోధనలవల్ల ఉత్తరోత్తరా మానవులు పశువులనుంచి తమకు కావలసినన్ని పాలు పిండుకోగలుగుతారు.

వున్నప్పుడేగా సంభాషణలు సాగిపోతూండేది? అసలు నీ స్నేహితురాలు సంభాషణకు అవకాశమే యివ్వకపోతే అతడెలా సంభాషణల పెంచగల్గుతాడు? అందుకని అతడొచ్చేవేళకు లేనిపోని పనులు కల్పించుకొని తప్పుకొన తిరగటం మంచిది. తాను బుద్ధిపూర్వకంగా తప్పుకొంటున్నది అతనికి స్పష్టంగా తెలిసిపోవాలి. అలా సాధ్యంగానపుడు ఏమైనాకానీ అతనితో విషయం స్పష్టంగా చెప్పివేయాల్సిందే- ఈలాంటి ఏకాంత సంభాషణలు ఇరు పక్షాల వారికీ అపాయకరమేనని నచ్చచెప్పి అతని మనస్సు మార్చాలి. తన ప్రయత్నంలో ఆ స్నేహితుడు వదలక ఇంకా సాహసించి ఏ బలాత్కారానికైనా ఒడిగడితే, మెత్తని మాటలకు బదులు ఆడది తిరగబడి చెయ్యిచేసుకోవటం ఉత్తమం. నిజంగా ఆడదానికే కోపంవొస్తే ఆమె పురుషునికన్న తక్కువ బలవంతురాలు కాదని తేలిగ్గా రుజూ చేయగలదు.

యీ జరిగిన పరాభవాన్ని ఎవరితోనూ చెప్పుకోలేదు. అతను బైట పెట్టందే, స్త్రీ బైట పెట్టవలసిన అవసరంలేదు. అంటే ఒక రకమైన ప్రశాంత వాతావరణం దానంతటదే ఏర్పడుతుంది. జ్ఞానోదయమై, పూర్వపు స్నేహాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయ

పసిబిడ్డలకు వాడే పొత్తిగుడ్డల విషయంలో తల్లులు చాలా జాగ్రత్తల్ని వహించాలని యీ మధ్య బ్రిటిష్ మెడికల్ జర్నల్ హెచ్చరించింది. ఉదాహరణకు ఆ మధ్య జరిగిన గొప్ప ప్రమాదం ఇది: పొత్తిగుడ్డలు అంతకుపూర్వంకలరా ఉండల మధ్య ఉన్నవి. (Napthalene Balls) బిడ్డ శరీరానికి నూనెరాచి ఆ గుడ్డల్లో పరుండబెట్టటంవల్ల, బిడ్డవిషప్రయోగాన్ని పొందాడు. ఇదే విధంగా ఉతుకు పడకముందే చాకలి సిరాతో గుర్తులువేసి; దానిమీద పసిపాపల్ని పరుండబెట్టటం వల్లకూడా ప్రమాదాలు జరగొచ్చు.

ఇళ్లలో క్రిములు జేరకుండా ఉపయోగించే క్రిమి సంహారుల విషయంలో జాగ్రత తీసుకోవాలి. ఉదాహరణకు క్రిమిసంహారిని ఇల్లంతా చల్లించామనుకోండి; ఒకమూల వున్న పొత్తిగుడ్డలమీద కూడా అది పడొచ్చు. ఆ గుడ్డల్ని పసిపాపకు ఉపయోగించినట్లయితే ప్రమాదాలు సంభవమౌతవి.

చిన్నపిల్లలకు బోరిక్ ఏసిడ్ పౌడర్ ఉపయోగించటంవల్ల కూడా ప్రమాదం కలగొచ్చు. యీ బోరిక్ ఏసిడ్ రాచాక, బిడ్డ తన శరీరాన్ని పొత్తిగుడ్డలకు వేసి విపరీతంగా రాపిడి చేయటం అందువల్ల యీ పౌడర్ శరీరాన్ని గాయపరచటమో, లేదా శరీరంలోకి ప్రవేశించమో జరగటం కద్దు. మరి పసిపాపలకు బోరిక్ ఏసిడ్ ఉపయోగించకుండటమే మంచిదని వైద్య ప్రముఖులు సలహా చేస్తున్నారు.

ఖ్నం జరుగుతుంది. మొదట్లో చిన్న బోయినా కన్నంలో తేలుకుట్టిన దొంగ వలె తన తప్పిదాన్ని బైటపడనీకుండా పవిత్రమైన స్నేహాన్ని ఉపాసించక మానదు.

'మరోమార్గ మేమంటే తన భర్త గ్రామంలో లేనపుడు రెండుమూడు రోజులకుగానీ తిరిగి రాడని తనకు స్పష్టంగా తెలిసినపుడు ఆతనిని ఏకాంతంగా రమ్మనిచెప్పి గదిలోనికి పంపి తన మామతో గానీ లేక మరుదులతో గానీ అదీ గాకపోతే ఇరుగు పొరుగు ఆడవారిని నలుగురినిచేర్చి సంగతులు సంగ్రహంగా వారితో చెప్పి చక్కగా దేహశుద్ధిగావించి గప్ చుప్ గా బయటికి సాగనంపటం మంచిది. సాధ్యమైనంత వరకు ఇలాంటి విషయాలు భర్త చెవికి పోకుండా ఉండటమే మంచిది. పతనం చెందిన స్త్రీలు తమపతనాన్ని భర్తకు తెలియకుండా ఉండాలని ప్రయత్నాలు చేస్తారు.

మావారు చెప్పిన పద్ధతుల్లో మొదటిదాన్నే అనుసరించాను. అదృష్టవశాత్తూ అది ఫలించింది. నా హృదయాన్ని గ్రహించిన ఆతను నన్ను అపార్థం చేసుకున్నందుకు నొచ్చుకున్నాడు.

ఐతే అందరికీ యీ పద్ధతే సరిపడుతుందనుకోను. అందుకని పైన సూచించిన మార్గాల్లో ఏది అవసరమైతే దాన్నే ప్రయోగించవలసి వుంటుంది.

—శ్రీదేవీ శ్రీకంఠం, బెనారెస్.

## 15

ఈ సమస్యా ఖండన తెలివి తేటల్లో జరగాల్సిందే కాని, దీనికి ఒక నిర్ణీత పద్ధతంటూ చెప్పటం కష్టమే. ఆయా విధానాలు సందర్భాన్నిబట్టీ, సమస్యలోని వ్యక్తుల మనస్తత్వాలూ, తత్వాల్ని అనుసరించీ, సంఘటన జరిగే సమయంలోని మూడ్స్ ను బట్టీ వుండాలి. ఉదాహరణకు 'ఇలా చేయటం మంచిది' అని చెప్పినప్పటికీ, ఆ విధానం ఎంత సకారణ వాదనతో ఉన్నా కూడా, దాన్ని ప్రయోగించేందుకు సరిగ్గా అలాటి సందర్భమే రావటం, లేదా ప్రయోగంలో వ్యక్తుల్లో కలగవలసిన పరిణామాలు వూహించినట్లుగా కాక, వేరొక విధంగా మారటం జరిగిందా మొత్తమంతా తలక్రిందులే అవుతుంది. అందుకని యీ కింద సూచించే విధానాల్లో ఏది ఎన్నుకో దగ్గదనేది, సమస్య నెదుర్కొన్న వ్యక్తి నిర్ణయించుకోవటం, వాతావరణం ఏ విధానానికి అనుకూలంగా వుందో చూసుకొని ప్రయోగించటం అవసరం.

యీ ప్రశ్నపడిన సంచికనే ఆమిత్రునికీ, తన భర్తకూ చూపి, తానే యీ సమస్యా పరిష్కరణ పోటీకి రాయదలిచినట్లూ, అందుకు వారి వారి సలహాల్ని ఇమ్మని అడగటం ఒక మంచి పద్ధతే; కాని ఇది ఇన్ డైరెక్టుగా తన సమస్యయేనని చెప్పకోవటమూతుంది. ఇందులోని పాత్రలలో, ఆ పాత్రలన్నీ చిరపరచితులే కనుక, ఇట్టే గ్రహించగలుగుతారు. పైకి తక్కిన పేనల్లే ఎవరికి వారు వూరుకున్నప్పటికీ, వారి హృదయాల్లో దృశ్యమంతా స్పష్టంగా మెరుస్తూనే వుంటుంది. పోతే ఆమెకు చెప్పేధైర్యం, చెప్పవలసిన పద్ధతీ తెలి

యదు కనుక, అచ్చులోవున్న యీ భాగాన్ని వారి ముందు విసిరెయ్యటం జరిగిందనుకోవాలి. దీనికి ఆమె లిఖిత పూర్వకంగా తన భర్తకు ఛార్జిషీటు పెట్టుకున్నా సరిపోతుందికదా! యీ రెండు పద్ధతులూ దాదాపు ఒక్కటే! పత్రికలోని భాగంవల్ల ఆమె తెరవెనుకనే ఉండిపోగలదనుకోవటం పొరపాటు.

దీని ఫలితాలు ఎలా ఉంటవో తేలిగ్గా గ్రహించవొచ్చు. భర్త, ఏదో గొప్పనేరం తన వీపు వెనుక జరుగుతోందనే కొత్త అనుమానానికి గురవటం, దానిచేత పీడించబడుతూ, పైకి చెప్పుకోలేని స్థితిలో కుంగిపోవటం జరుగుతుంది; పోతే ఆ స్నేహితుడు ఇది తనకు సంబంధించింది కాదనే ధోరణిలోనే (ఎందుకంటే అంతా ఇన్‌డైరక్టుగానే కాని, డైరక్టుగా కాదాయె!) మరీ ముందుకు సాగవొచ్చు; ఒక వేళ ఇది అంతటితో పోక, తమ సంగతి కాదనే ఆత్మద్రోహం జరిగినట్టయితే, ఆ స్నేహితునిమీద యీ అస్త్రం పనిచేయదు. పనిచేయని అస్త్రం వల్ల కీడే కాని, మేలు ఉండదు. కనుక యీ పద్ధతిని వొదులుకోవటం మంచిది.

రంగంలోని వ్యక్తులందరూ సంస్కారులే కావటంవల్ల అనుసరించే పద్ధతులు నాజూగ్గా ఉండటమే మంచిది. మోటు వ్యవహారాలకు దిగినట్లయితే, అది ఒకరికీ ఇంకోరికీమధ్య లేనిపోని ఉద్రేకాల్ని కలిగించి విషాదఫలితాలకు దారితీస్తుంది. అన్నిటినీమించి ఎంతతక్కువ ప్రచారంతో యీ చిక్కును విడదీయటమనేది గమనించదగిన విషయం. అనుసరించేపద్ధతి ఏ కాస్త దారితప్పినా, సమస్య విడివిడినా, లేదా విడిపడకున్నా కొంత గోలకూడా అవుతుంది. కనుక చాలా మెలకువతో ఉండటం అవసరం.

ఐతే యీ సున్నితమైన పద్ధతిఏమిటి? స్వతంత్రంగా మాట్లాడటాన్ని నాగరికత ఒప్పుకుంది; ఒకపక్క ఇప్పుడిప్పుడే సమాజంకూడా కొంతవరకూ భరించగలుగుతోంది. అందుకని దాన్ని కాపాడుకోవటమంటే ఏదో వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటంగా చూడనక్కర్లేదు; తనలాటి స్త్రీల తాలూకు భావస్వాతంత్ర్యాన్ని కాపాడటం కిందినే జమకదా!

అందుకని ఆ స్నేహితుడితో మాట్లాడేప్పుడు 'ఇతరుల విషయాల్ని వారి వెనుక మాట్లాడటం చాలా తప్పు. వారివారి ప్రవర్తనలకు వారే బాధ్యులు కనుక ఆ సంగతులన్నీ వొదిలేద్దాం. మనం యీ విధంగా మాట్లాడుకుంటూన్నప్పుడు, మనను గూర్చికూడా ఇతరులు ఇదేవిధంగా, వారి ఇష్టానుసారం, తమ వూహాకు అందిన విధానంలో, అపోహలతో మిళితమైన అనేక అభిప్రాయాల్ని జారీచేయరని ఏమిటి?'

యీ తర్కాన్ని ఆ స్నేహితుడు ఒప్పుకోక తప్పదు.

'స్త్రీ పురుషులమధ్య స్వాతంత్ర్యం వొచ్చేందుకే కొన్ని శతాబ్దాలకాలం

పట్టింది. ఇంత కష్టపడి సంపాయించుకున్నదాన్ని పోగొట్టుకున్నట్లయితే, తిరిగి సంపాయించటానికి మరికొన్ని శతాబ్దాలు పట్టవొచ్చు. కనుక ఇతరుల అపోహాలకు చోటివ్వకుండా ఉండటం మన కనీస కర్తవ్యం' అన్నట్లయితే, తన ప్రవర్తనకు ఒకరకం ఖండన ఆరంభమైనదని అతను అనుకోక తప్పదు. ఐతే అంత తేలిగ్గా బైటపడేందుకు అతనూ తెలివిగలవాడే ఐవుంటాడు కనుక, ఇతరుల అపార్థాలు ఎందుకు వొస్తయ్యనీ, ఒకవేళ వొచ్చినా విఘ్నాలు లెక్కచేసేదేమిటనీ అనేస్తాడు; యీ తర్కం తనకు అనుకూలంగా తిప్పుకోవాలని అతని ఆశయమై ఉండటంలో ఆశ్చర్యం లేదు.

'మనలాగే సమాజమంతా మారే వరకూ యీ విమర్శలు తప్పవు. వాటికి మన బాధ్యత బొత్తిగా లేదనుకోవటం శుద్ధ పొరపాటు. ఉదాహరణకు మనం అసలు మాట్లాడుకోమనుకో; అప్పుడు ఎవరుమాత్రం ఏమనుకుంటారు కనుక? పోతే సమాజంలో ఉన్నంత కాలం సమాజంతో మనకు లెక్కేమిటనుకోవటంలో అర్థం లేదు. సమాజంలోవుండే, సంస్కరణను తెచ్చుకోవాలి. దాన్ని వొదిలిననాడు యీ సమాజం ఏ గంగలో కలుస్తే మనకేం-అదేవిధంగా మనసంగతి దానికి పట్టదు కదా!'

యీ రకం తర్కం ఎంతదూరమన్నా సాగించవొచ్చు. ఐతే ఎక్కడా కాలు జారకుండా చూసుకోవాలి. అతన్ని ఒక అపరాధిగానే భావిస్తూ సంభాషణను నడిపినట్లయితే, తన ఓటమిని అంగీకరించక తప్పదు. లేదా తనే బైటపడి తన తప్పిదాన్ని విశదీకరించమంటాడు. అప్పుడు "ఎవరి తప్పుని కాదు. ఇతరులకు తప్పువలె కనపడకుండా చూడటమే మంచిదికదా!...అందుకని మనం కొన్ని హద్దుల్ని ఏర్పరుచుకోవటం మనకూ, సమాజానికీకూడా శ్రేయస్కరం" అన్నట్లయితే, అతను ఒకరకం రాజీకి దిగుతాడు. రాజీషరతుల ప్రకారం భర్తలేని సమయంలో అతను రాకుండటం ఒకటి!

ఇదికూడా గురి తప్పినట్లయితే యీమె తన భర్తను శరణు జొచ్చటం మేలు. అనురాగ దాంపత్యాలు నమ్మకాలమీద ఆధారపడి ఉంటవి. కనుక ఆ నమ్మకాన్ని ఎన్నడూ వొదులుకోకూడదు. ఉన్నది ఉన్నట్లుగా భర్తతో చెప్పి, ఆయన లేనప్పుడు తాను ఆ స్నేహితునితో మాట్లాడటం ఇష్టం లేదనాలి. ఇది సభ్యతా ప్రపంచం నేరంగా భావించకున్నప్పటికీ, సమాజికులు అపార్థాలు చేసుకునే అవకాశాల్ని కలిగిస్తుందని మనసుకు నాటేట్లు చెప్పుకోవాలి. ఏ మాత్రం ఇంగిత జ్ఞానమున్న భర్తయినా ఆ అవకాశాలు కలగకుండా చేయటం తన కాపరానికి చేసుకునే కట్టుబాట్లుగానే గ్రహించక తప్పదు. ఒకవేళ కాస్త మన స్పర్థలు వొచ్చినప్పటికీ, ఆమె భరించి, ఆ స్నేహితునికి ఎలాటి అవకాశమూ కలిగించకుండా, అతనంటే తనకు ఇష్టం లేనట్లుగానే ప్రతి కదలికలోనూ స్పష్టపరిచినట్లయితే- ఆ స్నేహితునికూడా త్వరలోనే మోహం మొత్తగలదు.

స్నేహితునికి చెప్పే విధానంలో కొంత కఠినత్వం చూపటంకూడా అవసరమే! ప్రసన్నవదనంతో వుండటం కాముకునికి ప్రోత్సాహకరం కనుక, అతనికి నిరుత్సాహాన్ని కనబరచటం అవసరం. స్త్రీ పురుషులమధ్య స్నేహాన్ని సమాజం ఎలా అపార్థం చేసుకోగలిదో, ఎల్లమ్మమీదా పుల్లమ్మమీదా పెట్టి కథ అల్లినట్లయితే, ఆ కథల ఎందుకు చెప్పబడుతూన్నవో అతను గ్రహించ గలుగుతాడు. అన్నిటినీమించి తనభర్త ఎటూ ఒక న్యాయాధికారి స్థానంలోనే వుంటాడు కనుక, తన తర్కాలనూ, పట్టుదలనూ ఆమె విడవాడరాదు. భయపడటంవల్ల, లేదా హాని జరుగుతుందేమోనని కుంగిపోవటంవల్ల, ఆ హాని ఆహ్వానించబడుతుంది. ఏమైతేనేమి. తన హక్కులను కాపాడుకోవటమే పట్టుదలగా వుంచుకొని, వాతావరణానికి తగినట్లుగా ముందుకు సాగినట్లయితే, విజయం ఆమెకు తప్పదు.

—పి. కృష్ణమూర్తి, మద్రాసు, 24

★


# పురుషత్వానికి స్వాగతం!

ప్రాణమిత్ర : శీఘ్రస్కలనం, వీర్యం బలహీనమవటం, సాంద్రతను కోల్పోవటం, సరైన లేపనశక్తి లేకుండటం, వక్రమార్గాల్ని అనుసరించటం వల్ల పురుషాంగపు రూపంలో మార్పురావటం, స్వప్నస్కలనాలకు ఎక్కువగా గురికావటం, నీరుడులో వీర్యంపోవటం, తీగెలమాదిరిగా నీరుడు రావటం, నిద్రపట్టకుండటం, చూపు మందగించటం, నరాలబలహీనత్వం, అలసటచెందటం, రక్తక్షీణత, ఎండిపోవటం, కాళ్లూచేతులూ వొణకటం, జ్ఞాపకశక్తి తగ్గటం, మలబద్ధకం, తిన్నది సరిగా జీర్ణంకాకుండటం, వెన్నుపోటు-మొదలైనవాటికి రామబాణం లాటి మందు! స్త్రీలలో ఋతుసంబంధమైన లోపాలు, బలహీనత మొదలైన వాటిని కుదుర్చుతుంది. దీంతోపాటు మదనలేపం కూడా పైపూతకు వాడినట్లయితే దాంపత్య సుఖాన్నిపొందవొచ్చు. దీనికి పత్యపానాదులులేవు.

ప్రాణమిత్ర డబ్బా రూ. 6-0-0 మదనలేపం బుడ్డి రూ. 6-0-0
జీవమిత్ర : (మలబద్ధనివారిణి) రూ. 0-12-0 పోష్టు ఖర్చులు రూ. 2-4-0

పై మందుల సెట్టు పోష్టు ఖర్చులతోసహా రూ. 15/- వి. పి. గా పంపబడేవు

వివరాలకు : కేరళ వైద్య శాల, (అ-8)
పోష్టుబాక్సు 473, వేపేరి, మద్రాసు, 7.



# తిమింగలం సెక్స్ జీవితం

భూచరాల్లో ఏనుగును మించిన శరీర పరిమాణంగల జంతువు లేదు; కాని జలచరాల్లోని తిమింగలం, జలచరాల్లోనే కాకుండా, భూచరాల కన్న కూడా పెద్దది; ఇది ఏనుగు బరువుకు ఐదురెట్ల బరువు వుంటుంది.

తిమింగలం సెక్స్ యంత్రాంగం కూడా, దాని శరీర పరిమాణాన్ని అనుసరించే వుండటంలో ఆశ్చర్యం లేదు. నీలి తిమింగలం గర్భకోశం బరువు 1,344 పౌనులు.

తిమింగలం పొడవు 89 అడుగులు; దాని చుట్టుకొలత 43¼ అడుగులు; తల పొడవు 22½ అడుగులు; కపాలం పొడవు 10 అడుగులు; మూత్ర పిండాల బరువు 893 పౌనులు; మూత్రకోశం బరువు 727 పౌనులు. యీ జీవి ఎలా వుంటుందో మనం ఇప్పుడు తేలిగ్గా ఊహించుకోవొచ్చు.

యీ తిమింగలాలు చేపజాతికి చెందినవి కావు; ఎందుకంటే అవి సస్తన జాతికి చెందినవి. మానవుల వలెనే పిల్లలకు పాలిచ్చి పెంచుతవి.

ఆడ తిమింగలాలమధ్య మంచి సామరస్యం వుంటుంది; ఆడ తిమింగలం తన సంతానాన్ని ఎంతో అనురాగంతో చూస్తుంది. మొగ తిమింగలాలు సామాన్యంగా పోట్లాడవు. ఋతుసమయంలో ఆడవీ, మొగవీ ఎంతో ఆపేక్షతో ఉంటవి.

తిమింగలాలకుకూడా ప్రణయారాధన సమయాలున్నవి; దాంపత్యం నిర్వర్తించదలిచినప్పుడు ఆడదీ, మొగదీ కొంతదూరం యీదుకుంటూ వెళ్ళి ఆ తరువాత కలుస్తవి.

ఇతర సస్తన జాతులన్నిటికన్నా, శరీర పరిమాణానికి అత్యధిక నిష్పత్తిలో తిమింగలం శరీరంలో రక్తం వుంది. ఆడదాని రహస్యాంగం తోక మొదట్లో వుంటుంది; దానికి అటొకటీ, ఇటొకటీ స్తనాలుంటవి; వీటినుంచే తిమింగిలంపిల్ల పాలు తాగుతుంది; ఈ స్తనాలు అవసరమైనప్పుడే బైటికి వొస్తూ, అనవసరమైనప్పుడు శరీరంలోకి ముడుచుకొని పోగలవు.

ఇందువల్ల ఒక ఉపయోగం వున్నట్లు తోస్తుంది. తల్లి, పిల్లకు పాలివ్వాలన్న

ప్పుడు తన పిల్లలను దాని నోట్లోకి బలవంతంగాకూడా నెట్టగలదు; నీటి మట్టానికి అడుగున తల్లి తన బిడ్డకు ఆహారాన్ని ఇవ్వగలుగుతుంది.

నీటి ఆహారం జలచరాలే! అన్ని తిమింగలాలూ తలమీదవున్న పెద్దపెద్ద ముక్కు రంధ్రాలద్వారా గాలిని పీలుస్తవి. తిమింగలం చాలాసేపు నీటి అడుగునవుండి, గాలి పీల్చుకునేందుకు నీటి పైకి వొస్తుంది; ఇంతకుపూర్వం పీల్చుకున్నగాలి, దాని వూపిరి తిత్తులలోని తడితోపాటు విపరీతంగా వేడెక్కటం వల్ల, నీటిపైకిరాగానే అది నీటిఆవిరిసే వెడలగ్రక్కుతుంది. దూరాన్నుంచి చూసేవాళ్లకు అది సముద్రపునీటిని విరజిమ్ముతోందనిపిస్తుంది; ఈ పొరపాటు చాలా బొమ్మల్లోకూడా చూడనవుతుంది.

కొత్తగా జన్మించిన తిమింగలంలో కొవ్వుపదార్థం తక్కువగా వుంటుంది; బహుశా ఇది కారణంగానే తిమింగలం పిల్లను కనేందుకు వేడిగావుండే సముద్రజలాల్ని వెతుక్కుంటుంది. గర్భంలోని తిమింగలం, మానవ గర్భస్థ పిండంలో వలెనే, మాయ (Placenta) నుంచి తన ఆహారాన్ని తీసుకుంటూ వుంటుంది. తమాషా- తిమింగలం తగినంతగా పెరగకముందే, తల్లి గర్భం నుంచి బైటపడదు; పిల్ల తిమింగలం తల్లి తిమింగలంలో 5-వ భాగంనుంచీ, 3-వ భాగంవరకూ వుంటుంది; దీని పొడవు 20 అడుగులదాకా వుంటుంది. బరువు 8 టన్నులు వుంటుంది.

సర్వ సామాన్యంగా ఒక్కొక్కాన్పులో తిమింగిలం ఒకే పిల్లను కంటుంది; అరుదుగా కవలలు కలగటం కద్దు. ఒకానొక నీలితిమింగిలంలో పెరుగుదలలోవున్న ఏడు పిండాలు గమనించబడినవి! తిమింగలాలు పుట్టటానికి ఒక సీజన్ వున్నట్లు తోస్తుంది. సామాన్యంగా వసంతం చివరి భాగంలోనో, ఎండాకాలం మొదటిలోనో పిల్లలు పుడుతవి. ఐతే వేడిప్రదేశాల్లో నివశించే తిమింగలాలకు ఒక ఋతువు వున్నట్లు తోచదు.

తిమింగలం ఎంతకాలం బతుకుతుందో సరిగ్గా తెలియదు. కొద్ది వయస్సు వొచ్చిన తిమింగలంపిల్ల తల్లితోపాటు యీదుతూండటం గమనించవొచ్చు; దీనిపొడుగు 40 నుంచీ 50 అడుగుల వరకూ వుంటుంది; ఇది తల్లి పాలమీదనే పెరుగుతూండి ఉండాలి. మొత్తంమీద మొదటి సంవత్సరకాలంలోనే ఇది తల్లిపాలుతాగి దాదాపు రెట్టింపు సైజుకు పెరుగుతుంది. యీ విధంగా ఆడతిమింగలం 60 అడుగుల పొడుగు ఎదిగాక, గర్భాన్ని ధరిస్తుంది; చాలా చిన్నవయస్సులోనే తిమింగలం సెక్సు జీవితం ఆరంభమౌతుందనవొచ్చు.

జీవితంమీద విరక్తి పుట్టేమో ముసలితనంలో కొన్ని మొగ తిమింగలాలు ధృవాల ప్రాంతాలకు జేరుతూంటవి. తిమింగలం బహుభార్యాత్వ విధానాన్నే అనుసరిస్తుంది; ఒకటి లేదా రెండు మొగతిమింగలాల అజమాయిషీ కింద, ఒక తండా ఆడ తిమింగలాలు ఉంటూంటవి.

తిమింగలం శరీరంలోని ఎముకల్లో

చాలా భాగం మెత్తగానే ఉంటవి; ఎముకల్లోపల విశేషంగా నూనె వుంటుంది. తిమింగలం శరీరంనుంచి వొచ్చే యీ నూనె కోసమే ముఖ్యంగా, తిమింగలాల వేట జరుగుతూంటుంది. 25 రకాల తిమింగిలాలు వున్నవి. ఐతే తిమింగలాల వేటగాళ్లు 75 రకాల దాకా ఉన్నవని చెపుతూంటారు.

మొగ తిమింగలం కన్న, ఆడతిమింగలం తక్కువ పరిమాణంలోవుంటుంది. సామాన్యంగా ఇవి ముదురుగచ్చకాయ రంగులో ఉంటవి; పైభాగం మాత్రం దాదాపు నలుపురంగులో వుంటుంది. ఒక జాతి తిమింగలం 103 అడుగుల పొడుగువరకూ పెరుగుతుంది.

మానవుల్లో 9 నెలల గర్భధారణైతే తిమింగలంలో ఇది 10 నుంచీ 12 నెలలు; ఏనుగులో 18 నుంచీ 23 నెలలు; ఎలుకల్లో 19 రోజులు మాత్రం!

మొగతిమింగలం తాలూకు బీజాలు, పురుషాంగమూ శరీరంలోకే ముడుచుకొని పోగల శారీరక నిర్మాణం కనిపిస్తుంది. ఇందువల్ల అది హాయిగా యీదేందుకు వీలుగావుంటుంది. దాని పురుషాంగం దాని మొత్తం పొడుగులో 15 లేక 16 వ వొంతువుంటుంది. బీజాలు 2 అడుగుల పొడవు వుంటవి!

తమాషా-యీ వాక్యం చివరి ఫుల్ స్టాఫ్ కన్న పెద్దది కాని తిమింగలం గుడ్డు 10 12 నెలల్లో 20 అడుగుల పొడవున్న తిమింగలం పిల్లగా పెరగటం ప్రకృతిలోని విచిత్రాలలో ఒకటనేందుకు సందేహంలేదు. ప్రకృతిలోని జంతుజాలంలోకల్లా తిమింగలం బరువైనది; దీనిబరువు 9-10 టన్నుల దాకా వుంటుంది.

26 ఆగష్టు 1954 న పురిటి నెప్పులబాధ భరించలేక సేలంలో వీరమ్మాళ్ అనే 27 సం॥ల స్త్రీ భావిలోదూకింది; దూకగానే పురుడొచ్చింది. ఫైర్ సర్వీస్‌వారొచ్చి తల్లినీ బిడ్డనూ రక్షించారు.

# నశించే జాతి

ఉత్తర నార్తంబర్లండ్‌లోని చిల్లింగ్ హామ్ పార్కులో నివశించే గొడ్లు చాలా ప్రసిద్ధికన్నవి. 13-వ శతాబ్దంలో అవి యీ పార్కులో వొదిలివేయబడి, పార్కు నుంచి బయటకు పొయ్యేందుకు వీల్లేకుండా అక్కడే ఉండిపోయినవని నమ్మబడుతోంది. 600 ఎకరాల విస్తీర్ణమున్న యీ పార్కే వాటినివాసం.

వీటి పుట్టు పూర్వోత్తరాలనుగూర్చి అంతగా తెలియదు; కాని ఇవి అడవి ఎద్దుల తాలూకు సంతానమనీ, యీ అడవి ఎద్దులు చరిత్రకందని కాలంలో బ్రిటన్‌లో తిరుగుతూండేవనీ నమ్మబడుతోంది.

యీ గొడ్లు భయంకరమైనవి; చాలా పోకిరీగా ఉండటంవల్ల వీటి దగ్గిరికి పొయ్యేందుకు ఎవ్వరూ సాహసించరు. యీ మందను పాలించేది 'కింగ్ బుల్' అనబడే ఎద్దు; అది శతృవులను పోరాడగలిగినంత కాలం, రాజరికాన్ని వెలిగిస్తూనే వుంటుంది. దూడల్ని లెక్కించుకోవటం, దారి తప్పిన వాటిని వెతికి తేవటం, మందలో శాంతిని కాపాడటం యీ ఎద్దు బాధ్యత.

గొడ్లు బెదిరి పారిపోవటం మొదలెడుతే, యీ ఎద్దు మాత్రం చివరిదాకా వుండి, ఆ రాబొయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగావుండాలి. మరో ఎద్దుతో పోట్లాటవొచ్చి ఓడిపోతే, తాత్కాలికంగా మందనుంచి వెలివేయబడుతుంది.

1947-సం॥ చలికాలంలో జబ్బుచేసి 30 పశువులకుగాను, 13 మాత్రమే జీవించగలిగినవి. బతికినవికూడా చలిదెబ్బ తట్టుకోలేక, సంవత్సరన్నర కాలం కదలకుండా నీరసంగా పడిఉన్నవి.

యీ జాతి నశించి పోతుందేమోననే భయం శాస్త్రజ్ఞులకు కలిగింది. 700 సం॥ల పాటు పెరగగలిగిన జాతి నాలుగు ఆవులమీదా, ఒక ఎద్దుమీదా జాతి ఉద్ధరణ బాధ్యతల్ని మోపవలసివొచ్చింది, కొన్ని ముసలితనంవల్ల చచ్చినప్పటికీ, బతికినవి వయసువారిగా ఉండటం ఆశాజనకం.

ఎనిమిది సంవత్సరాలుగా ఒకే 'కింగ్ బుల్' పాలిస్తూవుంది; మందలోని సంతానమంతా ఒకే రక్తం తాలూకుదని చెప్పవొచ్చు.

వీటికి మానవులపొత్తు బొత్తిగా గిట్టదు. దూడను ఎవరైనా తాకినట్లయితే, మందంతా కలిసి దాన్ని చంపివేస్తవి. 1947 చలికాలంలో బైటినుంచి పంపిన పచ్చుగడ్డినికూడా ఇవి తాకలేదు.

వీటిని దగ్గర్నుంచి పరిశీలించే అవకాశాలు లేవు; దూడల్ని కనేప్పుడు సహాయం చేయటం అసలే కుదరదు. యీ దూడల్నికనటం ఎక్కడో రహస్యంగా జరుగుతుంది. పదిరోజులయ్యాక కాని, దూడ మందలోకి రాదు; అదీ ఇన్నాళ్ళూ ఎక్కడోదాక్కొని, దూడ బలంగావున్నదనుకున్నాక, తల్లి దాన్ని వెంటపెట్టుకొని సూర్యాస్తమయ సమయంలో మందలోకి లాక్కొస్తుంది. 'కింగ్ బుల్' యీ దూడకు ఎదురువెళ్లి స్వాగతమిచ్చి, మందలోని మిగతా పశువులకు పరిచయం చేస్తుంది. స్వేచ్ఛను అనుభవించే యీ పశువులకు గాధవిచిత్రంగానే వుంటుంది.

## మీరంతా చదివితీరవలసిన ముఖ్యమైన మూడు పుస్తకాలు

**ప్రణయకళ:**

హావలాక్ ఎల్లీస్‌ను అనుసరించి 'క్రాంతినాథ్' రచన.

నూతన దంపతులకూ, దాంపత్య జీవితంలో ప్రవేశించబోయ్యేవారికీ ఎంతో సహాయభూతంగా ఎన్నో సమస్యల్ని విడమరచి చర్చించిన గ్రంథం. వెల: రూపాయి.

**లైంగిక విజ్ఞానం:**

లైంగికవిజ్ఞాన ఆవశ్యకత, ఏది అజ్ఞానం? ఏది విజ్ఞానం? పిల్లల్లో లైంగిక వాంఛలు ఎలా ఉంటవి? బహిష్టులో స్త్రీకి విశ్రాంతి కావాలా? నగ్నత్వం కళేనా? అది నిత్యజీవితానికి ఎంత వరకూ అవసరం? మొదలైన లక్షప్రశ్నలకు ఇందులో జవాబులున్నవి. హావలాక్ ఎల్లీస్‌ను అనుసరించి 'క్రాంతినాథ్' రచన.

88 పేజీలు: వెల: రూపాయి.

**గర్భనిరోధం:**

అధునాతన ప్రపంచంలోని అతి ముఖ్యసమస్య చర్చించబడింది. గర్భనిరోధ మార్గాలలో అత్యుత్తమమైనది తెలుసుకొని, అనుసరించి దాంపత్య జీవితానందాన్ని రుచిచూచేందుకు అనుకూలంగా ఎన్నో బొమ్మలతో వివరంగా రచింపబడింది. వెల: ఎనిమిదణాలు. ప్రతి పుస్తకానికీ పోస్టేజి ప్రత్యేకం.

రూ 3-0-0 మనియార్డరు ద్వారా పంపేవారికి, పై మూడు పుస్తకాలూ రిజిష్టర్డ్ పోస్టులో పంపబడుతవి.

ఏజంట్లకు 25% కమీషన్.

**వివరాలకు:**

### అభిసారిక కార్యాలయం

4, బాలుమొదలి వీధి, మద్రాసు 17.

Edited & Published by Dhanikonda Hanumantha Rao at Abhisarika Office, 4, Balu Mudali St., Madras-17, and Printed by M. Venkateswarlu at M. V. S. Press, 1/28, Parish Venkatachala Iyer St., Madras, 1.



ప్రణయోపాసి